www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

శుక్రవారం | 18-1-2019 | పేజీలు: 14 + 20 | వెల: రూ. 6.50 | సంపుటి: 59 సంచిక: 273 | శ్రీవిళంబినామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంతరుతువు, పుష్యమాసం, శుక్లపక్షం; తిథి: ద్వాదశి రా. 8.23 తదుపరి త్రయోదశి; నక్షత్రం: రోహిణి మ. 12.26 తదుపరి మృగశిర; వర్జ్యం: సా. 5.35-7.03; దుర్ముహూర్తం: ఉ. 9.07-9.51-మ. 12.48-1.32; అమృతఘడియలు: ఉ. 9.24-10.55, రా. 2.25-3.54; రాహుకాలం: ఉ. 10.30-12.00 వరకు; సూర్యోదయం: 6.55; సూర్యాస్తమయం: 5.57 | విజయవాడ సిటీ*

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Kakinada | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad | Bangalore and Chennai

సాగుకు సాయం

కొత్త పథకానికి సర్కారు శ్రీకారం!

ప్రతి రైతుకూ పెట్టుబడి నిధి

కౌలు రైతులకూ ప్రయోజనం

ఈ ఖరీఫ్ నుంచే అమలు!?

విధి విధానాలపై కసరత్తు.. కేబినెట్ భేటీలో తుది నిర్ణయం!



తడిసిన ధాన్యం సేకరణ!

రైతుల కోసం సీఎం సానుకూల నిర్ణయం

క్వింటా రూ.1550 చొప్పున కొనుగోలు

3 లక్షల టన్నుల నిల్వలున్నట్టు అంచనా 3

ప్రభుత్వంపై 465 కోట్ల భారం: మంత్రి సోమిరెడ్డి

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అమరావతి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): వృద్ధాప్య, వికలాంగ, ఇతర సామాజిక పింఛన్లను రెట్టింపు చేసిన రాష్ట్ర ప్రభుత్వం... అన్నదాతలకూ ఆర్థిక వరం ప్రకటించేందుకు సిద్ధమవుతోంది. దీనిపై అధికారుల స్థాయిలో కసరత్తు ఇప్పటికే మొదలైంది. బహుశా... ఈనెల 21న (సోమవారం) జరగనున్న మంత్రివర్గ సమావేశంలో ఈ పథకంపై చర్చించి, ఆమోదించే అవకాశం కనిపిస్తోంది. విశ్వసనీయవర్గాల సమాచారం ప్రకారం... రైతులు పంటల సాగుకు అవసరమైన పెట్టుబడి సొమ్ముకోసం వెతుక్కునే అవసరంలేకుండా చూడాలని ప్రభుత్వం భావిస్తోంది. దీనికోసం రైతుకు నేరుగా కొంత ఆర్థిక సాయం చేయాలన్న ఉద్దేశంతో ఉంది. తెలంగాణలో 'రైతు బంధు' పేరిట పెట్టుబడి సహాయం అందిస్తున్నారు. దీనికంటే మెరుగ్గా... భూమిని స్వయంగా సాగుచేసుకునే వారితోపాటు, కౌలుకు తీసుకున్న రైతులకూ సహాయం అందించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తున్నట్లు సమాచారం! వచ్చే ఖరీఫ్ సీజన్ నుంచే రైతుకు పెట్టుబడి సహాయం చేయాలని దాదాపుగా నిర్ణయించినట్లు తెలిసింది. ఎకరాకు ఎంత మొత్తం ఇవ్వాలి, దీనికి సంబంధించిన విధి విధానాలు, పథకం పేరును ఖరారు చేయాల్సి ఉంది. కేవలం భూ యజమానులకే కాకుండా... కౌలు రైతులకు కూడా మేలు చేసేలా 'పెట్టుబడి సాయం' అందించాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలిసింది. రైతే భూమిని సాగు చేసుకుంటూ ఉంటే నేరుగా ఆయనకే లబ్ధి చేకూరుస్తారు. ఒకవేళ కౌలుకు ఇచ్చి ఉంటే... సహాయాన్ని ఇద్దరి మధ్య పంచితే బాగుంటుందని ఆలోచిస్తున్నారు. ఇలా చేస్తే ఇద్దరికీ ఊరటగా ఉంటుందని భావిస్తున్నారు. ఇప్పటికే కౌలు రైతులకూ రుణాలు అందేలా ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్న సంగతి తెలిసిందే. రైతులకు సాయం చేయడంలో ఆదర్శ రాష్ట్రంగా ఉన్నామని... వారిని మరింతగా ఆదుకుంటామని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం ఇన్‌పుట్ సబ్సిడీ, విత్తనాలు, ఎరువుల సరఫరా, పశుపోషణకు సాయం, సాగునీరు, కేంద్ర ప్రభుత్వంతో నిమిత్తం లేకుండా మద్దతు ధరతో పంటల కొనుగోలు, రుణమాఫీ వంటి పథకాలు, చర్యల ద్వారా రైతులకు అండగా ఉంటున్నామని... ఇంకా ఏం చేస్తే బాగుంటుందో పరిశీలించాలని

మిగతా 2వ పేజీలో...



సీఎం సమక్షంలో టీడీపీలో చేరిన సీనియర్ నేత అహ్మదుల్లా, పక్కన కుమారుడు అష్రఫ్

రాష్ట్రంపై గద్దల్లా పడుతూ!

మనపై పగబట్టారు

మోదీ సూచనల మేరకే ఇదంతా

అవినీతి గొంగళి పురుగును కౌగిలించుకున్న కేసీఆర్

26 బీసీ కులాలను తొలగించిన వారితో జగన్ అంటకాగుతున్నారు

టీఆర్ఎస్, వైసీపీ ముసుగు తొలగింది

సోషల్ మీడియాను దుర్వినియోగం చేసిందే వైసీపీ

సీబీఐ జేడీపై దుష్ప్రచారం.. పవన్ పెళ్లిళ్లపై అసభ్య ప్రచారం


టీఆర్ఎస్ నేతల పర్యటనల్లో పాల్గొన వద్దు.. టీడీపీ నేతలకు బాబు పిలుపు

రాష్ట్రాన్ని ప్రజలే కాపాడుకోవాలి

మళ్లీ టీడీపీ.. చారిత్రక అవసరం: సీఎం

అమరావతి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ సూచనల మేరకు.. వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్, పక్కరాష్ట్ర సీఎం కేసీఆర్.. నవ్యాంధ్రపై పగబట్టారని ముఖ్యమంత్రి చంద్రబాబు మండిపడ్డారు. రాష్ట్రాభివృద్ధిని దెబ్బతీయాలని చూస్తున్నారని దుయ్యబట్టారు. అభివృద్ధిని తన్నుకుపోయేందుకు రాష్ట్రంపై గద్దల్లా వాలడానికి ప్రయత్నాలు సాగుతున్నాయని ఆరోపించారు. ఎక్సైజ్ మంత్రి కేఎస్ జవహర్ నేతృత్వంలో డప్పు కళాకారులు, చర్మకారులు

మిగతా 11వ పేజీలో...



కేంద్రానికి ఆ హక్కు లేదు

కోడి కత్తి కేసు ఎన్ఐఏ పరిధిలోకి రాదు

హైకోర్టులో రేపు పిటిషన్ వేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం 12

తేలేవరకూ రికార్డులిచ్చేదీ లేదు!.. కేంద్రం తీరు సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధం

విశాఖలో 'స్థానిక' మేళా

ఉన్న దగ్గరే ఉద్యోగం.. ఉత్తరాంధ్ర నుంచి ఏటా 5 వేల ఇంజనీర్లు

12 ఐటీ, పరిశ్రమల వృద్ధితో విశాఖలోనే కొలువు

సర్కారు ప్రోత్సాహకాలతో కదిలొస్తున్న ఎన్ఆర్ఐలు

డిగ్రీ చదివితే ఏదో కంపెనీలో అవకాశం.. రెండేళ్లుగా ఐటీకి ఊపు



ఆంధ్రజ్యోతి పరిశీలన

సిసోడియా బదిలీ

ఎన్నికల కొత్త ప్రధానాధికారిగా గోపాలకృష్ణ ద్వివేది

మరింత సమర్థుడి కోసం ఈసీ నిర్ణయం

ముగ్గురిని సూచించిన రాష్ట్రప్రభుత్వం

వారిలో ద్వివేది ఎంపిక; ఉత్తర్వులు జారీ

స్వేచ్ఛాయుత ఎన్నికలకు సీఈవో హామీ 12



ద్వివేది

అస్థానాకు ఉద్వాసన

మరో ముగ్గురు సీబీఐ అధికారులపైనా వేటు

ఇందులో ఇద్దరు వర్మ టీమ్‌లోని వారు 14





పరంజ్యోతి

నరజాతికి యయాతి 'జాగృతి' గీతి



చంద్రవంశపు ముఖ్య రాజుల్లో నహుష చక్రవర్తి కుమారుడు యయాతి ఒకడు. రాక్షస గురువు శుక్రాచార్యుని కుమార్తె దేవయాని ఆయన భార్య. రాక్షస రాజైన వృషపర్వుని కూతురు శర్మిష్ఠను దేవయాని తనకు దాసీగా చేసుకుంటుంది. శర్మిష్ఠతో శరీర సంపర్కం కూడదని శుక్రాచార్యుడు యయాతిని హెచ్చరిస్తాడు. దేవయానికి యయాతి వలన యదువు, తుర్వసులనే ఇద్దరు పుత్రులు కల్గుతారు. ఒకనాటి రాత్రి శర్మిష్ఠ ఏకాంతంగా ఉన్న యయాతి వద్దకు చేరుతుంది. వారికి ద్రుహ్యుడు, అనువు, పూరువు అనే కుమారులు కలిగారు. భరించలేని దేవయాని తండ్రి వద్దకువెళ్లి గోడు వెళ్లబోసుకుంది. తండ్రి కూడా కూతురు పక్షానే నిలిచాడు. 'యవ్వన మదంతో మాట తప్పావు గాన నీకు మగువలు ఏవగించుకొనే ముదిమి(ముసలితనం) వచ్చుగాక!' అని యయాతిని అనాలోచితంగా శపించాడు. ఐతే, 'ఏ యువకుడైనా నీ వృద్ధాప్యం గ్రహించి నీకు తన యవ్వనం ఇచ్చినట్లైతే యథేచ్ఛగా నీవు భోగాలు అనుభవించగలవు' అని పరిహారం సూచించాడు. మిగిలిన కుమారులు తిరస్కరించినా పిన్నవాడైన పూరువు తన లేత వయసును తండ్రికిచ్చి ఆయన ముదిమిని గ్రహించాడు. యయాతి యువకుడై వెయ్యేండ్లు భోగాలనుభవించినా తృప్తి కలగలేదు. చివరకు పూర్వ పుణ్య ప్రభావంతో వైరాగ్యం కల్గగా తిరిగి తన యవ్వనాన్ని తనయునికిచ్చాడు. భూమి మీద రెండు యవ్వన కాలాల భోగాలు అనుభవించిన ఏకైక వ్యక్తిగా నిలిచిన యయాతి ఒక శుభోదయాన తన అనుభవ సారాన్ని భావితరాల వారికి కనువిప్పు కలిగేవిధంగా జాగృతి గీతి (మేలుకొలుపు గానం)గా నీతిని బోధించాడు.

న జాతుకామః కామానాం ఉపభోగేన శామ్యతి
హవిషా కృష్ణ వర్త్మేవ భూయ ఏవ అభివర్ధతే

(ఈ శ్లోకం ఆధ్యాత్మిక సాధనకే సారభూతమైనది. ఇది భాగవతంలోనేగాక మహాభారతంలో, మనుస్మృతిలో, విష్ణు పురాణంలో కూడా ఉంది. ఎన్నిచోట్ల వస్తేనేమి? అధ్యాత్మంలో పునరుక్తి దోషం కాదు కదా! పైగా విషయం బలపడటానికి వినియోగపడుతుంది.) "దేవయానీ! 'న జాతు కామః కామానాం..' అగ్నిలో ఆజ్యం(నెయ్యి) పడేకొద్దీ అగ్ని శాంతించక జ్వాలలు చెలరేగునట్లు అనుభవించే కొద్దీ కోరికలు పెరుగుతూ పోతాయేకానీ ఎప్పటికీ శాంతించవు. మనశ్శాంతి కావాలంటే.. సర్వదుఃఖ కారణమైన తృష్ణా త్యాగం అనివార్యం. మానవ మృగాల సాంగత్యం కన్నా వన్యమృగాల సహవాసమే మిన్న కాన నేను అడవికి వెళ్లి మృగాలతో కలిసి జీవిస్తా" అంటూ పూరువును సార్వభౌమునిగా చేసి రెక్కలు వచ్చిన పక్షి గూటిని వదలినట్లు యయాతి ఇంద్రియ సుఖాన్ని త్యజించి బ్రహ్మ యందు మనసు నిలిపి పరమ భాగవతుల గతిని పొందాడు. దేవయాని కూడ భర్తను అనుసరించి తరించింది.

- తంగిరాల రాజేంద్రప్రసాద శర్మ, 9866836006

ముప్పన్నెలకు వందనం



తిరుపతి రైల్వేస్టేషన్ ఎదుట 100 అడుగుల స్తంభంపై జాతీయ పతాకాన్ని ఏర్పాటుచేశారు. రైల్వే బోర్డు చైర్మన్ వినోద్ కుమార్ యాదవ్ మహిళా ఉద్యోగినులతో కలసి ఈ జెండాను ఆవిష్కరించారు. శ్రీవారి పాదాలచెంత ఈ భారీ జాతీయ పతాకాన్ని ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. తిరుపతి రైల్వేస్టేషన్‌ను రూ.450 కోట్లతో అభివృద్ధి చేయనున్నామని చెప్పారు. - తిరుపతి అర్బన్

ఇంటికి తాళం.. పోలీసు నేత్రం..

- ప్రజలు చెప్పకున్నా గుంటూరు పోలీసులు కాపలా
- ఎల్‌హెచ్‌ఎంఎస్ నుంచి 'లాక్డ్ హౌస్ సర్వే లెన్స్'కు అప్‌గ్రేడ్
- రాష్ట్రమంతా అమలుకు సన్నాహాలు

అమరావతి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): రాత్రిపూట దొంగతనాలు జరగకుండా పోలీసు గస్తీ నిర్వహిస్తుంటారు. టెక్నాలజీకి ప్రాధాన్యమిస్తోన్న ఏపీ పోలీసులు రెండేళ్లుగా లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్ (ఎల్‌హెచ్‌ఎంఎస్) అందుబాటులోకి తీసుకొచ్చారు. దీంతో ఇళ్లల్లోకి దూరిన దొంగలు ఎక్కడికక్కడ పోలీసులకు పట్టుబడ్డారు. ఈ విధానం రాష్ట్రవ్యాప్తంగా అమల్లో ఉన్నా అక్కడక్కడా దొంగతనాలు జరుగుతూనే ఉన్నాయి. కారణాలను విశ్లేషించిన గుంటూరు జిల్లా పోలీసులు సమస్యను పసిగట్టారు. ఎల్‌హెచ్‌ఎంఎస్ ఇంట్లో పెడితే మన గుట్టు బయట పడుతుందేమో అనే అనుమానంతో పలువురు ఇళ్ల యజమానులు బయటికి వెళ్లేముందు పోలీసులకు చెప్పడంలేదు. దీంతో ఇంట్లో దొంగలు పడినా తెలియడంలేదు. ఇటీవల గుంటూరు జిల్లాలో జరిగిన కొన్ని దొంగతనాల కేసుల్లో ఇంటి యజమానులు, బాధితులను ప్రశ్నించినప్పుడు ఈ విషయం వెల్లడైంది. ఈ సమస్యకు చెక్ పెట్టేందుకు ఎల్‌హెచ్‌ఎంఎస్‌కు పోలీసు పహారాను జోడించి లాక్డ్ హౌస్ సర్వే లెన్స్ (ఎల్‌హెచ్‌ఎస్) విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చారు. ఇది విజయవంతం కావడంతో దీన్ని రాష్ట్రవ్యాప్తంగా అమలు చేసేందుకు పోలీసు ఉన్నతాధికారులు కసరత్తు మొదలు పెట్టారు.

ఎలా పనిచేస్తుంది..?

ప్రతి పోలీసు స్టేషన్ పరిధిలో 24 గంటలపాటు గస్తీ నిర్వహించే పోలీసులుంటారు. ప్రతి ఎనిమిది గంటలకు ఒకసారి డ్యూటీ మారుతుంటారు. ఉదయం గస్తీలో తాళం వేసిన ఇళ్లను ఫోటోలు తీయాలి. అవి ఎల్‌హెచ్‌ఎస్‌లో ఆటోమేటిక్‌గా అప్‌లోడ్ అవుతాయి. మధ్యాహ్నం డ్యూటీకి వచ్చే పోలీసులు వాటిని పరిశీలిస్తారు. సాయంత్రం ఆ ఇంటి తాళం తీస్తే యజమాని వచ్చారని తెలుసుకుని ఆ ఫోటో అప్‌లోడ్ చేస్తారు. రాకపోతే తాళం వేసి ఉన్న ఇంటి వద్ద కాసేపు గస్తీ కాస్తారు. ఆ ఇంటికి పదిమీటర్ల పరిధిలో కనీసం 59 సెకన్లు నిలుచుంటే ఆటోమేటిక్‌గా గస్తీ పోలీసుకు ప్రజెంట్ పడి గ్రీన్ సిగ్నల్ వస్తుంది. ఒకవేళ ఎవరైనా ఆ ఇంటి ప్రాంగణంలోకి వెళ్లకుంటే ఎస్‌హెచ్‌వో నుంచి ఎస్పీ వరకూ తెలిసిపోతుంది. దీంతోపాటు ఆ ప్రాంతా ల్లో ఎస్‌హెచ్‌వో పెట్రోలింగ్ చేయాల్సి ఉంటుం ది. ఈ రెండిటితోపాటు తాళాలు వేసి ఉన్న ఇళ్లకు సమీపంలోని సీసీ కెమెరాల ఫుటేజీని కూడా కంట్రోల్ రూమ్‌లో గమనిస్తుంటారు. ఎవరైనా అనుమానితులు ఆ ప్రాంతాల్లో సంచరిస్తున్నట్లు అనిపిస్తే గస్తీ పోలీసులకు వెంటనే సమాచారం అందజేస్తారు. ఎల్‌హెచ్ ఎంఎస్‌తో పాటు సర్వేలెన్స్ నిఘా, సీసీ కెమెరాల ఫుటేజీపై కన్ను వేస్తూ మూడు కోణాల్లో ఇళ్లకు కాపాలా కాస్తారు.



ఎల్‌హెచ్‌ఎస్‌లో ఏముంది..?

రెండున్నరేళ్లుగా రాష్ట్రంలో బాగా పాపులర్ అయిన పోలీసు యాప్ ఏదైనా ఉందంటే ఎల్‌హెచ్‌ఎంఎస్ మాత్రమే. ఈ పరికరాన్ని ఇళ్లల్లో ఏర్పాటు చేస్తే.. ఆ ఇంట్లోకి ప్రవేశించే వ్యక్తుల సమాచారాన్ని స్థానిక పోలీసులకు, కంట్రోల్ రూమ్‌కు చేరవేస్తుంది. దీంతో సమీపంలోని పెట్రోలింగ్ పోలీసులు ఆ ఇంటిని చుట్టుముట్టి దొంగలను పట్టుకొంటున్నారు. అయితే వ్యక్తిగత ఆస్తుల వివరాలు లీకయ్యే ప్రమాదం ఉందని కొందరు, అవగాహన లేక మరికొందరు ఆసక్తి చూపడం లేదు. దీంతో ఎల్‌హెచ్‌ఎస్‌ను అందుబాటులోకి తెచ్చారు.

అనుమానాలొద్దు..: ఎస్పీ రాజశేఖర్‌బాబు

ఎల్‌హెచ్‌ఎంఎస్ ద్వారా పోలీసులు ఏదో సమాచారాన్ని సేకరిస్తారని ఎవరూ అనుమానాలు పెట్టుకోవద్దని గుంటూరు రూరల్ ఎస్పీ రాజశేఖర్‌బాబు అన్నారు. 'ప్రజల ధన, మాన, ప్రాణాలకు రక్షణ కల్పించడం పోలీసుల విధి. దొంగలు, రౌడీలు, సంఘ విద్రోహ శక్తులపై నిఘా పెడతాం. అంతే తప్ప ప్రజల ఆస్తుల వివరాలు ఎందుకు సేకరిస్తాం' అని ఆయన ప్రశ్నించారు. అనంతపురంలో హౌస్ బ్రేకింగ్స్‌కు ఎలా బ్రేకులేయాలన్న ఆలోచనతో పుట్టిన ఎల్‌హెచ్‌ఎంఎస్ మంచి ఫలితాల్ని ఇచ్చిందన్నారు. అందుకే ప్రజలు ముందుకొచ్చినా రాకున్నా పోలీసులుగా తమ డ్యూటీ తాము చేయాలి కాబట్టి ఎల్‌హెచ్‌ఎస్‌కు అప్‌గ్రేడ్ అయ్యామని వివరించారు. దీంతోపాటు అత్యాచారాల నిరోధానికీ ప్రత్యేక శ్రద్ధ పెట్టామని, జిల్లాలో ఎక్కడికక్కడ శక్తి ద్వారా ప్రత్యేక కార్యక్రమాలను ఏర్పాటుచేసి ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. రౌడీలు సంఘ విద్రోహశక్తుల విషయంలో చాలా కఠినంగా వ్యవహరిస్తున్నామని పేర్కొన్నారు.

త్వరలో 3150 పోలీస్ పోస్టులు

- రాష్ట్రంలో మూడు ప్రాంతీయ సైబర్ ఫోరెన్సిక్ ల్యాబ్‌లు: చినరాజప్ప

రాజమహేంద్రవరం, జనవరి 17: రాష్ట్రంలో ఇప్పటికే ఆరు వేల మంది పోలీసులు వివిధ స్థాయిల్లో కొత్తగా విధుల్లో చేరారని, మరో 3,150 పోస్టులు మంజూరు కానున్నాయని హోంమంత్రి చినరాజప్ప చెప్పారు. రాష్ట్రంలోనే ప్రథమంగా తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో రూ.3.50కోట్లతో నిర్మించిన ప్రాంతీయ సైబర్ ఫోరెన్సిక్ ల్యాబ్‌ను ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సోషల్ మీడియా ప్రభావంతో సైబర్ నేరాలు ఇటీవల పెరిగాయన్నారు. అన్ని రకాల సైబర్ నేరాలను అదుపు చేయడానికి ఆధునిక పరికరాలను పోలీస్‌శాఖకు సమకూర్చామన్నారు. కర్నూలు, తిరుపతిలో కూడా సైబర్ ఫోరెన్సిక్ ల్యాబ్‌లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. రాజమహేంద్రవరం ల్యాబ్ పరిధిలోకి శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం రూరల్, ఉభయ గోదావరి జిల్లాలు వస్తాయన్నారు.

ఏపీఎస్‌ఎంఐడీసీలో జీఎస్టీ అమలు

- యాజమాన్య సమస్యలు మా దృష్టికి తేవాలి: ఎండీ
- 'ఆంధ్రజ్యోతి' కథనంపై స్పందన

అమరావతి, జనవరి 17(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ మెడికల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(ఏపీఎస్‌ఎంఐడీసీ)లో జీఎస్టీని అమలు చేస్తున్నామని ఆ కార్పొరేషన్ ఎండీ తెలిపారు. 'ఆరోగ్యశాఖలో అమలుకాని జీఎస్టీ.. ఇబ్బందుల్లో చిన్న తరహా పరిశ్రమలు' శీర్షికన గురువారం 'ఆంధ్రజ్యోతి' ప్రధాన సంచికలో ప్రచురితమైన కథనంపై ఎండీ స్పందించారు. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవోలు 497, 58 ప్రకారం జీఎస్టీని అమలు చేస్తున్నామని, చిన్న తరహా పరిశ్రమలకు ప్రత్యేక ప్రోత్సాహకాలు కూడా ఇస్తున్నామన్నారు. చిన్నతరహా పరిశ్రమల యజమానులకు సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.

సాగుకు సాయం

(మొదటి పేజీ తరువాయి)

అధికారులను సీఎం ఆదేశించారు. ఈ క్రమంలోనే రైతుకు పెట్టుబడి సహాయం అందించాలనే ప్రతిపాదనలు వచ్చాయి. దీనిపై మంత్రివర్గంలో చర్చించి నిర్ణయం తీసుకుంటారు.

రైతుకు కష్టం ఉండొద్దు!

మత్స్య పరిశ్రమ నుంచి పాడి అభివృద్ధి వరకు రైతులు ఆర్థికంగా అభివృద్ధి సాధించేలా ప్రభుత్వం పలు పథకాలు అమలు చేస్తోంది. గోకులం, మినీ గోకులం, గడ్డి పెంపకం, సైలేజ్ పంపిణీ, దాణామృతం పంపిణీ తదితర పథకాల ద్వారా రైతుకు అదనపు ఆదాయం వచ్చేలా చేసింది. '2005 నుంచి 2014వరకు రాష్ట్రంలో ఏటా వెయ్యి మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. ఇప్పుడు ఆ సంఖ్య వందకు లోపే ఉంది. భవిష్యత్తులో అసలు రైతు ఆత్మహత్యలనేవి లేకుండా అన్నిరకాల చర్యలు తీసుకుంటాం. ఇందులో భాగంగానే పెట్టుబడి పథకానికి రూపకల్పన చేస్తున్నాం' అని ఒక అధికారి తెలిపారు.

వెన్నుకు సాంకేతిక దన్ను

- 'ఆస్టియాటమీ సిమ్యులేషన్' విధానంలో రాష్ట్రంలో తొలిసారిగా శస్త్రచికిత్స
- గుంటూరు వైద్యుడి ఘనత



శస్త్రచికిత్సకు ముందు.. తర్వాత డాక్టర్ నరేశ్‌బాబుతో సత్యనారాయణ

గుంటూరు(మెడికల్), జనవరి 17: వెన్నెముక వంగిపోయిన బాధితుడికి గుంటూరు డాక్టర్లు ఆస్టియాటమీ సిమ్యులేషన్ గైడెడ్ విధానంలో విజయవంతంగా శస్త్రచికిత్స చేశారు. ఈ తరహా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగించడం ఏపీలో ఇదే తొలిసారి. వివరాల్లోకి వెళితే.. గుంటూరు జిల్లా మంగళగిరికి చెందిన చేనేత కార్మికుడు నాగులపల్లి సత్యనారాయణ(40) పదేళ్లుగా వెన్నెముక వంగిపోయి బాధపడుతున్నాడు. కీళ్లవాతం కారణంగా ఎముకలు అంటుకుపోయి నడుం బిగుసుకుపోయింది. వైద్య పరిభాషలో ఈ సమస్యను యాంకైలోజింగ్ స్పాండిలోసిస్‌గా (బ్యాంబూ స్పైన్) పిలుస్తారు. ఇలాంటి రోగులకు శస్త్రచికిత్స చేసే సమయంలో ఏ చిన్న పొరపాటు జరిగినా రెండు కాళ్లూ పూర్తిగా చచ్చుబడే ప్రమాదం ఉంటుంది. ఈ కారణంగా డాక్టర్లు శస్త్రచికిత్స చేసేందుకు సాహసించలేదు. కానీ, గుంటూరులోని మల్లిక స్పైన్ సెంటర్ సర్జన్ జే నరేశ్‌బాబు విజయవంతంగా చికిత్స చేశారు. ఇందుకోసం ప్రత్యేకంగా రూ.కోటి విలువైన కంప్యూటర్ నావిగేషన్ పరికరం తెప్పించారు. తొలుత రోగి నడుం వంగిపోయిన ఇమేజ్‌లను తీసి వాటిని సిమ్యులేటర్‌పై ఇంపోజ్ చేశారు. వెన్నెముకలో ఏ ప్రాంతంలో శస్త్రచికిత్స చేసి ఎంత మేరకు ఎముక తొలగించాలో కంప్యూటర్ సాయం తీసుకున్నారు. ఆవిధంగా ఎల్-3 అనే ప్రాంతంలో ఈ నెల 10న ఆరు గంటల పాటు విజయవంతంగా శస్త్రచికిత్స చేశారు. సీఎం సహాయ నిధి కింద ప్రభుత్వం సత్యనారాయణకు రూ.3.50 లక్షలు సాయం అందజేసింది. ప్రస్తుతం రోగి పూర్తిగా కోలుకోవడంతో గురువారం డిశ్చార్జి చేశారు.

టీఆర్‌ఎస్‌లోకి వంటేరు ప్రతాప్‌రెడ్డి?

- ఎమ్మెల్సీ పదవి... గజ్వేల్ బాధ్యతలు
- పార్టీ అధినాయకత్వం నుంచి హామీ

హైదరాబాద్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): టీపీసీసీ అధికార ప్రతినిధి, కాంగ్రెస్ తరఫున ఇటీవల గజ్వేల్ నుంచి కేసీఆర్‌పై పోటీ చేసి ఓడిపోయిన వంటేరు ప్రతాప్‌రెడ్డి టీఆర్‌ఎస్‌లో చేరటం ఖాయమైంది. ఆయన శుక్రవారం సాయంత్రం బేగంపేటలోని ప్రగతి భవన్‌లో సీఎం కేసీఆర్ సమక్షంలో గులాబీ కండువా కప్పుకోనున్నారు. ఆయన చేరిక విషయాన్ని టీఆర్‌ఎస్ వర్గాలు అనధికారికంగా ధ్రువీకరించాయి. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం టీఆర్‌ఎస్ అధినాయకత్వం తమ పార్టీలో చేరాలని ప్రతాప్‌రెడ్డిని కొద్ది రోజుల క్రితం సంప్రదించింది. టీఆర్‌ఎస్‌లో చేరితే తగిన అవకాశాలు కల్పిస్తామని హామీఇచ్చింది. ఇందుకు ప్రతాప్‌రెడ్డి కూడా సానుకూలంగా స్పందించారు. టీఆర్‌ఎస్‌లో చేరిన తర్వాత ఎమ్మెల్సీగా లేదా జడ్పీ చైర్మన్‌గా అవకాశం ఇవ్వాలని, ఒకవేళ సీఎం కేసీఆర్ ఫెడరల్ ఫ్రంట్ ఏర్పాటు చేసి జాతీయ రాజకీయాల్లోకి వెళితే తనకు గజ్వేల్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి టీఆర్‌ఎస్ తరఫున పోటీచేసే అవకాశం ఇవ్వాలని కోరినట్లు తెలుస్తోంది. ఆయన అభ్యర్థనపై టీఆర్‌ఎస్ నాయకత్వం సానుకూలంగా ఉన్నట్లు సమాచారం. వంటేరు గజ్వేల్ నుంచి మూడుసార్లు ఎమ్మెల్యేగా పోటీచేసి ఓడిపోయారు. అందులో రెండుసార్లు కేసీఆర్ చేతిలోనే ఓడారు. తెలుగుదేశంలో 23 ఏళ్లు, కాంగ్రెస్‌లో ఏడాది పని చేశారు. గురువారం గజ్వేల్ నియోజకవర్గానికి చెందిన ముఖ్య నాయకులు, కార్యకర్తలతో ప్రతాప్‌రెడ్డి సమావేశమైనట్లు తెలిసింది. కార్యకర్తలు టీఆర్‌ఎస్‌లో చేరికకు సానుకూలత వ్యక్తం చేశారు. వంటేరుకు ఎమ్మెల్సీ పదవి, గజ్వేల్ నియోజకవర్గ అభివృద్ధి బాధ్యతలు, ఆయన కుమారుడికి ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్మన్ పదవిని ఇవ్వనున్నట్లు ఆయన అనుచర వర్గాలు చెబుతున్నాయి.



ఎక్స్‌ఎల్‌ఆర్‌ఐ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న సీఎం చంద్రబాబు

సమర్థ నాయకత్వంతోనే అభివృద్ధి

- నాలెడ్జ్‌కు చిరునామాగా అమరావతి
- నీరు, గ్యాస్ తరహాలో ప్రతి ఇంటికీ ఏసీ సప్లై
- ఎక్స్‌ఎల్‌ఆర్‌ఐ శంకుస్థాపన సభలో సీఎం

గుంటూరు, జనవరి 17(ఆంధ్రజ్యోతి): సమర్థ నాయకత్వంతో ఏ రంగమైనా అభివృద్ధి సాధిస్తుందని సీఎం చంద్రబాబు స్పష్టంచేశారు. అమరావతిని ఆనంద, అంతర్జాతీయ నగరంగా తీర్చదిద్దుతున్నామన్నారు. ఆసియాలో ప్రసిద్ధిగాంచిన జేవియర్ లేబర్ రిలేషన్స్ ఇన్‌స్టిట్యూషన్(ఎక్స్‌ఎల్‌ఆర్‌ఐ)కు గుంటూరుజిల్లా తుళ్లూరు మండలం ఐనవోలులో గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం మాట్లాడుతూ ప్రతిష్ఠాత్మక సంస్థ ఎక్స్‌ఎల్‌ఆర్‌ఐ అమరావతిలో విద్యాసంస్థను ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు. జెస్యూట్ మిషనరీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎక్స్‌ఎల్‌ఆర్‌ఐకు 50 ఎకరాలు ఇచ్చామని, రూ.250 కోట్లతో క్యాంపస్ నిర్మాణం చేపడతారని తెలిపారు. ఎక్స్‌ఎల్‌ఆర్‌ఐ దేశంలో అత్యున్నత మేనేజ్‌మెంట్ కోర్సులను అందిస్తోందని, దేశంలో నాలుగో క్యాంపస్‌ను అమరావతిలో నిర్మిస్తున్నారన్నారు. ఫలితంగా ఈ ప్రాంతంలోని విద్యార్థులు ఇక్కడే ఉన్నతవిద్య చదువుకునే వీలుకలుగుతుందన్నారు. నాలెడ్జ్ ఎకానమీకి చిరునామాగా అమరావతిని తయారు చేస్తున్నామన్నారు. ప్రతి ఇంటికీ పైప్‌లైన్ ద్వారా తాగు నీరు, గ్యాస్ ఇస్తున్నట్లే ఏసీని కూడా సప్లై చేయనున్నట్లు తెలిపారు. దీని కోసం యూనిట్లను సిద్ధం చేస్తున్నామన్నారు. రైతుల నుంచి సమీకరించిన భూములు అభివృద్ధి చేసి వారికే ఇవ్వటంతోనే అభివృద్ధి సాధ్యమన్నారు.

కిడారి, సివేరి హత్య కేసులో..

ఇద్దరికి మరో 5రోజుల ఎన్‌ఐఏ కస్టడీ

విజయవాడ, జనవరి 17(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే కిడారి సర్వేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే సివేరి సోమలను హత్య చేసిన ఘటనలో ఇద్దరు నిందితుల ఎన్‌ఐఏ కస్టడీని మరో ఐదు రోజులు పొడిగిస్తూ విజయవాడ కోర్టు ఆదేశాలిచ్చింది. ఈ కేసులో నిందితులుగా ఉన్న ఎడ్డల సుబ్బారావు, ఈశ్వరి, జమ్మిలి శోభన్, కొర్రా కమల, డి.ధర్మయ్యలను గురువారం కోర్టుకు తీసుకొచ్చారు. నిందితుల్లో సుబ్బారావు, శోభన్‌లను మరో ఐదు రోజులపాటు కస్టడీకి ఇవ్వాలని ఎన్‌ఐఏ తరఫు న్యాయవాది పిటిషన్ దాఖలు చేశారు. దానిని కోర్టు పరిగణనలోకి తీసుకుంది. నిందితుల్లో ఈశ్వరి, కొర్రా కమలకు ఈనెల 31వ తేదీ వరకు, ధర్మయ్యకు ఈనెల 24 వరకు రిమాండ్ విధించారు. మరో నిందితుడు పంగి నరసయ్య తనకు అనారోగ్యంగా ఉన్నందున కోర్టుకు హాజరుకాలేనని పిటిషన్ దాఖలు చేశారు.

ఫ్లెమింగోల సందడి



నెల్లూరు జిల్లాలోని నేలపట్టు సరస్సు వద్ద కనిపించిన సుందర దృశ్యం. సందడి చేస్తున్న ఈ ఫ్లెమింగోలు పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి

లోకం తీరు




చలికాలం

కేంద్రం	కనిష్ఠం	గరిష్ఠం
హైదరాబాద్	14.1	30.8
కడప	15.0	32.0
తిరుపతి	16.4	30.5
గుంటూరు	18.9	30.2
విజయనగరం	16.0	28.0
విజయవాడ	20.1	29.4

పెరిగిన చలి

విశాఖపట్నం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పలుచోట్ల చలి వాతావరణం నెలకొంది. ఉత్తర కోస్తా, రాయలసీమల్లోని శివారు ప్రాంతాలు, ఏజెన్సీలో రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే రెండు నుంచి నాలుగు డిగ్రీలు తక్కువగా నమోదయ్యాయి. గురువారం ఆరోగ్యవరంలో 14 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. సముద్రం నుంచి వస్తున్న తేమగాలులు, రాత్రిపూట చలి వాతావరణంతో మంచు కూడా కురుస్తోందని వాతావరణ అధికారి ఒకరు తెలిపారు. రెండు, మూడు రోజుల వరకు మంచు ప్రభావం ఉంటుందని పేర్కొన్నారు.



మా ఎమ్మెల్యేలతో మాట్లాడండి చూద్దాం..!

కుమారస్వామి ప్రభుత్వాన్ని కూల్చేందుకు మేం ఎలాంటి ఆపరేషన్ చేపట్టలేదు. సొంత సభ్యులను కట్టడి చేసుకోలేని కాంగ్రెస్, జేడీఎస్‌లు మాపై నిందలు వేస్తున్నాయి. పలువురు బీజేపీ ఎమ్మెల్యేలు తమతో టచ్‌లో ఉన్నారని కాంగ్రెస్ నేతలు చేసిన వ్యాఖ్యలు అవాస్తవం. అదే నిజమైతే వారితో మాట్లాడండి.. చూద్దాం.

- యడ్యూరప్ప, బీజేపీ కర్ణాటక అధ్యక్షుడు



మోదీ వ్యాఖ్యలు కోర్టు ధిక్కారమే

శబరిమలపై ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలు కోర్టు ధిక్కారం కిందికే వస్తాయి. సుప్రీంకోర్టు ఆదేశాలను అమలు చేయడం ప్రభుత్వాల విధి. శబరిమల విషయంలో సుప్రీంకోర్టు చెప్పిందే కేరళ ప్రభుత్వం అమలు చేస్తోంది. ప్రభుత్వాన్ని విమర్శిస్తే కోర్టు ధిక్కారానికి పాల్పడినట్లే లెక్క.

- సీతారాం ఏచూరి, సీపీఎం ప్రధాన కార్యదర్శి

స్మార్ట్‌ఫోన్‌తో మెడనొప్పి!



వాషింగ్టన్, జనవరి 17: నేడు మనిషి జీవితంలో స్మార్ట్‌ఫోన్ అనేది అంతర్భాగమైపోయింది. ప్రపంచవ్యాప్తంగా స్మార్ట్‌ఫోన్ వాడుతున్న 340 కోట్ల మందిలో చాలామంది మెడపై ప్రభావం చూపుతోందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. 'టెక్స్ట్ నెక్'గా పిలిచే ఈ పద్ధతిలో సందేశాలు పంపే సమయంలో వెన్నెముకపై ఒత్తిడి పెరుగుతుందని, మెడ సహజ వంపును కూడా ఇది దెబ్బతీస్తుందని, దీంతో మృదు కణాలు అసౌకర్యానికి గురవుతాయని థాయ్‌లాండ్‌లోని ఖోన్ కయెన్ యూనివర్సిటీ, యూనివర్సిటీ ఆఫ్ సౌత్ ఆస్ట్రేలియా పరిశోధకులు చెప్పారు. పరిశోధనల్లో భాగంగా 18 నుంచి 25 ఏళ్ల మధ్య వయసున్న యువతలో రోజుకు ఎనిమిది గంటలపాటు స్మార్ట్‌ఫోన్‌లో గడిపే వారిని శాస్త్రవేత్తలు పరిశీలించారు. వారిలో 32 శాతం మంది మెడ నొప్పి, 26 శాతం మంది భుజం నొప్పి, 20 శాతం మంది వెన్నునొప్పి, 19 శాతం మంది మణికట్టు నొప్పి వస్తున్నట్టు వెల్లడించారు.

కిడ్నీ సమస్యలను ముందే గుర్తించే పరీక్ష!

సిమ్లా, జనవరి 17: రక్త, మూత్ర పరీక్షల ద్వారా ప్రొటీన్ స్థాయిల ఆధారంగా కిడ్నీ సమస్యల లక్షణాలను ముందుగానే గుర్తించి, మధుమేహంతో కలిగే రోగాలను కూడా అంచనా వేసే సరికొత్త పరీక్షను ఐఐటీ మండి పరిశోధకులు అభివృద్ధి చేశారు. ఈ స్పెక్ట్రోస్కోపిక్ విశ్లేషణలో మూత్రంలోని అల్బుమిన్ అణువులను గుర్తించి, ఈ సమ్మేళనాన్ని 780 నానోమీటర్ తరంగదైర్ఘ్యంలో శోషించి, 806 నానోమీటర్ తరంగదైర్ఘ్యంలో రేడియేషన్‌ను విడుదల చేస్తుందని ఐఐటీ మండి అసిస్టెంట్ ప్రొఫెసర్ సుభజిత్ రాయ్ చౌదరి వెల్లడించారు. దీంతో 15 మంది రోగులపై క్లినికల్ ట్రయల్స్ నిర్వహించగా మంచి ఫలితాలు వచ్చాయన్నారు. ఈ పరీక్ష నిర్వహణకు అయ్యే ఖర్చు కూడా రూ. 30 కంటే తక్కువగానే ఉంటుందన్నారు.



వేంపల్లి షరీఫ్‌కు చాసో పురస్కార ప్రదానం

విజయనగరం రూరల్, జనవరి 17: ప్రముఖ కథకుడు చాసో పేరిట నెల కొల్పిన సాహితీ పురస్కారాన్ని ఈ ఏడాది విజయవాడకు చెందిన వేంపల్లి షరీఫ్ అందుకున్నారు. విజయనగరంలోని చాసో సాహిత్య స్ఫూర్తి ట్రస్టు ఏటా జనవరి 17న ఈ అవార్డు ప్రదానం చేస్తోంది. జిల్లా గ్రంథాలయ భవనంలోని చాసో వేదికలో గురువారం జరిగిన కార్యక్రమంలో వేంపల్లి షరీఫ్‌కు అవార్డు కింద రూ.10 వేల నగదు, వస్త్రాలను బహూకరించారు. పురస్కార గ్రహీత షరీఫ్ మాట్లాడుతూ... చాసో రచనలు సమాజానికి దిక్సూచి లా నిలిచాయన్నారు. ఆయన దాదాపు 40 కథలు రచించారని, ప్రతి కథ నిజ జీవితానికి దగ్గరగా ఉంటుందన్నారు. చాసో స్ఫూర్తి పురస్కారం అందుకోవడం ఆనందంగా ఉందని, ఈ అవార్డు మరింత బాధ్యతను పెంచిందన్నారు. చాసో బాటలో యువ రచయితలు పయనించాలని ఆకాంక్షించారు.

స్వరాష్ట్రానికి సర్వశిక్షా అభియాన్ ఎస్పీడీ

అమరావతి, జనవరి 17(ఆంధ్రజ్యోతి): సర్వశిక్షా అభియాన్ రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ గుర్రాల శ్రీనివాసులును ఆయన సొంత యూపీ కేడర్‌కు పంపిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఈ నెల 21కి ఆయన డిప్యూటేషన్ ముగియడంతో ప్రభుత్వం ఈ మేరకు నిర్ణయం తీసుకుంది.

జాతీయస్థాయి అంబేడ్కర్ ఫెలోషిప్ అవార్డులు

అమలాపురం టౌన్, జనవరి 17: ఈ ఏడాది నుంచి జాతీయస్థాయి అంబేడ్కర్ ఫెలోషిప్ అవార్డులను అందజేయనున్నట్టు బుద్ధవిహార్ సెక్రటరీ జనరల్ డీబీ లోక్ తెలిపారు. గురువారం అమలాపురం త్రిరత్నబుద్ధవిహార్‌లో జరిగిన పాలకమండలి సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఇప్పటివరకు రాష్ట్రస్థాయిలోనే ఉత్తమ ఉపాధ్యాయులకు, ఉత్తమ సామాజికవేత్తలకు అవార్డులను అందజేస్తున్నట్టు తెలిపారు. ఇకపై జాతీయస్థాయిలో అవార్డులను అందిస్తున్నట్టు ప్రకటించారు. ఏప్రిల్ 14న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని రావులపాలెంలో రాష్ట్ర, జాతీయస్థాయిలలో అవార్డులను అందజేస్తామని ప్రకటించారు. జాతీయస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు దరఖాస్తు చేసుకునేవారు 15 ఏళ్ల సర్వీసు పూర్తిచేసి ఉండాలన్నారు. ఈ నెల 20 నుంచి ఫిబ్రవరి 20వరకు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్టు తెలిపారు. దరఖాస్తులతోపాటు విద్యార్హత వివరాలు, కేడర్, ప్రస్తుత చిరునామా, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, సేవా కార్యక్రమాల ఫొటోలు జతచేయాలి. మరిన్ని వివరాలకు 8500647259ను సంప్రతించాలన్నారు.

తానా సభలో రైతు ఉపకార నిర్ణయాలు: సతీష్

తిరుమల, జనవరి 17: త్వరలో జరగనున్న తానా సభల్లో రైతులకు ఉపయోగపడే కీలక నిర్ణయాలు తీసుకుంటామని తానా అధ్యక్షుడు సతీష్ వేమన తెలిపారు. గురువారం ఉదయం ఆయన తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ...గతంలో అవగాహన లేకుండా అజాగ్రత్తగా పంటలపై క్రిమిసంహారకాలు పిచికారీ చేసి మహారాష్ట్రలో దాదాపు 300 మంది రైతులు చనిపోయారని, ఆ విషయంలో రైతులకు అవగాహన కల్పించే దిశగా పలువురు రైతులకు మాస్కులు, గ్లౌసులు, టార్చ్‌లైట్లు, పాము కాటుకు మందు వంటివి పంపిణీ చేశామని గుర్తుచేశారు. అదేవిధంగా రైతుల అవగాహనకు త్వరలో మరిన్ని కార్యక్రమాలు చేపడతామన్నారు.

ఫిబ్రవరి 19న విశ్వరూప మహాసభ

గుజరాతీపేట(శ్రీకాకుళం)/విజయనగరం, జనవరి 17: ఎస్సీ వర్గీకరణకు కట్టుబడి ఉన్నామని చెప్పిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు.. మాదిగల ఉనికిని తెలియజేసే విధంగా ఫిబ్రవరి 19న అమరావతిలో మరో విశ్వరూప మహాసభను నిర్వహించనున్నామని ఎమ్మార్పీఎస్ జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ అన్నారు. శ్రీకాకుళం నగరంలో గురువారం విలేకరులతో ఆయన మాట్లాడారు.

తడిసిన ధాన్యం ఎంతైనా కొంటాం!

రైతుల కోసం సీఎం సానుకూల నిర్ణయం

- క్వింటా రూ.1550 చొప్పున కొనుగోలు
- 3 లక్షల టన్నుల నిల్వలు అంచనా
- ప్రభుత్వంపై 465 కోట్ల భారం: సోమిరెడ్డి



అమరావతి, జనవరి 17(ఆంధ్రజ్యోతి): ధాన్యం రైతుకు తీపికబురు. పెథాయ్ తుఫాన్ వల్ల తడిసిన ధాన్యాన్ని రాష్ట్ర ప్రభుత్వమే రైతుల నుంచి నేరుగా కొనుగోలు చేయనుంది. క్వింటా రూ.1,550 చొప్పున రైతు నుంచి తడిసిన, రంగు మారిన ధాన్యాన్ని కొనాలని ప్రభుత్వం నిర్ణయించింది. పెథాయ్ తుఫాన్ ప్రభావంతో అన్నదాతలు పడుతున్న ఇబ్బందులపై ఈనెల 13న 'ఆంధ్రజ్యోతి' ప్రధాన సంచికలో 'అమ్మితే అరువు.. ఉంచితే బరువు' శీర్షికన ప్రత్యేక కథనం ప్రచురితమైంది. టీడీపీ ముఖ్యనాయకులూ విషయాన్ని సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. తడిసిన ధాన్యాన్ని ఎఫ్‌సీఐ కొనుగోలు చేసేలా చూస్తామని సీఎం ప్రకటించారు. అయితే, కేంద్రం నుంచి సానుకూలత లేకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వమే రైతులను ఆదుకోవాలని నిర్ణయించింది. కృష్ణా, పశ్చిమగోదావరి, గుంటూరు జిల్లాల్లో దాదాపు 3 లక్షల టన్నుల తడిసిన ధాన్యం ఉన్నట్లు అధికారులు అంచనా వేశారు. ఆ మొత్తాన్ని ప్రభుత్వమే నేరుగా రూ.465 కోట్లతో రైతుల నుంచి కొనుగోలు చేయడానికి సీఎం అంగీకరించారని వ్యవసాయశాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి వెల్లడించారు. గురువారం సచివాలయంలోని తన చాంబర్‌లో మంత్రి నక్కా ఆనందబాబు, గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్, పౌరసరఫరాల శాఖ అధికారులు, 3 జిల్లాల రైతు సంఘాల నాయకులతో మంత్రి సోమిరెడ్డి సమావేశం నిర్వహించారు. బీ గ్రేడు ధాన్యం క్వింటా రూ.1750 ఉన్నందున తడిసిన ధాన్యానికి రూ.200 తగ్గించి కొనాలని సీఎం ఆదేశించారని మంత్రి చెప్పారు. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆర్థిక సహకారమూ లేదని, పెథాయ్ తుఫాన్‌కు నష్టపోయిన రైతులను రాష్ట్ర ప్రభుత్వమే ఆదుకుంటుందని స్పష్టం చేశారు.

నకిలీ ఎరువుల సరఫరాదారులపై చర్యలు

అమరావతి జనవరి 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఇటీవల వెలుగుచూసిన నకిలీ పొటాష్ ఎరువుల వ్యవహారంపై వ్యవసాయశాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహనరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం అమరావతి సచివాలయంలో వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులతో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. అన్ని జిల్లాల వ్యవసాయ సంయుక్త సంచాలకులు వారి వారి పరిధిలో పూర్తి స్థాయి విచారణ జరిపి నకిలీ ఎరువులు సరఫరా చేస్తున్న డీలర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు.



న్యూఢిల్లీలో అవార్డు అందుకుంటున్న కొంచాడ రాజు

జాతీయ స్థాయి వ్యాసరచనలో

సిక్కోలు విద్యార్థిని ప్రతిభ

» న్యూ ఢిల్లీలో అవార్డు, లాప్‌టాప్ అందుకున్న రాజు

ఎచ్చెర్ల, జనవరి 17: శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల మండలం పొన్నాడ కేజీబీవీ విద్యార్థిని కొంచాడ రాజు (9వ తరగతి) జాతీయ స్థాయి వ్యాసరచన (తెలుగు విభాగం)లో ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుంది. భారత పెట్రోలియం, సహజ వాయువుల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో సాక్ష్యం నేషనల్ కాంపిటేషన్ -2018 పేరిట దేశంలో 23 భాషల్లో ఆన్‌లైన్‌లో వ్యాసరచన, క్విజ్, డ్రాయింగ్ పోటీలు ఇటీవల నిర్వహించారు. ఈ పోటీల్లో అన్ని విభాగాల్లో 82 లక్షల మంది పోటీ పడగా, వ్యాసరచనలో 16 భాషల్లో ప్రథమ బహుమతిని ప్రకటించారు. ఇందులో కొంచాడ రాజు తెలుగు భాషలో ప్రథమ స్థానాన్ని సాధించింది. ఈ నెల 16న కానిస్టూట్యూషనల్ క్లబ్ ఆఫ్ ఇండియా (న్యూ ఢిల్లీ)లో ఇంధన శాఖ ప్రధాన కార్యదర్శి రాజీవ్ బస్వాల్ చేతుల మీదుగా అవార్డు, జ్ఞాపిక, లాప్‌టాప్‌ను ఆమె అందుకుంది.

గుంటూరులో 'తల్లీ సురక్ష' ప్రారంభం

గుంటూరు (మెడికల్) జనవరి 17: సంక్రాంతి పర్వదినం సందర్భంగా రాష్ట్రంలో తొలిసారిగా గుంటూరు ప్రభుత్వ వైద్యబోధన ఆసుపత్రిలో 'తల్లీ సురక్ష' పథకం ప్రారంభించారు. ఎన్టీఆర్ వైద్య సేవ పరిధిలో ఉన్న, దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న పేద గర్భిణులకు ఈ పథకం కింద ఉచితంగా పురుడు పోస్తారు. సహజ ప్రసవమైనా, సిజేరియన్ శస్త్రచికిత్సైనా ఉచితంగా చేస్తారు. ఎన్టీఆర్ వైద్య సేవ పరిధిలో నమోదైన ప్రభుత్వ, ప్రైవేటు నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో ఈ సేవలను ఇటీవల ప్రభుత్వం ప్రవేశపెట్టింది. గుంటూరు జీజీహెచ్‌లో తల్లీ సురక్ష పథకం ప్రారంభించామని, ఇప్పటివరకు ఈ పథకం కింద 18 మందికి కాన్పులు నిర్వహించామని వైద్య వర్గాలు తెలిపాయి.



తిరుమల భక్తజనసంద్రం

తిరుమల భక్తజన సంద్రంగా మారింది. సంక్రాంతి సెలవుల ముగింపు సమయంలో కొండపై రద్దీ ఊపందుకుంది. భక్తులు గురువారం ప్రవాహంలా తరలివచ్చారు. ఎటుచూసినా భక్తుల బారులే కనిపిస్తున్నాయి. వసతి కోసం అన్ని కౌంటర్ల వద్ద క్యూలు కిటకిటలాడాయి. శ్రీవారి సర్వదర్శనానికి 20 గంటలు పడుతోందని అధికారులు తెలిపారు.

శ్రీశైలంలో ముగిసిన సంక్రాంతి బ్రహ్మోత్సవాలు

శ్రీశైలం, జనవరి 17: శ్రీశైలంలో సంక్రాంతి బ్రహ్మోత్సవాలు ముగిశాయి. గురువారం బ్రహ్మోత్సవాలకు పూర్ణాహుతి నిర్వహించారు. ముందుగా స్వామిఅమ్మవార్లకు విశేష పూజలు, చండీశ్వరుడికి పూజాదికాల అనంతరం పూర్ణాహుతి, త్రిశూల స్నానం, మహదాశీర్వచనం, చివరగా వసంతోత్సవాన్ని నిర్వహించారు.

మంచి రచనలను ఆహ్వానించాలి

» ఇనాక్ సన్మాన సభలో కొణిజేటి రోశయ్య



కొలకలూరి ఇనాక్‌ను సన్మానిస్తున్న రోశయ్య, సిధారెడ్డి తదితరులు

చిక్కడపల్లి/హైదరాబాద్, జనవరి17(ఆంధ్రజ్యోతి): సమాజాన్ని మంచి మార్గంలో నడిపించే రచనలు ఆహ్వానించ దగినవని తమిళనాడు మాజీ గవర్నర్ డా. కొణిజేటి రోశయ్య అన్నారు. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ చైర్మన్‌గా నియమితులైన ప్రముఖ సాహితీవేత్త ఆచార్య కొలకలూరి ఇనాక్‌కు హైదరాబాద్ త్యాగరాయగాన సభ ఆధ్వర్యంలో గురువారం సన్మానోత్సవం జరిగింది. ఈ సందర్భంగా రోశయ్య మాట్లాడుతూ సమాజాన్ని మంచి మార్గంలో పెట్టే రచనలు ఇనాక్ చేస్తున్నారని ప్రశంసించారు. ఇనాక్ మాట్లాడుతూ త్యాగరాయగానసభ కళలకు, సాహిత్యానికి అందిస్తున్న సహకారం మరువలేనిదని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పక్షాన పురస్కారం ఇప్పించేందుకు కృషి చేస్తానన్నారు. ఈసమావేశంలో తెలంగాణ సాహిత్య అకాడమీ అధ్యక్షుడు డా. నందిని సిధారెడ్డి , తెలంగాణ గ్రంథాలయ పరిషత్ చైర్మన్ డా. ఆయాచితం శ్రీధర్, సాహితీవేత్త నాళేశ్వరం శంకరం ప్రసంగించారు.

దోపిడీ దొంగల ముఠా అరెస్టు

ఒంగోలు(క్రైం), జనవరి 17 : దోపిడీ దొంగల ముఠాను ప్రకాశం జిల్లా దొనకొండ పోలీసులు బుధవారం అరెస్టు చేసినట్టు ఎస్పీ సత్యఏసుబాబు తెలిపారు. గుంటూరు జిల్లా దుర్గి మండలం ఆత్మకూరుకు చెందిన పి. సత్యానందం, మాచర్లకు చెందిన ఫణిదర్‌రెడ్డి, వేమవరానికి చెందిన మోమిన్ సైదా, పొదిలి జోజి ముఠాగా ఏర్పడి ఏడాదిన్నరగా రెండు తెలుగు రాష్ట్రాల్లో 31 నేరాలకు పాల్పడినట్టు తెలిపారు. వీరివద్ద రూ. 14 లక్షల విలువైన సొత్తు, కత్తి, పిస్టలు, నాలుగు బులెట్లు స్వాధీనం చేసుకున్నామన్నారు.

సంక్షోభం సశేషం!

కర్ణాటకలో మూడోమారు పుట్టిన ముసలం సన్నగిల్లిందే తప్ప, సమసిపోలేదు. కుమారస్వామి ప్రభుత్వానికి అండగా ఉన్న కాంగ్రెస్ పార్టీ నేటి శాసనసభా పక్షం సమావేశం తరువాత కానీ ప్రశాంతంగా ఊపిరి పీల్చుకోగలిగే అవకాశాలు లేవు. మాయమైన ఎమ్మెల్యేల్లో ఇద్దరు గురువారం ప్రత్యక్షమైనందున ఆ పార్టీకి కాస్తంత ధైర్యం వచ్చినా, మరో ముగ్గురు ఎమ్మెల్యేల విషయంలో భయాలు అలాగే ఉన్నాయి. శాసనసభా పక్ష సమావేశానికి అందరూ విధిగా హాజరు కావల్సిందేననీ, రానివారిపై తక్షణ చర్యలు తప్పవని సిద్దరామయ్య వంటివారు హెచ్చరికలు చేస్తున్నారు. మరొకపక్కన, తమ ఎమ్మెల్యేలందరినీ గురుగ్రామ్‌లోని ఖరీదైన రిసార్టులో ఉంచిన బీజేపీ పెద్ద యడ్యూరప్ప పదిమంది ఎమ్మెల్యేలతో బెంగుళూరుకు తిరిగివచ్చేయడంతో, 'ఆపరేషన్ కమల్' అట్టర్ ఫ్లాప్ కావడంతో బీజేపీ ఎమ్మెల్యేలంతా తిరుగుముఖం పడుతున్నారనీ, సంక్షోభం ముగిసినట్టేనని కాంగ్రెస్ నమ్ముతున్నది.

గురుగ్రామ్ ఫైవ్‌స్టార్ రిసార్టులో తన ఎమ్మెలందరూ ఉండటానికి కారణం రాష్ట్ర రాజకీయం కాదనీ, సార్వత్రిక ఎన్నికలకు వ్యూహరచన చేయడానికని యడ్యూరప్ప అంటున్నారు. తాము ఎదుటివారిని చీల్చడం కాక, తమ ఎమ్మెల్యేలను తన్నుకుపోవడానికి అధికారపక్షం ప్రయత్నిస్తున్నదని ఆయన అభియోగం. కొంతమంది బీజేపీ ఎమ్మెల్యేలు తనతో టచ్‌లో ఉన్నారంటూ ముఖ్యమంత్రి కుమారస్వామి గతంలో చేసిన వ్యాఖ్య బీజేపీకి తన చర్యలను సమర్థించుకోవడానికి ఆయుధంగా ఉపకరించింది. కాంగ్రెస్ కూడా పార్టీలో అసమ్మతి లేదంటూనే, తిరుగుబాటు ఎమ్మెల్యేలు ఒక్కరొక్కరుగా తిరిగి కనిపిస్తున్నందుకు సంతోషిస్తూ, మరోవైపు బీజేపీ చీలిక రాజకీయాలకు వ్యతిరేకంగా విమర్శలు చేస్తూ విచిత్రమైన విన్యాసాలు చేస్తున్నది. ఈ వ్యాఖ్యలను, విమర్శలను అటుంచితే, అధికారపక్ష కూటమికి చెందిన ఎమ్మెల్యేలను చీల్చి, ప్రభుత్వాన్ని కుప్పకూల్చడానికి బీజేపీ మళ్ళీ ఆపరేషన్ కమల్ ఆరంభించిందని కాంగ్రెస్ నాయకుడు శివకుమార్ ప్రకటనతో ఈ వ్యవహారం ఒక్కసారిగా తెరమీదకు వచ్చింది. ఇద్దరు స్వతంత్ర ఎమ్మెల్యేలు ప్రభుత్వానికి తమ మద్దతు ఉపసంహరించుకోవడం ఈ చీలిక యత్నాలకు ఊపు నిచ్చింది. 104 స్థానాలు సంపాదించుకుని కూడా గతంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయలేక, రెండురోజులకే చతికిలబడిన యడ్యూరప్ప మంచి కాకమీద ఉన్న విషయం తెలిసిందే. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి కావల్సిన మరో 9మందిని సమకూర్చుకోవడం సాధ్యం కాలేదు కనుకనే, అప్పట్లో ఆయన కాంగ్రెస్–జెడిఎస్‌లకు అధికారాన్ని ఇచ్చేయాల్సి వచ్చింది.

అప్పుడైనా, ఇప్పుడైనా ఈ రెండుపార్టీలను చీల్చడం వినా బీజేపీకి మరో మార్గం లేదు. కానీ, ఫిరాయింపు చట్టాలు, న్యాయస్థానాలు ఇందుకు అడ్డం పడతాయి. అందువల్ల, ఫిరాయింపుచట్టాలకు దొరక్కుండా కనీసం పద్నాలుగు మంది ఎమ్మెల్యేలతో వారి శాసనసభ సభ్యత్వానికి రాజీనామాలు చేయించేందుకు ఇప్పుడు కొత్త ప్రయత్నం జరిగిందని అంటున్నారు. అప్పుడు శాసనసభ మొత్తం బలం 210కు పడిపోతుంది కనుక, ఇద్దరు స్వతంత్రులతో కలసి బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగలుగుతుంది. ఒక్కముక్కలో చెప్పాలంటే, శాసనసభ బలాన్ని బట్టి తాను బలపడటం కాక, సభ బలాన్ని తనకు అనుగుణంగా మార్చేయడానికి బీజేపీ సిద్ధపడ్డది. ఇందుకు వీలుగా ముందుకు వచ్చినవారిని ఏలోటూ లేకుండా చూసుకోవడంతో పాటు, తిరిగి బీజేపీ టిక్కెట్లపై నెగ్గించుకుంటానని అన్నది. ఓ ఏడుగురు అసమ్మతి ఎమ్మెల్యేలు సరేనన్నా, మిగతావారిని నమ్మించి, ఒప్పించి తిప్పుకోవడం బీజేపీకి సాధ్యపడలేదని అంటున్నారు. యడ్యూరప్ప ప్రయత్నం ఎందుకు బెడిసికొట్టిందన్నది అటుంచితే, కాంగ్రెస్‌లో అసమ్మతి, కాంగ్రెస్–జెడిఎస్ విభేదాలు బీజేపీకి మరోమారు ఈ కుట్రకు అవకాశమిచ్చాయన్నది వాస్తవం. దక్షిణాదిలో బీజేపీ బలంగా ఉన్న రాష్ట్రం కావడంతో, 28మంది ఎంపీలున్న కర్ణాటకను సార్వత్రిక ఎన్నికల్లోగా వశపరుచుకోవడం దానికి ముఖ్యం. ఒకవేళ ఈ ప్రయత్నంలో విజయం సాధించకపోయినా, సంకీర్ణ ప్రభుత్వాల గతి ఇలాగే ఉంటుందనీ, ఒక బలమైన పార్టీ, బలమైన నాయకుడు లేకుంటే రేపు దేశానికి కూడా ఇదే గతి దాపురిస్తుందని దేశప్రజలకు చూపవచ్చు. మహాగఢ్బంధన్ కోసం శ్రమిస్తున్న కాంగ్రెస్ ఇప్పటికైనా విరుగుడు చర్యలు తీసుకోవడం చాలా ముఖ్యం.

భావి ప్రధాని 'బెహెన్ జీ'?



■ రాజ్‌దీప్ సర్దేశాయి

దీపశిఖ

రాబోయే 'జాతీయ' ఎన్నికలలో జయాపజయాలను నిర్ణయించడంలో రాష్ట్ర స్థాయి పొత్తులే కీలక పాత్ర వహించనున్నాయి. ఎస్పీ మద్దతుతో బీఎస్పీ, న్యూఢిల్లీ రాజకీయాలకు కొత్తరూపునివ్వగల శక్తిగా ఆవిర్భవించగలిగే అవకాశాన్ని త్రోసిపుచ్చలేము. మాయావతి ఇప్పుడు ఒక ఆరితేరిన రాజకీయ యోధురాలు. కాన్షీరామ్ ఒకప్పుడు తన గురించి చెప్పిన జోస్యాన్ని నిజం చేసేందుకు ధృఢ సంకల్పంతో పోరాడడానికి ఆమె వెనుకాడరనడంలో సందేహం లేదు.

'ఏదో ఒక రోజు బాబాసాహెబ్ అంబేడ్కర్ స్వప్నాన్ని ఆమె సఫలం చేయగలదు'అని అప్పుడే మాకు తేనీరును అందించిన యువతిని చూపిస్తూ బహుజన్ సమాజ్ పార్టీ అధినేత కాన్షీరామ్ సగర్వంగా చెప్పారు. ఇది, 1990 వ దశకం తొలినాళ్ళ మాట. ఒక శీతాకాలపు అపరాహ్ణ వేళ ఢిల్లీ హుమాయున్ రోడ్ లోని బీఎస్పీ అధినేత నివాసంలో ఆయన్ని కలుసుకున్న సందర్భమది. ఆ యువతి గురించి కాన్షీరామ్ మెచ్చుకోలు విన్న వెన్వెంటనే ఆమె వైపు మందస్మితంగా రెండు సార్లు చూశాను. రాజకీయాలలో కులం పాత్ర గురించి కాన్షీరామ్ తో నేను వాదప్రతివాదాలు చేస్తుండగా ఆ యువతి చాల వరకు మౌనంగా ఉండిపోయారు. ఇంతకూ ఆ యువతి ఎవరో చెప్పలేదు కదూ? మాయావతి. అప్పటికే ఆమె పార్లమెంటుకు ఎన్నికయ్యారు. అయితే జాతీయ రాజకీయాలలో ఇంకా సుప్రసిద్ధం కాలేదు. పాత్రికేయులకు సైతం మాయావతి గురించి ఇంతకు మించి వివరంగా తెలిసివుండేందుకు అవకాశం లేదు. కొన్ని సంవత్సరాల అనంతరం, దేశంలో ఉత్తర ప్రదేశ్ కు ఆమె ముఖ్యమంత్రి అయ్యారు. దరిమిలా ఎవరూ ఉపేక్షించలేని ఒక ప్రభావశీల రాజకీయవేత్తగా, సుదృఢ వ్యక్తిత్వమున్న నాయకురాలుగా మాయావతి తనను తీర్చి దిద్దుకున్నారు.

కొద్ది రోజుల క్రితం సమాజ్ వాదీ పార్టీ నాయకుడు అఖిలేశ్ యాదవ్, బహుజన్ సమాజ్ పార్టీ అధినేత్రి మాయావతి ల సంయుక్త విలేఖర్ల సమావేశాన్ని టీవీలో వీక్షించినప్పుడు'బెహెన్ జీ'తో ఆ తొలి పరిచయ ఉదంతం నా మనస్సులో నిండుగా గుర్తుకొచ్చింది. భారతదేశపు తదుపరి ప్రధాన మంత్రి ఉత్తరప్రదేశ్ నుంచే వస్తారని అంటూ అఖిలేశ్ ఉద్దేశపూర్వకంగా మాయావతి వైపు తిరగడం నన్ను విశేషంగా ఆకట్టుకున్నది. ఇది చూసిన తరువాత, రెండున్నర దశాబ్దాల క్రితం కాన్షీరామ్ నాతో అన్న మాటలను త్వరలో సంభవించనున్న రాజకీయ పరిణామాలు రుజువు చేయనున్నాయా అన్న ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నాయి మరి. మాయావతి నిజంగా భారతదేశపు తొలి దళిత ప్రధానమంత్రి కానున్నారా? ఒక స్థాయిలో ఈ ప్రశ్న కొంచెం అసంబద్ధమైనదిగా కన్పిస్తుంది. ఎందుకని? పార్లమెంటులో బీఎస్పీకి ఒక్కడంటే ఒక్క సభ్యుడు కూడా లేడు. మాయావతి తన కంచుకోట ఉత్తర ప్రదేశ్‌లో వరుసగా మూడు



srini

ఎన్నికల్లో (రెండు అసెంబ్లీ, ఒక లోక్ సభ) ఎన్నికల్లో ఓడిపోయింది. దేశంలోని ఇతర రాష్ట్రాలలో తన పార్టీనివిస్తరింపచేసేందుకు ఆమె చేసిన ప్రయత్నాలు పెద్దగా ప్రయత్నించలేదు. ఆమెకు ఎనలేని భరోసాగా ఉన్న ఓటు బ్యాంకు సైతం క్షీణించసాగింది.. మాయావతిని ఇప్పుడు ఒక అఖిలభారత దళిత ఐకాన్‌గా గాకుండా కేవలం జాతవ్ అనే ఒక ఉప కుల నాయకురాలిగానే ఆమెను పరిగణిస్తున్నారు. మరింత ముఖ్యమైన విషయమేమిటంటే మాయావతీ, ఆమె కుటుంబ సభ్యులు అనేక అవినీతి ఆరోపణల నెదుర్కొంటున్నారు. ఆదాయానికి మించిన ఆస్తుల కేసులతో సతమతమవుతున్నారు. స్థిర వైఖరితో వ్యవహరించని రాజకీయ వేత్త, స్వల్పకాలిక ప్రయోజనాల కోసం ఇతర పార్టీలతో పొత్తులు పెట్టుకోవడం లేదా తెంచు కోవడం చేస్తోన్న నాయకురాలు అన్న అపప్రథను కూడా ఆమె మూటగట్టుకున్నారు.

అయినప్పటికీ మరొక స్థాయిలో సామాజిక చలనశీలతకు ఒక శక్తిమంతమైన ప్రతీకగా మాయావతి వెలుగొందుతున్నారు. ఆమె తండ్రి, పశ్చిమ ఉత్తరప్రదేశ్ లోని ఒక మార్మూల పట్టణంలో ఒక సామాన్య పోస్టల్ ఉద్యోగి. మన సామాజిక వ్యవస్థలోని తీవ్ర లొసుగులు, అమానుషాలను ఆమె చవి చూశారు. ఆమె వ్యవహారశైలిని, ఆ బాధాకర అనుభవాలు ఎంతైనా ప్రభావితం చేస్తున్నాయని చెప్పక తప్పదు. అశేష 'బహుజనుల'కు ఆమె ఒక స్ఫూర్తిదాయక నేత. అనేకానేక సమస్యల నుంచి తమను విముక్తం చేయడానికి కంకణం కట్టుకున్న ధీర మహిళగా ఆమెను ఆరాధిస్తున్నారు. అయితే గ్రామీణ ప్రాంతాలలోని, నగరాలలోని అగ్రకులాలవారు మాయావతి నాయకత్వంలోని లోపాలు భారతీయ రాజకీయాలలోని చీకటి పార్శ్వాన్ని ప్రతిబింబిస్తున్నాయని విశ్వసిస్తున్నారు. వ్యక్తిగత ప్రయోజనాల కోసం ప్రభుత్వ ఆర్థిక వనరులను దోపిడీ చేసిన నేత అని, తన సొంత విగ్రహాలను ప్రతిష్ఠించుకున్న పరిపాలకురాలని, తన డిజైనర్ బ్యాగులు, నగలను ఆడంబరంగా ప్రదర్శించుకునే నవ సంపన్నురాలని, పుట్టిన రోజు వేడుకలలో కరెన్సీ నోట్ల దండలను నిస్సిగ్గుగా వేయించుకునే రాజకీయవేత్త అని ఆమెను విమర్శిస్తున్నారు. ఈ విమర్శల్లో కులీన వర్గాల అభిజాత్యం, తిరస్కార వైఖరి స్పష్టంగా కన్పిస్తోంది. అయితే ఎన్నికల సమయంలో నిధుల సేకరణకు అగ్ర వర్ణాలకు చెందిన అనేక మంది రాజకీయ వేత్తలు వెండి, బంగారు నాణాలతో తులాభారాలు తూగడం లేదూ? మరి వారిలో ఎంతమందిని తప్పు పడుతున్నారు? అధిక్షేపిస్తున్నారు? ఇక కటౌట్ల సంస్కృతి మాటేమిటి? తమను తాము గొప్పగా ప్రచారం చేసుకోని, చేయించుకోని వర్తమాన రాజకీయవేత్తలు ఎంతమంది? మరింత కచ్చితంగా మాట్లాడాలంటే అవినీతి ఆరోపణలు ఏ మాత్రం లేని రాజకీయ వేత్తలు ఇప్పుడు ఎంతమంది ఉన్నారు?

మాయావతి ఒక విలక్షణ రాజకీయవేత్త. ఆమెను కేవలం ఒక అవినీతిపరురాలు, నిరంకుశ పాలకురాలుగా చిత్రించడంలో నిష్పాక్షిక వైఖరి లోపించిందని చెప్పక తప్పదు. ఎందుకని? సమాజం అట్టడుగు స్థాయి నుంచి భారత రాజకీయాల ప్రధాన కేంద్రానికి ఆమె ప్రస్థానం అసాధారణమైనదీ, అద్వితీయమైనదీనూ. ఆమెను గురించి మాట్లాడడంలో ఈ వాస్తవాన్ని విస్మరించకూడదు. ఉత్తరప్రదేశ్‌కు ఆమె మూడు సార్లు ముఖ్యమంత్రి అయ్యారు. మూడుసార్లూ చాలా కఠినమైన నాయకురాలుగా ఆమె పేరు పొందారు. ముఖ్యంగా శాంతి భద్రతలను కాపాడే విషయంలో మాయావతి రాజీలేని వైఖరితో వ్యవహరించేవారు. విధుల నిర్వహణలో అలసత్వాన్ని సహించేవారుకాదు. సరే, ఆమెపై ఉన్న అవినీతి ఆరోపణలు చాలా తీవ్రమైనవే. అయితే ఆమెను గురించిన మరొక వాస్తవం ఉన్నది. మాయావతి కార్యసాధకురాలు.అధికార యంత్రాంగంలో అవినీతికి దారితీసే అలసత్వాన్ని, సాచివేత ధోరణులను అణచివేయడంలో ఆమె సాపేక్షంగా విజయవంతమయ్యారు. పనుల పూర్తిలో అకారణ జాప్యాన్ని ఆమె సహించేవారు కాదు. నోయిడా, ఆగ్రాల మధ్య యమునా ఎక్స్‌ప్రెస్ హైవే తదితర మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు శీఘ్రగతిన పూర్తయ్యేలా చేయడంలో ఆమె విశేష శ్రద్ధ చూపారు.

2019 సార్వత్రిక ఎన్నికల సందర్భంగా మాయావతిని సంభావ్య కాంగ్రేసేతర, బీజేపీయేతర ప్రత్యామ్నాయ నాయకురాలుగా పరిగణన పొందుతున్నారు. అయితే నిజానికి ఆమె ఒక ధీరోదాత్త నాయకురాలూ కాదు, సామాజిక పరివర్తనకు ప్రతీకా కాదు. 'మోదీ కాకుండా ఎవరైనే సరే'అన్న భావనతో ఉన్న వారు ఆమెను ఒక వ్యూహాత్మక ప్రత్యామ్నాయంగా చూస్తున్నారు. ముఖ్యంగా ప్రధాన హిందీ రాష్ట్రాలలో మోదీని సమర్థంగా ఎదుర్కోగల నాయకురాలు మాయావతే అని విశ్వసిస్తున్నారు. ప్రధాని మోదీ 2014 సార్వత్రిక ఎన్నికలలో తనను తాను చాయ్ వాలాగా ఓటర్ల మనస్సులలో సుప్రతిష్ఠితం చేసుకున్నారు. గుజరాత్‌లోని మార్మూల పట్టణమైన వాద్‌నగర్ నుంచి న్యూఢిల్లీలోని 7 లోక్ కల్యాణ్ మార్గ్ (ప్రధానమంత్రి అధికార నివాసం)కు ఆయన ప్రస్థానం ఆధునిక భారతీయ విజయ గాథలలో ఒకటి. అతి సామాన్య నేపథ్యం నుంచి వచ్చిన మోదీ సుపరిపాలన నందించగలరని దేశప్రజలు విశ్వసించారు.. రాజకీయ విశ్వపు రాహుల్ గాంధీలతో పోల్చి చూసినప్పుడు మోదీ నాయకత్వమే అన్నివిధాల మెరుగైనదిగా భావించారు.

మరి కుల, జెండర్, ఆర్థిక అసమానతలతో పోరాడి, అధిగమించి భారతదేశపు అత్యంత సంక్లిష్ట రాష్ట్రమైన ఉత్తరప్రదేశ్ లో అధికారాన్ని స్వాయత్తం చేసుకున్న మాయావతి జీవిత కథ ప్రగాఢ ఆసక్తిని కల్గిస్తుంది. అతి సామాన్యమైన స్వీయ మూలాల గురించి తరచు చెప్పుకొనే మాటల మాంత్రికుడు నరేంద్ర మోదీ సైతం ఈ 'పేద దళితుని కుమార్తె' జీవిత ఇతివృత్తంతో పోటీ పడలేరు. కుల అస్తిత్వాలే ఓటర్ల నిర్ణయాలను ప్రభావితం చేస్తున్న రాజకీయ వ్యవస్థ మనది. ఇటువంటి వ్యవస్థలో ప్రధానమంత్రి అభ్యర్థిగా బెహెన్ జీ ని నిర్ణయించడం జరిగితే దళితులను సమైక్యం చేయడానికి విశేషంగా దోహదం చేయగలదు. అంతేగాక రాజకీయ హిందూత్వ ప్రాభవం అంతకంతకూ పెరిగిపోతుండడం పట్ల తీవ్రంగా భయాందోళనలకు గురవుతున్న సామాజిక వర్గాలతో కలిసి ఒక విశాల కూటమిని నిర్మించడం కూడా సాధ్యమవుతుంది. అవినీతి ఆరోణపల నెదుర్కొంటున్న 'కళంకిత' బీఎస్పీ నాయకురాలును ప్రధానమంత్రి అభ్యర్థిగా నిర్ణయించడం పట్ల పట్టణ ప్రాంతాల మధ్యతరగతి ప్రజలు ఆగ్రహావేశాలు వ్యక్తం చేయడం ఖాయం. అయితే ఉత్తరప్రదేశ్ గల్లీలు, మొహల్లాలలో అటువంటి నిర్ణయం పట్ల సానుకూలత తప్పక వ్యక్తమవుతుంది. మరింత స్పష్టంగా చెప్పాలంటే మాయావతి ప్రధాన మంత్రిత్వ ఆకాంక్ష ప్రభావాన్ని తక్కువగా అంచనా వేయడం తగదు.

కనుకనే సమాజ్ వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్, గత పాతికేళ్ళుగా యాదవులుదళితుల మధ్య నెలకొనివున్న వైషమ్యాలను పూర్తిగా విస్మరించి బీఎస్పీతో పొత్తు కుదుర్చుకున్నారు. ప్రధానమంత్రి పదవిని ఆకాంక్షిస్తున్న ఇతర ప్రతిపక్ష నాయకులు ఎస్పీబీఎస్పీ పొత్తుతో వ్యాకుల పడకపోవచ్చు. అయితే రాబోయే 'జాతీయ' ఎన్నికలలో జయాపజయాలను నిర్ణయించడంలో ఒక రాష్ట్రానికి మాత్రమే పరిమితమయ్యే పొత్తులు, మరింత స్పష్టంగా చెప్పాలంటే స్థానిక పొత్తులే కీలక పాత్ర వహించనున్నాయనేది ఎవరూ కొట్టివేయలేని వాస్తవం. మరి ఈ పరిస్థితులలో ఎస్పీ మద్దతుతో బీఎస్పీ న్యూఢిల్లీ రాజకీయాలకు కొత్తరూపునివ్వగల శక్తిగా ఆవిర్భవించగలిగే అవకాశాన్ని త్రోసిపుచ్చలేము. మాయావతి ఇప్పుడు ఒక ఆరితేరిన రాజకీయ యోధురాలు. కాన్షీరామ్ ఒకప్పుడు తన గురించి చెప్పిన జోస్యాన్ని నిజం చేసేందుకు ధృఢ సంకల్పంతో పోరాడడానికి ఆమె వెనుకాడరనడంలో సందేహం లేదు.

తాజా కలం: నరేంద్ర మోదీ వలే మాయావతి కూడా దర్పంతో వ్యవహరించే రాజకీయ వేత్త. ఆయనగానీ, ఈమె గానీ తమను ప్రశ్నించడాన్ని సహించలేరు ఒక ఇంటర్వ్యూలో అవినీతి ఆరోపణల గురించి ఆమెను ప్రశ్నించాను. వెన్వెంటనే ఆమె అమిత ఆగ్రహంతో 'మీ పాత్రికేయులందరూ అగ్ర కుల మనువాదులు' అని తీవ్రంగా ప్రతిస్పందించారు. ఆమె విమర్శలో నిజం లేకపోలేదు. అనేక మీడియా సంస్థలలోని న్యూస్ రూమ్‌లలో మిగతా సమాజంలో వలే, దళితులకు చెప్పుకోదగిన అధికారయుత, ప్రభావశీల స్థానం లేదు.

(వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్)

యుగ పురుషుడు ఎన్టీఆర్

తన సినీ, రాజకీయ జీవితంలో ఎన్టీఆర్ ఎందుకు ఇంతమందికి ఆరాధ్యుడయ్యాడు? ఎందుకు అంతగా, ఎవరికీ దక్కనంతగా ఆయనకు జన నీరాజనాలు లభించాయని అడిగితే.. చెప్పడానికి అదొక వ్యక్తిత్వ పార్శ్వాంశం అవుతుంది. క్రమశిక్షణ, కఠోర శ్రమ, దృఢదీక్ష, పట్టుదల, నిబద్ధత, అంకితభావం వంటి అంశాలే మనిషి పరిణామ క్రమంలో వ్యక్తిత్వంగా రూపుదాల్చి పరిపూర్ణ మూర్తిమత్వాన్ని అందించేందుకు దోహదపడతాయని సామాజిక, మనస్తత్వ శాస్త్రం చెబుతుంది. ఈ విశ్లేషణలోని సానుకూలతలన్నీ ఒకే మనిషిలో ఉంటే అతడే యన్టీఆర్. ఆయనది పసిపిల్లాడి మనస్తత్వం. సమీపం నుంచి ఆయన్ని గమనించిన వారికే అది అవగతం. అంతెత్తున కోపం.. అంతలోనే క్షమ.. పట్టలేనంత ఆగ్రహం.. ఆ వెంటనే శాంతం.. భిన్న వైరుధ్యాలూ రెండూ ఆయన్ని దగ్గర నుంచి చూసినవారికి బాగా తెలుసు.

నట సార్వభౌముడిగా ఎన్టీఆర్ అందరికీ తెలుసు. వెండితెరపై గ్లామర్ హీరోగా వెలుగొందడానికి వెనుక ఆయన పడ్డ కష్టం కొద్దిమందికే తెలుసు. పరిస్థితులకు బెదిరిపోకుండా, ప్రతి సవాల్‌ను ఆత్మ విశ్వాసంతో ఎదుర్కొన్నారు. తన జీవితం వడ్డించిన విస్తరి కాదని ఆయనే చెప్పేవారు. సినీరంగంలో కాలు మోపడానికి, వచ్చిన అవకాశాలను నిలబెట్టుకోడానికి చాలా కష్టాలు పడ్డారు. హీరోగా నిలబడాలంటే మంచి దేహదారుఢ్యం ఉండాలని వ్యాయామశాలకు పోయి అత్యంత కష్టంతో కూడిన కసరత్తులు చేసేవారు. సినిమాల్లో అవకాశాలు వస్తున్న దశలో కూడా ఆర్థికంగా తను నిలబడే వరకు తన కోసం పరిమితంగా ఖర్చు పెట్టుకునే వారు. తొలినాళ్లలో అవకాశాలు లేక ఖాళీగా ఉన్నా కూడా ఏ నిర్మాతనూ అవకాశం ఇమ్మని బ్రతిమాడలేదు. అది తన స్వభావానికే విరుద్ధం. నిర్ణీత వేళకు ఐదు నిమిషాల ముందే షూటింగ్ స్పాట్‌లో ఉండేవారు. బయటి నగరాల్లో షూటింగ్ జరిగితే ఖరీదైన హోటల్ గదులలో దిగే వారు కాదు. స్టూడియోలోనే చిన్న గదిలో సర్దుకునేవారు. బ్రహ్మ ముహూర్తంలో నిద్ర లేచే అలవాటు తారక రాముడికి చిన్ననాటి నుంచి ఉండేది. ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో వేకువ జామున నిద్ర లేచి యెగాసనాలు, వర్కవుట్లు చేసి కాలకృత్యాలు తీర్చుకుని కూర్చుని ముఖ్య నిర్ణయాలు తీసుకునేవారు. ఏది ఏ సమయంలో జరగాలో అన్నీ సరిగ్గా ఆ సమయానికే జరిగేవి. ఒక్క నిమిషం కూడా అటూ ఇటూ కావడానికి ఆయన ఇష్టపడేవారు కారు.

డైరీలో ముఖ్యమైన విషయాలన్నీ రాసుకునేవారు. చక్కని దస్తూరి ఎన్టీఆర్ సొంతం. అక్షరాలు ముత్యాల్లా మెరిసిపోతుండేవి. పాఠశాల రోజుల్లో సహ విద్యార్థులు తనతో పుస్తకాల అట్టల మీద పేర్లు రాయించుకునేవారని చెప్పి మురిసిపోయేవారు. తారకరాముడు మంచి చిత్రకారుడు. షూటింగుల కోసం స్టూడియోలో సెట్టింగ్స్ నిర్మించేముందు కళాదర్శకులకు ఆయనే ప్లాన్లు గీసి ఇచ్చేవారు. దాంతో వారి పని సులభం అయ్యేది. ఆవిధంగా అనేక కళాఖండాల సృష్టి జరిగేది. ముఖ్యమంత్రి అయ్యాక కూడా భవనాలు, కట్టడాల విషయంలో ఇంతే ఆసక్తి చూపేవారు. సచివాలయంలో టెంపుల్ ఆర్కిటెక్చర్ ఎన్టీఆర్ స్వయంగా ఇచ్చిన ప్లాన్ ప్రకారం జరిగినదే. అదొక్కటే కాదు, బూర్గుల రామకృష్ణారావు భవనం, తెలుగు లలిత కళాతోరణం, బుద్ధ పూర్ణిమ ప్రాజెక్టు.. ఇంకా మరెన్నో నిర్మాణరీతులు ఎన్టీఆర్ స్వీయపర్యవేక్షణలో జరిగినవే.



నటుడిగా, నాయకుడిగా కంటే ముందు నందమూరి తారక రామారావు మానవతావాది. ఆ మానవీయ కోణమే ఆయన్ని యుగపురుషుడిగా మార్చి చరితార్థుణ్ని చేసింది.

భోజనాల దగ్గర కుటుంబసభ్యులే వడ్డించాలనేవారు. నౌకర్లు వడ్డిస్తే కోప్పడేవారు. ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆయన శ్రీమతి బసవతారకం భోజనం క్యారియర్ తీసుకుని సచివాలయానికి వచ్చి స్వయంగా వడ్డించేవారు. ఒకసారి ఎన్నికల ప్రచారంలో బిజీగా వుంటూ ఎయిర్‌పోర్టులో వుంటే ఇంటి నుంచి క్యారియర్ వచ్చింది కానీ, కుటుంబ సభ్యులు ఎవరూ రాలేదు. దాంతో ఇంటికి ఫోన్ చేసి చిన్నమ్మాయితో 'నీవు రానందుకు భోజనం చేయలేదమ్మా..' అని అలక చూపారు. చాలా విషయాల్లో ఆయన తన భావావేశాల్ని బాహాటంగానే ప్రదర్శించేవారు. ఇందిరాగాంధీకి రాజకీయంగా దెబ్బకొడుతూ ఆమెకు ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా ఎదిగిన ఎన్టీఆర్.. ఆమె చనిపోయిన సందర్భంలో పార్థివ దేహాన్ని చూసి ఎంతగానో చలించిపోయారు. విషణ్ణ వదనంతో అలా చూస్తుండిపోయారు. చాలాసేపటి వరకు కోలుకోలేకపోయారు. ఆయన కోపతాపాలు ప్రదర్శించే పద్ధతి కూడా సంస్కారవంతంగా ఉండేది. విపరీతమైన కోసం వస్తే 'ఐయామ్ సారీ బ్రదర్.. మీరు ఇలా చేస్తారని అనుకోలేదు..' అని మాత్రమే అనేవారు. అంతకుమించి పల్లెత్తు మాట పరుషంగా అనేవారు కాదు.

తల్లీ తండ్రీ ఆయనకు ప్రత్యక్ష దైవాలు. వారిని ఎంతగానో ఆరాధించేవారు. ఇంట్లో అడుగడుగునా వారి ఫోటోలే ఉండేవి. ఆ ఫోటోలు చూసి తన తల్లిదండ్రులను గుర్తుచేసుకుని చిన్న పిల్లాడిలా తల్లడిల్లిపోయేవారు. పూజలు, పునస్కారాల మీద పెద్దగా నమ్మకం లేకపోయినా, జ్యోతిష్యాన్ని, వాస్తుని మాత్రం బాగా విశ్వసించేవారు. క్రీమ్ కలర్ డ్రెస్ అంటే ఎక్కువ మక్కువ. ఆయన వార్డ్ రోబ్‌లో ఎక్కువ భాగం క్రీమ్ కలర్ కోట్లు కనిపిస్తాయి.

అమెరికా అధ్యక్షుడు తన సెక్యూరిటీ బాధ్యతలు చూసే సిబ్బందికి ఏటా ఒక రోజు బ్రహ్మాండమైన డిన్నర్ ఇస్తుంటారు. అలా మనం కూడా చేస్తే బావుంటుందని ఆయనకు సన్నిహితంగా మెలిగిన ఆనాటి ఇంటిలిజెన్స్ అధికారి హెచ్.జె. దొర చెబితే.. 'మనమూ ఇద్దాం. ఏర్పాట్లు చేయండి' అని ఆదేశించారు. మరుసటిరోజే ఆబిడ్స్‌లోని ఆయన నివాసంలో అద్భుతమైన విందుభోజనం సిద్ధం. ఇలాంటి మర్యాదలకు యన్టీఆర్ ఎప్పుడూ వెనుకాడే వారే కాదు. కానిస్టేబుల్ నుంచి ఎస్పీ వరకు సెక్యూరిటీలో ఉన్న అందరికీ ఆయనే స్వయంగా పర్యవేక్షించి భోజనాలు పెట్టారు. తన దగ్గర పనిచేసే సిబ్బంది పట్ల ఆపేక్ష చూపేవారు. తనకు దగ్గరగా మెలిగే అధికారులతో చాలా సన్నిహితంగా ఉండేవారు. మనసులో భావాల్ని పంచుకునేవారు. ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఎక్కువ కాలం ఆయనకు ముఖ్యకార్యదర్శిగా పనిచేసిన యు.బి. రాఘవేంద్రరావు విజయవాడలో స్కూటర్ మీద వెళ్తూ రోడ్డు ప్రమాదంలో మరణించారని తెలుసుకుని దిగ్భ్రాంతి చెందారు. కుటుంబంతో సహా విజయవాడ వెళ్లి అంత్యక్రియలు పూర్తయ్యేదాకా వుండి వెనక్కి వచ్చారు. ఆ తరువాత చాలా సందర్భాలలో రాఘవేంద్రరావుని తలచుకుని కన్నీటి పర్యంతమయ్యేవారు. నటుడిగా, నాయకుడిగా కంటే ముందు ఎన్టీఆర్ మానవతావాది. ఆ మానవీయ కోణమే ఆయన్ని యుగపురుషుడిగా మార్చి చరితార్థుణ్ని చేసింది.

■ దేశరాజు శ్రీనివాస్

(నేడు ఎన్టీఆర్ వర్ధంతి)

అపూర్వ రచయిత 'అంపశయ్య' నవీన్

ఒక నవల పేరే ఇంటిపేరుగా మారిన రచయిత ఎవరైనా ఉన్నారా? ఆంగ్లసాహిత్యంలో యులిసెస్ తర్వాత చైతన్య స్రవంతి శిల్పాన్ని, అంటే మన ఆలోచనా ప్రవాహాన్నే ఉన్నదున్నట్లుగా అక్షరరూపంలో పెట్టిన నవలాకారుడు ఎవరైనా ఉన్నారా? వెయ్యేళ్ల తెలుగు సాహిత్యంలో వెలువడిన వేలాది గ్రంథాల్లో ఎంపిక చేసిన వంద గ్రంథాల్లో ఒకటిగా గుర్తింపు పొందిన నవలను రాసింది ఎవరు? ప్రపంచంలో జరిగిన పలు విప్లవోద్యమాలతో పాటు భారత దేశంలో జరిగిన విప్లవోద్యమాలు, తెలంగాణసాయుధ పోరాటం, నక్సలైట్ ఉద్యమం, స్త్రీపురుష సంబంధాలు, ఎమర్జెన్సీ దారుణాలు, సంస్కరణలు ధ్వంసం చేసిన మానవ సంబంధాలు ఇలాంటి విస్తృత అంశాలపై పుంఖానుపుంఖాలుగా నవలలు, కథలు రచించిన ఏకైక తెలుగు రచయిత ఎవరు? వీటన్నిటికీ ఒకే సమాధానం వస్తుంది. ఆయన ఎవరో కాదు. అంపశయ్య నవీన్. 'అంపశయ్య' ఆయన ఇంటిపేరు కాదు ఆయన రాసిన నవల పేరు.

వరంగల్ జిల్లా పాలకుర్తి మండలంలోని వావిలాల తాలూకాలో మధ్యతరగతి వ్యవసాయదారులు దొంగరినారాయణ, పిచ్చమ్మ దంపతులకు 1941లో జన్మించిన దొంగరి మల్లయ్యే తర్వాతి కాలంలో తెలుగులో ప్రసిద్ధ నవలాకారుడు అవుతారని, తెలుగు సాహిత్యంలో శాశ్వత స్థానం సంపాదించుకుంటారని, ఎన్నో కీర్తి ప్రతిష్టలు ఆర్జిస్తారని, ఆర్థిక శాస్త్రంలో నిష్ణాతుడైన అధ్యాపకుడని ఎవరు ఊహించారు?

కవిమిత్రుడైన వరవరరావు సలహాతో నవీన్ గా పేరు మార్చుకున్న ఈ దొంగరి మల్లయ్య అదే పేరుతో అనేక కథలు రాశారు. బాల్యంలో ఆంధ్రమహాసభనుంచి తెలంగాణ పోరాటం, సంస్కరణల వరకు ఆయనను ప్రభావితం చేయని చారిత్రాత్మక ఘట్టాలు లేవు. బాల్యం నుంచే ఆయనకు రచన శ్వాసగా, ధ్యాసగా మారింది. వరంగల్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీలో ఇరివెంటి కృష్ణమూర్తి, జి.వి. సుబ్రహ్మణ్యం లాంటి వారి ప్రభావం, వరవరరావు, సి. రాఘవాచారి, శివకుమార్ లాంటి అభ్యుదయ, విప్లవ సాహితీకారులతో సాన్నిహిత్యం, కాళోజీ నారాయణరావు అగ్రజుడు కాళోజీ రామేశ్వరరావు స్థాపించిన మిత్రమండలితో పనిచేసి రైటర్స్ వర్క్‌షాప్‌లో పాఠాలు నేర్చుకోవడం, ఉస్మానియా యూనివర్సిటీలో విద్యార్థి జీవితం, మార్క్స్, ఫ్రాయిడ్, డార్విన్, సార్త్రే, రస్సెల్, బెర్నార్డ్ షా వంటి ఉద్దండుల రచనలను యువకుడుగా ఉన్నప్పుడే చదవడం, ఆర్థిక శాస్త్ర విద్యార్థిగా సమాజాన్ని అధ్యయనం చేయడం ఆయనను ప్రభావితం చేశాయి. ప్రతి అంశాన్ని ఆర్థిక, సామాజిక, మానసిక కోణంలో చూసే నవీన్ 32 పైగా నవలు, 6 కథా సంకలనాలు, 5 సాహిత్య వ్యాసాల సంకలనాలు వెలువరించారు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డుతో పాటు దేశ విదేశాల్లో ఎన్నో పురస్కారాలను అందుకున్నారు. నవీన్ రాసిన అనేక నవలల్లోను, కథల్లోనూ, వామపక్ష భావాలు, స్త్రీ వాద దృక్పథం, సెక్యులరిస్ట్ విధానాలు, శాస్త్రీయ దృక్పథం, కుల, మత, ప్రాంతాలకు అతీతమైన మానవత్వ భావాలు, తీవ్రవాద హింసాత్మక విధానాలకు వ్యతిరేకత స్పష్టంగా కనిపిస్తాయి. ఇవే ఆయనను రచయితగా నిలబెట్టాయి.

నవీన్ రచించిన తొలి నవల అంపశయ్య. ఈ రచనతోనే



రచయిత అయినవాడు ఏ ఒక్క విధానానికో, రాజకీయ పార్టీకో చెందినవాడు కాకూడదు. అలా అయితే అతడు తన స్వేచ్ఛా స్వాతంత్ర్యాలని కోల్పోతాడని, రచయితకు తాను అనుభూతి పొందింది రాసే స్వాతంత్ర్యం తప్పనిసరిగా వుండాలని నవీన్ భావిస్తారు. చలం, బుచ్చిబాబు, శ్రీశ్రీ తనను బాగా ప్రభావితం చేశారని ఆయన పలు సందర్భాల్లో చెప్పుకున్నారు.

నగర జీవితాన్ని చైతన్య స్రవంతి శిల్పం ద్వారా చెప్పిన తొలి తెలుగు నవలా రచయితగా ఆయన నిలిచిపోయారు. అంపశయ్య ఒక మనో వైజ్ఞానిక నవల కూడా. కాల్పనిక నవలా రచనలో ఒక ముఖ్య ప్రయోగం చేసిన తొలి రచయిత కూడా ఆయనే. మనిషిలో భావాలు, జ్ఞాపకాలు, అనుభవాలు ఒకదాని తర్వాత మరొకటి వస్తూనే ఉంటాయి. వాటిని అక్షరరూపంలో పెట్టడం అంత సులభం కాదు. ఆలోచన నిరంతరంగా సాగే ప్రవాహం. ఇంగ్లీష్ లో జేమ్స్ జాయిస్ రచించిన 'యులిసిస్' చైతన్య స్రవంతి శిల్పంతో రాసిన మొదటి నవల. గోపీచంద్ 'అసమర్థుని జీవయాత్ర', బుచ్చిబాబు 'చివరకు మిగిలేది', రావిశాస్త్రి 'అల్పజీవి', చండీదాస్ 'హిమజ్వాల', వినుకొండ రామదాసు 'ఊబిలో దున్న' నవలలలో ఈ చైతన్య స్రవంతి శిల్పాన్ని సందర్భోచితంగా ఉపయోగిస్తే పూర్తిగా అదే శిల్పంతో, అనితర సాధ్యమైన శైలితోసాగిన బృహత్తర నవల 'అంపశయ్య'. అందుకే ఈనవల పేరే రచయితకు ఇంటిపేరుగా మారిపోయింది. వెయ్యేళ్ల తెలుగు సాహిత్య చరిత్రలో వచ్చిన వంద గొప్ప నవలల్లో ఒకటిగా నిలిచిపోయింది. శిల్పం రీత్యా మాత్రమే కాదు, దేశ, విదేశాల్లో జరుగుతున్న సామాజిక పోరాటాలను, ఉద్యమాలను కూడా ఆయన మనకు ఈ నవల ద్వారా పరిచయం చేస్తారు. అందుకే వేలవేల మంది పాఠకులు ఈ నవలను ఇప్పటికీ చదివి ఒక గొప్ప అనుభూతిని పొందుతున్నారు. అంపశయ్యకు కొనసాగింపుగా ఆయన రాసిన ముళ్ల పొదలు, అంతస్రవంతి కూడా గొప్ప రచనలే. అందుకే వీటిని నవలాత్రయంగా విమర్శకులు గుర్తించారు.

2004లో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు పొందిన కాలరేఖలు తెలంగాణ రైతాంగ పోరాటం ఇతివృత్తంగా వచ్చిన గొప్ప నవల. బాల్యంలో పిల్లవాడిగా నవీన్ వరంగల్లో జరిగిన 11వ ఆంధ్రమహాసభను, 11 జతల ఎద్దులతో నడిపిస్తూ వీధుల వెంట ఉత్సవంగా ఊరేగించి అందులో సభాప్రముఖులను ప్రాంగణానికి చేరవేసిన సన్నివేశం నవీన్‌పై చెరగని ముద్ర వేసింది. యువకునిగా సాహిత్యంతో పరిచయమేర్పడినప్పుడు, ఈ ఊరేగింపు సన్నివేశం ప్రారంభ సన్నివేశంగా ఒక్క పెద్ద నవలను రాయాలని అనుకున్నాడు. అదే కాలరేఖలు నవలకు బీజం వేసింది కాలరేఖలు 1944 నుండి 1995 వరకు తెలంగాణ ప్రాంతపు సామాజిక, రాజకీయ, సాంస్కృతిక చరిత్రకు అద్దం పడుతుంది. 1600 కు పైగా పేజీలున్న ఈ గ్రంథాన్ని పాఠకుల సౌలభ్యం కోసం 'కాలరేఖలు', 'చెదిరిన స్వప్నాలు', 'బాంధవ్యాలు' అనే నవలాత్రయంగా విడుదల చేశారు. ఈ మూడు నవలలు ఇటు తెలంగాణ ప్రాంతంలోను, అటు భారత దేశంలోను, 50 సంవత్సరాలలో, (1944–1994) జరిగిన అనేక సంఘటనల్ని ఈ కాలంలో ప్రజల ఆర్థిక, రాజకీయ, సాంఘిక, జీవనాల్లో ఉత్పన్నమైన పరిణామాల్ని చిత్రిస్తాయి. 1996లో కళాశాల అధ్యాపక వృత్తికి పదవీ విరమణ చేశాక నవీన్ ఈ నవలను రాయడం మొదలు పెట్టారు. 50 ఏళ్లలో కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం లభించిన మూడో నవల 'కాలరేఖలు.'

నక్సలైట్లకూ, పోలీసులకు మధ్య జరుగుతున్న ఘర్షణలో బలవుతున్న అమాయకుల సమస్యను తన రక్తకాసారం నవలలో ధైర్యంగా చిత్రించిన తొలి నవలాకారుడు కూడా నవీనే. ఆయన నవల 'విచలిత' స్త్రీకో నీతినీ, పురుషుడికో నీతినీ అమలు పరిచే పితృస్వామ్య సమాజాన్ని ప్రశ్నిస్తుంది. స్వచ్ఛమైన ప్రేమ అంటే ఆయన తన 'సౌజన్య' నవలో చెప్పారు. స్వేచ్ఛగా జీవించే వారిని సమాజం సంప్రదాయాల పేరుతో ఎలా బంధిస్తుందో చెప్పేందుకు ఆయన 'సంకెళ్లు' అనే నవలు రాశారు. పైకి పోట్లాడుకుంటున్నా, యువతీయువకుల మధ్య ఏర్పడే బలీయమైన బంధాన్ని ఆయన నవల 'కరుణ' చిత్రిస్తుంది. ప్రైవేట్ పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయురాలిని ఆ పాఠశాల యాజమాన్యం ఎలా వేధిస్తుందో చెప్పేందుకు 'ప్రత్యూష' అనే నవల రాశారు. నవలాకారుడికీ, సాహిత్యాభిమాని అయిన యువతికీ మధ్య ఏర్పడే స్వచ్ఛమైన స్నేహబంధాన్ని వివరించే నవల 'తీరని దాహం'. భార్యాభర్తల మధ్య కలిసి జీవించడం నరకప్రాయమైనప్పుడు విడిపోవడమే శ్రేయస్కరమని వివరించే నవల 'చీకటి మూసిన ఏకాంతంలో'. ఉద్యోగాల్ని చేస్తున్న స్త్రీల సమస్యల్ని చిత్రించే నవల 'విమెన్స్ కాలేజ్'. జరిగిన ఒక సంఘటనను ఎవరెవరు వాళ్ల దృక్కోణాల్లో వేర్వేరుగా చూస్తారో, నిజంగా జరిగిందేమిటో చెప్పే ఎనిమిది వర్షన్సు అద్భుతంగా చిత్రించిన నవల 'దృక్కోణాలు'. ప్రపంచీకరణ నేపథ్యంగా ఉత్పన్నమైన సమస్యల చిత్రణ 'ఏ వెలుగులకీ ప్రస్థానం'? తన కిష్టమైన ప్రఖ్యాత రచయిత చలం జీవితాత్మక నవల 'ప్రేమకి ఆవలితీరం'. పాతికేళ్లలో తెలంగాణ ప్రాంతంలోనూ, భారత దేశంలోనూ తలెత్తిన అనేక ఉద్యమాల్ని, రాజకీయ పరిణామాల్ని నేపథ్యంగా తీసుకుని కుటుంబంలో మూడు తరాల్ని చిత్రించిన నవల 'బాంధవ్యాలు'. ఈ నవల టెలీసీరియల్‌గా వెలువడింది. నవీన్ రాసిన ఏ నవల, కథ చదివినా అవన్నీ మన జీవితానికి దగ్గరగా ఉన్నట్లే అనిపిస్తాయి.

రచయిత అయినవాడు ఏ ఒక్క విధానానికో, రాజకీయ పార్టీకోచెందినవాడు కాకూడదు. అలా అయితే అతడు తన స్వేచ్ఛా స్వాతంత్ర్యాలని కోల్పోతాడని, రచయితకు తాను అనుభూతి పొందింది రాసే స్వాతంత్ర్యం తప్పనిసరిగా వుండాలని నవీన్ భావిస్తారు. చలం, బుచ్చిబాబు, శ్రీశ్రీ తనను బాగా ప్రభావితం చేశారని ఆయన పలు సందర్భాల్లో చెప్పుకున్నారు. రచయితలు ఏమి రాసినా వారి హృదయాల్లో కలం ముంచి రాయాలని చలం చెప్పిన మాటలు ఆయనను ప్రభావితం చేశాయి. ఏ రచయితకైనా క్రమశిక్షణ, ఆదర్శవంతమయిన నడవడిచాలా ముఖ్యమైనవని ఆయన భావిస్తారు. ఇవి లేని ఎందరో గొప్ప కళాకారులు చాలా త్వరగానే వాళ్ళ కళ నుండి కనుమరుగై పోయిన ఉదంతాలు ప్రపంచ చరిత్రలో ఎన్నో వున్నాయని ఆయన గుర్తు చేశారు.

ఒక రచయితకు మరో రచయితను గుర్తించడం అనేది చాలా అరుదైన విషయం. కాని నవీన్ తోటి నవలాకారుల్ని గుర్తించి ఒక పురస్కారాన్ని ప్రవేశపెట్టారు. ఒక నవలాకారుడు రచించిన మొదటి నవలకు 10,000 రూపాయలు పురస్కారాన్ని ఇచ్చి, కొత్తగా నవలలు రాస్తున్న నవలాకారులని ప్రోత్సహించాలన్న లక్ష్యంతో 2012వ సంవత్సరం నుండి ఆయన 'నవీన్ సాహిత్య సమితి' ద్వారా ఈ పురస్కారాన్ని అందజేయడం గొప్ప విషయం.తాను రాసిన మొదటి నవల 'అంపశయ్య'ను ప్రచురించుకోవటానికి నేను ఎన్ని కష్టాలు పడ్డానో మరిచిపోకుండా, అలాంటి కష్టాలు ఒక ప్రతిభావంతుడైన నవలాకారుడు పడకూడదనే ఉద్దేశ్యంతోనేఈ పురస్కారాన్ని ఇవ్వడం చాలా గొప్ప విషయం. నవీన్ అనుసరించిన దారిలోనే నడుస్తున్న లోక్ నాయక్ ఫౌండేషన్ ప్రతిఏటా ఆయన లాంటి గొప్ప రచయితలను సన్మానించాలని నిర్ణయించింది. జ్ఞానపీఠ్ పురస్కారాన్ని తలపించే విధంగా ప్రతిష్టాత్మక పురస్కారాన్ని ప్రవేశపెట్టింది. జస్టిస్ చలమేశ్వరరావు, జస్టిస్ లావు నాగేశ్వరరావు, జస్టిస్ బాబ్డేల చేతుల మీదుగా నేడు ఆయనను సైకతస్థలి అయిన విశాఖలో సత్కరించుకోవడం ఒక మహత్తర ఘట్టం.

■ ఆచార్యయార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్

(రేపు అంపశయ్య నవీన్‌కు విశాఖపట్నంలో లోక్‌నాయక్ పురస్కార ప్రదానం)

ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం
శుక్రవారం • 18 జనవరి 2019

హెచ్చుతగ్గుల హొయలు!

దుస్తులన్నీ ఒకే పొడవుంటే వెరైటీ ఏముంటుంది? ఒకేలా కనిపించకుండా హెచ్చుతగ్గుల్లో జిగ్‌జాగ్‌గా ఉంటే అదో మ్యాజిక్. అలాంటి 'ఎసిమెట్రిక్ స్టయిల్'ను ఎంచక్కా ఫాలో అవ్వండి !



సొగసు

చుడీదార్, ఫ్రాక్, లెహంగా... నలుగురిలో కొత్తగా కనిపించాలంటే పొడవులో హెచ్చుతగ్గులు ఉండాలి. ముదురు రంగులు, ట్రెండీ డిజైన్లను ఫాలో అయితే అందర్లో మీరు మరింత ప్రత్యేకంగా కనిపిస్తారు!

లెగ్గిన్ వేసుకున్నా, మోకాళ్ల కిందవరకూ పొడవుండే టాప్ వేసుకున్నా ఆ దుస్తులకు నప్పే మేజోళ్లు ధరించాలి. అప్పుడే ఎసిమెట్రిక్ దుస్తుల్లో వన్నెలు చిందించవచ్చు.

స్కిన్ కేర్



సమతులా హారం తింటే సరిపోదు, చర్మం మెరవాలంటే ఆ ఆహారంలో కొంత స్కిన్ ఫుడ్ కూడా చేర్చాలి! చర్మం అడుగున ఉండే కొల్లాజెన్‌ను దృఢపరిచే ఆ స్కిన్ ఫుడ్ ఇదే!

చర్మం మెరుస్తుంది!

- **సబ్జా గింజలు:** వీటిలోని ఒమేగా 6 చర్మపు వయసును నిలువరించి, కొత్త చర్మం తయారయ్యేందుకు దోహదపడుతుంది.
- **పాలకూర:** చర్మపు నిగారింపును పెంచుతుంది. ఆహారంలో ఎక్కువగా తీసుకుంటే మంచిది.
- **నిమ్మరసం:** ఒంట్లోని టాక్సిన్లను బయటకు వెళ్లగొట్టి చర్మం మెరిసేలా చేస్తుంది. దీనిలోని విటమిన్ సి చర్మాన్ని రిఫ్రెష్ చేస్తుంది.
- **అవకాడో:** దీన్లోని ఒమేగా 9 కొత్త చర్మం త్వరితంగా తయారయ్యేలా సహాయపడతాయి. ఇటీవల అవకాడోను సౌందర్యపోషణలో భాగం చేస్తున్నారు.
- **ఓట్స్:** వీటిలోని సిలికాన్ ఖనిజలవణం చర్మం సాగే గుణాన్ని పెంచుతుంది.
- **పసుపు రంగు క్యాప్సికమ్:** చర్మం అడుగున కొల్లాజెన్ తయారీ పెంచి, చర్మం, కండర కణజాలం తయారీకి తోడ్పడుతుంది.

స్టయిల్

జీన్స్ ప్యాంట్ పొడవెంత?

జీన్స్ ప్యాంట్ ఒంటికి హత్తుకున్నట్టు అతుక్కుపోయిందని కొనేయకూడదు. వాటి ఎంపికలో కొన్ని రూల్స్ అనుసరించాలి. అవేంటంటే...



- **స్కిన్నీ జీన్స్**
స్కిన్నీ జీన్స్ లేదా జెగ్గింగ్స్... వీటిలో ఏది కొనేటప్పుడైనా దాని పొడవు యాంకిల్ దిగ కూడదు. యాంకిల్‌కి కొద్దిగా పైనే ఉండేలా చూసుకోవాలి.
- **స్ట్రెయిట్ లెగ్**
యాంకిల్ అడుగ లేదా యాంకిల్ మధ్య వరకూ పొడవుండేలా చూసుకోవాలి.
- **బూట్ కట్**
ధరించే షూని బట్టి ఈ రకం జీన్స్ ఎంచుకో వాలి. జీన్స్ ధరించిన పుడు నేలకు పావు లేదా అరంగుళం పైకి ఉండాలి. అప్పుడే బూట్‌కట్ ఎలివేట్ అవుతుంది.
- **ఫ్లేర్/వైడ్ లెగ్**
హీల్స్/షూ ఎత్తును బట్టి జీన్స్ ప్యాంట్, హీల్ నుంచి పావు లేదా అరంగుళం పైకి ఉండేలా చూసుకోవాలి.

బ్యూటీ

షెల్ఫ్‌లైఫ్ తెలుసుకోండి!

కాస్మొటిక్స్ కొంటే, అవి అయిపోయేవరకూ వాడవచ్చు అనుకుంటే పొరపాటు. మందుల్లాగే వాటికీ ఎక్స్‌పైరీ డేట్ ఉంటుంది. కాబట్టి సౌందర్య సాధనాల వాడకంలో వాటి షెల్ఫ్‌లైఫ్ గమనించుకోవాలి.



కాస్మొటిక్స్ షెల్ఫ్‌లైఫ్

- ఐ క్రీమ్ - 6 వారాలు
- లిప్ లైనర్ - 12 వారాలు
- మాయిశ్చరైజర్ - 12 వారాలు
- లిక్విడ్ ఐలైనర్ - 6 వారాలు
- పౌడర్ ఫౌండేషన్ - 18 వారాలు
- లిప్‌స్టిక్ - 24 వారాలు
- మస్కారా - 3 వారాలు
- ఐబ్రో పెన్సిల్ - 18 వారాలు

నగ ధగ



నగలంటే ఖర్చుతో కూడుకున్న వ్యవహారం! అలాంటప్పుడు పెట్టిన ధరకు తగిన నగలను ఎంచుకోవాలి. ఆ ఎంపికలో కొన్ని జాగ్రత్తలు తప్పక పాటించాలి!

నగలు కొంటున్నారా?

బంగారు నగలైతే...

* బంగారం నగకు 22 కేరెట్ల హాల్‌మార్కింగ్ ఉండి తీరాలి.
* బిల్లింగ్‌లో బరువు ఎంత వేశారు? తరుగు జోడించారా? అనేది చూసుకోవాలి.
* మెషిన్ మేడ్ నగ తరుగు 8% ఉంటుంది. హ్యాండ్ మేడ్ నగల తరుగు 12 నుంచి 18% ఉంటాయి.
* డీప్ నక్షి ఉండే కోయంబత్తూరు హ్యాండ్‌మేడ్ జ్యువెలరీకి ఎక్కువ తరుగు ఉంటుంది.
* మేకింగ్ ఛార్జీ హ్యాండ్‌మేడ్ నగలకైతే గ్రాముకు 200 నుంచి 400 వరకు పనితనాన్ని బట్టి ఉంటుంది.

డైమండ్ నగలైతే...

* కొన్న ప్రతి నగకూ ఐజిఎ సర్టిఫికెట్ కచ్చితంగా తీసుకోవాలి.
* వజ్రాల్లో క్లారిటీ, కలర్, కట్ ముఖ్యం.
* దుకాణదారులు గ్రాస్ వెయిట్ వేస్తున్నదీ, లేనిదీ చెక్ చేసుకోవాలి. ఉదాహరణకు 30 గ్రాముల నగ కొంటే దాన్లో 28 గ్రాముల బంగారం, 2 గ్రాములు వజ్రాలు ఉంటే, వాటి బరువు తీసేసి, 28 గ్రాముల బరువుకే ధర వేయవలసి ఉంటుంది. మిగతా రెండు గ్రాముల వజ్రాలకు విడిగా ధర లెక్కించాలి.

పోల్కి నగలైతే...

* మోజోనైట్ లేదా అన్‌కట్... వీటిలో నగ ఏదనేది గమనించుకోవాలి.
* మోజోనైట్ రాళ్ల కేరెట్ విలువ 15 వందల నుంచి 2 వేల 5 వందల రూపాయల వరకూ ఉంటుంది.
* అన్‌కట్ రాళ్ల సైజును బట్టి కేరెట్ 12 నుంచి 18 వేల వరకూ ధర పలుకుతాయి.

కుందన్ నగలైతే...

* కుందన్‌లో మొజోనైట్ లేదా అన్ కట్ రకం గురించి అవగాహన ఉండాలి.
* ఇవి కేరెట్ 3 వేల 500 నుంచి 5 వేల రూపాయల వరకూ ఉంటుంది.
* కుందన్, పోల్కి ఐదేళ్ల తర్వాత నల్లబడతాయి. కాబట్టి కొనేటప్పుడే పాలిష్ చేసిస్తారో, లేదో ఆరా తీయాలి.

ఏ నగ అయినా ధరలు సరిచూసుకుని కొనుక్కోవడం శ్రేయస్కరం.

మంజులా రావు
మంజుల జ్యువెల్స్, హైదరాబాద్.



జనహితం... అభిమతం!

భారతీయ సనాతన ధార్మిక ఆధ్యాత్మిక యాత్రలో యజ్ఞయాగాలు చాలా శక్తిమంతమైన సాధనాలుగా పూర్వులు పేర్కొన్నారు. వీటివల్ల వ్యక్తిగత ప్రయోజనాలే కాకుండా, విశ్వాంతరాళాలకు పనికి వచ్చే మహత్తరమైన ఇతర ప్రయోజనాలు అనేకం సిద్ధిస్తాయని వేదాలూ, పురాణాలూ చెబుతున్నాయి. ఈ నెల 21 నుంచి తెలంగాణ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర రావు చతుర్వేద పురస్సర మహారుద్ర సహిత సహస్ర చండీయాగం నిర్వహిస్తున్న నేపథ్యంలో వివిధ యాగాల విశిష్టత,అవి అందించే ఫలితాల గురించి ఈ కార్యక్రమాల్లో పాలుపంచుకుంటున్న వేద పండితులు వెల్లడించిన విశేషాలు:

చండి అంటే ఎవరు?

చండీదేవి త్రిగుణాత్మిక. సత్త్వ, రజో, తమో గుణ స్వరూపం. మహా కాళి, మహాలక్ష్మి, మహా సరస్వతుల సమ్మేళనం. లోకాన్ని కల్లోలం చేయడానికీ, ప్రకృతిని నాశనం చేయడానికీ, ప్రజల శ్రేయస్సు కోరే ఋషులకు హాని చేయడానికీ, లోక శాంతిని చిన్నాభిన్నం చేయడానికీ చండముండులు ఉద్భవించారు. వారి బారి నుంచి లోకాన్ని కాపాడాలని ముక్కోటి దేవతలూ అమ్మవారిని వేడుకున్నారు. ఇంద్రుడు తన వజ్రాయుధాన్నీ, యముడు తన పాశాన్నీ... ఇలా సమస్త దేవతలూ ఆమెకు తమ ఆయుధాలను అర్పించారు. అమ్మవారు ఆ రాక్షసుల్ని సంహరించి, 'చాముండి' అయింది.

ఆమెను ప్రతిరోజూ ఆరాధించాలి!

చండీ దేవత చాలా ప్రచండ శక్తి. సృష్టి, స్థితి, లయాలకు అవసరమైన శక్తి ఆమెలోనే ఉంది. ఒక్క భూమి మీదనే కాకుండా, విశ్వాంతరాళాల్లోని సమస్త శక్తులూ ఆమెను అంటిపెట్టుకొని ఉంటాయి. 'న తత్ర దేశే దుర్భిక్షం న చ దుఃఖ ప్రవర్తతే, న కాలే మ్రియతే కశ్చిత్ పూజ్యతే యత్ర చండికా'... ఎక్కడైతే చండీ ఆరాధనలు జరుగుతాయో అక్కడ దుర్భిక్షం ఉండదు. దుఃఖం అనేది రాదు. ఆ ప్రాంతంలో అకాల మరణం ఉండదు. ఆ జగన్మాత ధర్మార్థ కామమోక్షాలను అనుగ్రహిస్తుంది. కాబట్టి ఆమెను ప్రతిరోజూ ఆరాధించాలి.

'యజ్ఞం' అంటే ఆహుతులు సమర్పించుకోవడం. దీన్ని 'హవనం' అనీ, 'యాగం' అనీ, 'హోమం' అనీ కూడా అంటారు. నిర్దిష్టమైన పద్ధతుల్లో దేవతలను అగ్నిలోకి ఆవాహన చేసి, అలా వచ్చిన దేవతల సంతృప్తి కోసం, వేద మంత్రోచ్చారణలతో రకరకాల ఆహుతులను అగ్ని ద్వారా వారికి సమర్పిస్తారు. ఇవి నేరుగా ఆ దేవతలకు చెందుతాయనేది సనాతన ధర్మ విశ్వాసం. 'తం యజ్ఞం బర్హిషి ప్రౌక్షన్ పురుషం జాతమగ్రతః'- అని వేదం చెబుతోంది. భగవంతుడు మొదట ఈ ప్రపంచాన్నీ, తరువాత మానవాళినీ, ఆ తరువాత మానవాళి వృద్ధి కోసం, సంక్షేమం కోసం వేదాల ద్వారా యజ్ఞాలనూ సృష్టించాడు. 'యజ్ఞోహి శ్రేష్ఠ తమం కర్మః'- అంటే శాస్త్రానుసారం మానవులు ఆచరించే అన్ని కర్మల్లో శ్రేష్ఠమైన కర్మ యజ్ఞం. శాస్త్ర ప్రమాణంగా హోమ ద్రవ్యాలను సరైన పద్ధతిలో అగ్నికి ఆహుతి ఇచ్చినప్పుడు, అవి నేరుగా సూర్యుడికి చేరుతాయి. ఆ సూర్యుడి నుంచి వర్షాలూ, ఆ వర్షాల నుంచి పాడిపంటలు.. అంటే అన్నం లభిస్తాయి. దీని ఫలితంగా ప్రజలందరూ సుభిక్షంగా ఉంటారు.



- విరివింటి ఫణిశశాంక శర్మ, దక్షిణామ్నాయ శృంగేరీ శారదా పీఠం ప్రతినిధి

విశేష ఫలదాయకాలు

నిష్ఠతో చేసే ప్రతి యాగం మహత్తరమైన ఫలితాలను ఇస్తుంది. చండీ అమ్మవారి ప్రీతి కోసం 'చండీ యాగం' చేయడం అనేది పురాణ కాలం నుంచీ ఉంది. సూర్యుడి ఎనిమిదో కుమారుడు సావర్ణుడు ఈ యాగం చేసి మనువు అయ్యాడు. దీన్ని ఆచరించడం వల్ల కర్త కోరుకొనే ధర్మార్థ కామాలు సిద్ధిస్తాయి. ఎలాంటి శత్రువైనా మిత్రునిగా మారడానికి అవకాశం కలుగుతుంది. 'కలౌ చండీ వినాయకః' అంటారు. అంటే కలియుగంలో సులభంగా ప్రసన్నులై ఇష్టకామ్యాలను తీర్చేవారు వినాయకుడు, చండీ దేవి. కలియుగంలో చేసే యాగాల్లో మహోత్కృష్టమైనది చండీయాగం. దీనివల్ల కరువు కాటకాలు తొలగిపోతాయి. ప్రజలు సుఖ సంతోషాలతో ఉంటారు.



రుద్రయాగం అంటే...

రుద్రయాగం విషయానికి వస్తే, 'నా రుద్రో రుద్ర మర్చయేత్!'- రుద్రాంశను శరీరంలో నిలుపుకొని శివుణ్ణి అర్చించాలి. శరీరంలోని అవయవాలన్నీ శుద్ధి కావాలంటే పాదాల నుంచి శిరస్సు వరకూ ప్రతి అవయవాన్నీ మంత్ర సహితంగా అర్చించాలి. అప్పుడు మనం రుద్రులం అవుతాం. శివాంశ మనలో నిలిచి, సత్కార్యాలకు ప్రేరేపిస్తుంది. రుద్రాభిషేకం, రుద్ర యాగాల పరమార్థం అదే. 'ఓం త్ర్యంబకం యజామహే సుగంధిం పుష్టి వర్ధనం'... మృత్యువును తొలగించే రుద్రుడు ఐశ్వర్య కారకుడు కూడా! ఆరోగ్యాన్ని సూర్యుడు ఇస్తాడు. ధనాన్ని ఇచ్చేది ఈశ్వరుడు. లక్ష్మీదేవి దాన్ని కాపాడుతుంది. లోకంలో సర్వులూ ధనాన్ని కలిగి ఉంటూ, అపమృత్యు భయం లేకుండా జీవనం సాగించడానికి 'అతి రుద్ర యాగం' దోహదకారి అవుతుంది.

చతుర్వేద స్వాహాకారం...

ఇక చతుర్వేద మంత్రాలు పఠిస్తూ, స్వాహాకారం చేయడం వల్ల ప్రకృతిలో ఉన్నవన్నీ వాటి వాటి పనులను సక్రమంగా, సకాలంలో నెరవేరుస్తూ వెళ్తాయి. మేఘాలు సకాలంలో వర్షిస్తాయి. గాలులు ఆగకుండా వీస్తాయి. ఆకాశం చల్లదనాన్ని అందిస్తుంది. ఇలా ప్రకృతిలో ప్రతీదీ నిర్విఘ్నంగా కొనసాగుతుంది.



- జోషి గోపాలశర్మ, యజుర్వేద పండితులు

యజ్ఞాలు ఎందుకంటే...

'సర్వ హితాయ వేదాయ'- అంటే సర్వుల హితం కోరేది వేదం. సర్వ ప్రపంచం మంచినీ కోరడమే వేదం వైశిష్ట్యం. అది ఎప్పుడూ బహుముఖ ప్రయోజనాల్ని ఆకాంక్షిస్తుంది. యజ్ఞయాగాదులన్నీ దేవతలకు మనం చెల్లించాల్సిన పన్ను చెల్లించడం లాంటివి! ప్రభుత్వాలకు పన్నులు సకాలంలో చెల్లిస్తే మనకు అవసరమైన సదుపాయాలు కల్పించినట్టు, దేవతలకు యజ్ఞయాగాదుల ద్వారా హవిస్సును అర్పిస్తే సకాలంలో వర్షాదులు కురిసి మనకు శ్రేయస్సు కలుగుతుంది. 'యజ్ఞోవై విష్ణుః' అని శ్రుతులు చెబుతున్నాయి. పరమేశ్వరుడి ప్రీత్యర్థం చేసే వైదికకర్మ యజ్ఞం. అలాగే 'అగ్ని ముఖావై దేవా'- అంటే దేవతలకు అగ్ని ముఖంగా హవిస్సులు సమర్పించాలి. ఆయన ఏ దేవతకు ఏది చెందాలో వారికి అది అందజేస్తాడు. దీనివల్ల దేవతలు సంతృప్తి చెందుతారు. ఏ కాలంలో అందవలసినవి ఆ కాలంలో మానవులకు అందుతాయి. పూర్వం రాజులు యజ్ఞయాగాదులు చేసేవారు. సంపన్నులు కూడా చేసేవారు. పాలకులు చేసే ఇలాంటి వైదిక కర్మల ఫలితం కేవలం వారికే కాదు, ప్రజాబాహుళ్యానికి కూడా లభిస్తుంది. ప్రతి యాగానికీ దానిదైన వైశిష్ట్యం ఉంది. ప్రస్తుతం చతుర్వేద పురస్సర మహారుద్ర సహిత సహస్ర చండీయాగాన్ని మా గురువుగారు మాడుగుల మాణిక్య సోమయాజి వైదిక పర్యవేక్షణలో నిర్వహిస్తున్నారు.



- కాసుల చంద్రశేఖర శర్మ, యజుర్వేద పండితులు

సహస్ర చండీయాగం ఎలా చేస్తారంటే...

చండీహోమాల్లో నవచండీయాగం, శత చండీయాగం, సహస్ర చండీయాగం, అయుత చండీయాగం, లక్ష చండీయాగం ఉన్నాయి. ఇవన్నీ మహాకాళి, మహాసరస్వతి, మహాలక్ష్మి అమ్మవార్లందరికీ కలిపి నిర్వహించేవి. సహస్ర చండీయాగాన్ని అయిదు రోజులు చేస్తారు. దీనిలో వందమంది ఋత్విక్కులు పాల్గొంటారు. వందతో మొదలుపెట్టి తరువాతి రోజు రెట్టింపు చేస్తూ నాలుగవ రోజుకు వెయ్యిసార్లు సప్తశతి పారాయణ, నాలుగు లక్షలతో మొదలుపెట్టి రోజుకు లక్ష తగ్గిస్తూ నాలుగో రోజు పూర్తయ్యేసరికి పది లక్షల నవార్ణ మంత్ర జపాలు చేస్తారు. ఈ నాలుగు రోజుల్లో ప్రతి రోజూ నవావరణ పూజ, చతుష్షష్టి యోగినీ దేవతల పూజ, దీపసహిత బలి, కల్పోక్త పూజ, కుంకుమార్చన, అవధారలు చేస్తారు. అయిదో రోజు అగ్ని ప్రతిష్ఠ చేసి, ఏడు లక్షల ఆహూతులతో అమ్మవారికి పరమాన్న ద్రవ్యంతో, లక్ష నవార్ణ మంత్రాలతో ఆజ్య హోమం, అంగ, ఆవరణ, పీఠ దేవతలకు ఆజ్యహోమం, తర్పణం చేస్తారు. ఇంద్ర శక్త్యాది దేవతలకు బలిదానం, పూర్ణాహుతి, దంపతి, సువాసిని, కన్యక పూజలు నిర్వహించి, అవభృతం చేస్తారు. తరువాత యాగసమాప్తి చేస్తారు.

రాజశ్యామల యాగం

రాజశ్యామల / రాజ మాతంగి యాగం గురించి చెప్పాలంటే, ఆమె దశ విద్యలలో ఒక దేవత. విష్ణువుకు పది అవతారాలు ఉన్నట్టే... ఆ పర దేవతకు కూడా పది విద్యలున్నాయి. పది దేవతా రూపాలున్నాయి. ఒక్కో దేవతను ఒక్కో రూపంలో, ఒక్కో మంత్రంతో ఆరాధిస్తారు. ఈ రాజ శ్యామల... శ్యామల వర్ణంతో ఉంటుంది. ఆమె త్రిపుర సుందరికి మంత్రిణి. ఆమెనే 'మరకత శ్యామల' అని సంస్కృతంలో పిలుస్తారు. వశీకరణం, ఐశ్వర్యం, రాజాశ్రయం కోరేవారు ఆమెను ఆరాధిస్తూ ఉంటారు. రాజశ్యామల యాగం విశేష ఫలాలను అందిస్తుంది.

ఇవీ నియమాలు...

యాగం చేసే యజమాని (కర్త) దీక్షాధారణ తరువాత ఏకభుక్తం చేయాలి. యజ్ఞశాల ఉన్న శివారును దాటకూడదు. ఇక ఋత్విక్కులు త్రికాల సంధ్యావందనం చేస్తారు. దీక్షలోనే కొనసాగుతారు. జపతపాల ద్వారా తమ శక్తిని ధారపోస్తారు. ఆహార నియమాలు పాటిస్తారు.

బగళాముఖి యాగం

'బగళాముఖి' యాగాన్ని తీసుకుంటే, ఇది చేయడం వల్ల శత్రుబుద్ధి ఉన్నవారిలో అలాంటి ఆలోచనలు నశిస్తాయి. సద్బుద్ధి కలుగుతుంది. యజ్ఞయాగాదులు చేసిన ప్రాంతం సస్యశ్యామలం అవుతుంది. ప్రజలు సుఖసంతోషాలతో ఉంటారు. అదే వీటి పరమార్థం.

21 నుంచి ఎర్రవల్లిలో...

తెలంగాణ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖరరావు ఈ నెల 21వ తేదీ నుంచి 25వ తేదీ వరకూ సిద్దిపేట జిల్లా ఎర్రవల్లిలోని తన వ్యవసాయ క్షేత్రంలో చతుర్వేద పురస్సర మహారుద్ర సహిత సహస్ర చండీయాగం నిర్వహిస్తున్నారు. రాజశ్యామల యాగం, బగళాముఖి యాగం కూడా వీటిలో భాగంగా ఉంటాయి. అయిదురోజుల పాటు నిర్వహించే ఈ కార్యక్రమాల్లో సుమారు రెండువందల మంది ఋత్విక్కులు పాల్గొంటారు.

స్మరణ

డాక్టర్లకు అందని అద్భుతం!

(గత సంచిక తరువాయి...)

నాకు జీవితంలో అత్యంత ఇష్టమైనది వంట. బహుశా జీవించడం, నటించడం నా వృత్తి కావచ్చు... కానీ వంట చెయ్యడం నాకు చాలా ఇష్టమైన ప్రవృత్తి. మా అమ్మాయి వాళ్ళింట్లో ఉండగా... నేను అమెరికా వచ్చిన మూడో రోజున, ఫోన్ రింగ్ అయింది. నేను వంటింట్లో ఉన్నాను. మా అమ్మాయి శచి మాట్లాడింది. "అమ్మా! నీ కొడుకు పిలుస్తున్నాడు" అని చెప్పింది. గుండె వేగంగా కొట్టుకుంది. ఏం జరిగిందో, ఏం వినాల్సి వస్తుందోనని కంగారుపడ్డాను. ఆ కంగారుతోనే ఫోన్ దగ్గరకు పరుగెత్తాను.

అవతల నుంచి మా అబ్బాయి గొంతు... "అమ్మా! ఏదో జరిగింది!" అన్నాడు.

"ఏం జరిగింది?" ఆందోళనగా అడిగాను. వద్దనుకున్నా నా గొంతులో కంగారు నాకే అర్థమవుతోంది.

"మేము ఇవాళ పొద్దున్న రెండోసారి చెకప్‌కు వెళ్ళాం. డాక్టర్లు నీ కోడలుకు ఇవాళ మళ్ళీ పరీక్ష చేశారు" మా వాడు చెప్పుకుంటూ వెళుతున్నాడు. నా మనసు వేగంగా పరిగెట్టసాగింది. "అమ్మా! ఆశ్చర్యం. నీ కోడలు ఒంట్లో క్యాన్సర్ కణాలు వాళ్ళకు ఎక్కడా కనిపించలేదు.... ఏదో అద్భుతం జరిగింది. దీన్ని బాబాయే చేశారు" అన్నాడు. ఆ తరువాత ఇంకా మా వాడు ఏదో



చెబుతున్నాడు. నేను "ఆ...ఆ..." అంటూనే ఉన్నాను కానీ మా వాడి మాటలు నా చెవులకు వినపడడం మానేశాయి. నా మనసంతా బాబా తలపులు, మాటలే!



షావుకారు జానకి
(ప్రముఖ నటి, సత్యసాయి బాబా భక్తురాలు)

అవును... స్వామి ఈ అద్భుతం చేశారు. నా ఆనందానికి అవధులు లేవు.

జరిగిన విషయం చూసి, డాక్టర్లు బిత్తరపోయారు. సైన్సుకు అందని ఈ సంగతి వారిని ఆలోచనలో పడేసింది. "అసలేమిటీ అద్భుతం! క్యాన్సర్ కణాలు కనపడకుండా పోవడం ఏమిటి! మాకు అంతా తికమకగా ఉంది" అని డాక్టర్లు చెప్పారు. మా కోడలు రాగిణి ప్రాణాలను కాపాడినందుకు స్వామికి నా మనసులోనే కోటి నమస్కారాలు చేసుకున్నా.

కృతజ్ఞతలు చెబుతూ, స్వామికి వెంటనే ఫ్యాక్స్ పంపించాను. "మీ ప్రేమకూ, దయకూ రాగిణి అర్హురాలు కాబట్టే మీరు ఈ అద్భుతం చేశారు. మీకు నా హృదయపూర్వక ధన్యవాదాలు స్వామీ!" అని ఆ ఫ్యాక్స్‌లో రాశాను!

బాబా ఇలా ఎంతమందిని, ఎన్ని విధాల కాపాడారో! ఆయన లీలలు, భక్తుల అనుభవాలు ఇంకా ఎన్నెన్నో!

(మరిన్ని అనుభవాలు వచ్చేవారం...)

కూర్పు: **రెంటాల జయదేవ**

నవ జీవనవేదం

విశ్వమంతా ఆ జగన్మాతే!

కాళిదాసు రచించిన 'శ్యామలా దండకం' అర్థాన్ని జీవితానికి ఉపయోగపడే విధంగా చెప్పుకుంటున్నాం. ఇప్పుడు మరొక శ్లోకం అర్థం తెలుసుకుందాం.

కంఠంలో ఉండే హారాలను, జగన్మాత వక్ష స్థలాన్ని వర్ణిస్తున్నాడు. అత్యంత భక్తి భావంతో అర్థాన్ని తెలుసుకుందాం.

తారకారాజినీకాశహారావళిస్మేర చారుస్తనాభోగభారానమన్మధ్య వల్లీవలిచ్ఛేద వీచీసముద్యత్సముల్లాస సందర్శితాకారసౌందర్యరత్నాకరే వల్లకీభృత్కరే కింకరశ్రీకరే

'తారకారాజినీకాశ'... అంటే నక్షత్రాల వలే ప్రకాశిస్తోంది. హారావళి... అమ్మవారు మెడలో ధరించిన హారాలు.

అమ్మవారు ధరించిన హారాలలోని మణులన్నీ నక్షత్రాల్లా ప్రకాశిస్తున్నాయి. ఆ హారాలలో ఉన్న ఒక్కొక్క మణి ఒక్కో నక్షత్రం. అంటే దీని భావం ఏమిటి? నక్షత్రాలను చూసినప్పుడల్లా ఆకాశాన్ని అమ్మవారిగా భావన చేయాలి. అది పొందే ప్రయత్నం చేయాలి. విశ్వానంతటినీ భగవంతుడిగా భావించాలి. 'హారావళిస్మేర చారుస్తనాభోగభారానమన్మధ్య వల్లీ వలిచ్ఛేద'... ఆ హారాల వల్ల వక్ష స్థలానికి మరింత శోభ వచ్చింది. ఇది శృంగారపరమైన వర్ణన కాదు. ఇక్కడ ఉన్న తత్త్వాన్ని గమనించాలి. లోకాలన్నీ పాలించే తల్లి ఆ జగన్మాత. స్తనభారం, హారభారం వల్ల నీ నడుము వంగిదమ్మా! 'మధ్య వల్లీ'... సన్నని తీగలా ఉందమ్మా! 'వలిచ్ఛేద'...అంటే ఆ భారం వల్ల నాభి భాగంలో కొన్ని ముడతలు పడుతున్నాయి. దీని వెనకాల ఉన్న తత్త్వం ఏమిటంటే.. ఎవరైనా సరే భారాన్ని తగ్గించుకోవాల్సిందే! ఐశ్వర్యాన్ని తగ్గించుకోవాల్సిందే. 'సందర్శితాకారం'.. ఆ త్రివలి ఆకారం చాలా అందంగా ఉందమ్మా! ఆ సౌందర్యం ఎంత అందంగా ఉందంటే 'రత్నాకరే'.. సముద్రమంత ఉంది. నిన్ను చూస్తుంటే సౌందర్య సాగరాన్ని చూస్తున్నట్టుందమ్మా! 'వల్లకీభృత్కరే'... అన్ని ఆభరణాలు ధరించినా అమ్మవారి దృష్టి ఆభరణాలపై కాకుండా వీణపై ఉంది. 'వల్లకీ' అంటే వీణ. 'కింకరశ్రీకరే'... మరి ఆభరణాలన్నీ ఎందుకు? అంటే కింకరులను శ్రీమంతులను చేయడానికి!



● **డా. గరికిపాటి నరసింహారావు**

దేవుని కార్యం... సత్కార్యం



సందేశం

సత్కార్యం అంటే... మనిషిని సృష్టించిన అల్లాహ్‌నూ, అంతిమ దినాన్నీ, దైవదూతలనూ, అల్లాహ్ అవతరింపజేసిన గ్రంథాన్నీ, ఆయన ప్రవక్తలనూ హృదయపూర్వకంగా విశ్వసించడం. అలాగే, అనంత కరుణామయుడు అల్లాహ్ పట్ల ప్రేమతో.. తాము ఎక్కువగా ఇష్టపడే బంధువుల కోసం, అనాథల కోసం, నిరుపేదల కోసం, బాటసారుల కోసం, సాయం చెయ్యండి అని అర్థించే వారి కోసం, ఖైదీలను విడుదల చెయ్యడం కోసం ఖర్చు చెయ్యడం. ప్రతి మనిషీ సాధ్యమైనన్ని సత్కార్యాలు చెయ్యడానికి ప్రయత్నించాలి. కాకపోతే మనం ఏ సత్కార్యం చేసినా దాని వెనుక దైవప్రీతి, పుణ్యం పొందే ఉద్దేశ్యం తప్ప మరేదీ ఉండకుండా జాగ్రత్త పడాలి.

మీరు చేసే ప్రతి సత్కార్యానికీ తగిన ప్రతిఫలాన్ని దైవమే అందిస్తాడు. మీరు చేసే పని చిన్నదైనప్పటికీ అపార పుణ్య ఫలాన్ని అందజేస్తాడు. మీలో ఎవరైనా... ఏదైనా చెడు జరుగుతున్నట్టు గమనిస్తే, ఆ చెడును రూపుమాపడానికి ప్రయత్నించాలి.

ఇస్లాంలో పొదుపు చెయ్యడం అంటే ఒక్కొక్క పైసా కూడబెడుతూ, ఆస్తులు పెంచుకోవడం కాదు. విలాసాలకు పోకుండా, అనవసరమైన ఖర్చులు వీలైనంత తగ్గించుకొని, తద్వారా పేదల సంక్షేమానికీ, ఇతర సత్కార్యాల కోసం పాటుపడాలన్నదే పొదుపు లక్ష్యం.

దైవ ప్రవక్త హితోక్తి: కింద ఉండే చెయ్యి కంటే పైన ఉండే చెయ్యి ఎంతో శ్రేష్ఠమైనది. పైచేయి అంటే (దానం) ఇచ్చే, (సత్కార్యాల కోసం) ఖర్చు పెట్టే చెయ్యి. కింది చెయ్యి అంటే (దానం) అడిగి తీసుకొనే చెయ్యి. (బుఖారీ, ముస్లిం) దైవ మార్గంలో ఖర్చు పెట్టడం వల్ల ధనం తరిగిపోదు. దాసుడు దానం చేయడానికి చెయ్యి చాచినప్పుడు, అది గ్రహీత చేతికి చేరుకోకముందే దైవం చేతికి చేరిపోతుంది. (హదీస్ తిర్మిజి)

అంతిమ దైవ ప్రవక్త మహమ్మద్ ఇలా తెలిపారు:

ఒక వ్యక్తి దారిలో నడుస్తున్నాడు. అతడికి ఒక ముళ్ళ కంప కనిపించింది. దారిలో రాయిని తొలగించడం లేదా ముల్లు కనబడినా, గాజు పెంకు లాంటి ఏవైనా ప్రమాదకరమైన వస్తువులు కనబడినప్పుడు వాటిని తొలగించడం కూడా గొప్ప సత్కార్యం అవుతుంది. కాబట్టి అతడు దారిలో నుంచి ఆ ముళ్ళ కంపను తొలగించాడు. చూడడానికి ఇది చిన్న పనిగా అనిపించవచ్చు. అయితే, ఆ పనికి ప్రతిఫలంగా... దైవం అతడి తప్పులు క్షమిస్తూ, తన అపార కరుణా కటాక్షాలను ప్రసరింపజేశాడు. నచ్చినవి తినండి, నచ్చిన దుస్తులు ధరించండి, దానం చేయండి. అయితే దుబారా ఖర్చులు చేయకండి. అహంకారానికి లోనుకాకండి.

● **మహమ్మద్ వహీదుద్దీన్**

డైలీ సుడోకు - 428

4				1			2	
	7		4	6				
	8				5		7	1
			7	2		6		
5								3
		9		5	4			
3	2		1				8	
				3	6		9	
	1			7				2


ఎలా పూరించాలి?

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. నిలువుగా, అడ్డంగానూ ప్రతీ లైనులోనూ 1 నుంచి 9 వరకు అంకెలను పూరించాలి. ఒకసారి పూరించిన అంకెను తిరిగి వాడకూడదు.

సుడోకు- 427 సమాధానం

1	9	3	7	2	4	8	5	6
6	8	7	5	9	1	3	2	4
2	5	4	6	3	8	9	7	1
7	1	8	2	4	5	6	3	9
5	6	9	3	8	7	1	4	2
4	3	2	9	1	6	5	8	7
8	7	5	1	6	2	4	9	3
9	2	1	4	5	3	7	6	8
3	4	6	8	7	9	2	1	5

నీళ్ల మీద తేలిన గొడ్డలి!



దైవమార్గం

ఎలీషా ప్రవక్త వద్ద శిక్షణలో కొందరు శిష్యులు ఉన్నారు. వారు ఉన్న స్థలం ఇరుగ్గా ఉన్న కారణంగా, కొత్త స్థలంలో పాఠశాల కట్టుకుందామని అనుకున్నారు. ఒక గొడ్డలి అరువు తెచ్చుకొని, చెట్ల నుంచి దాంతో కలప నరుక్కొంటున్నారు. ఒక చెట్టు మీద శిష్యుడు దూలం కోసం ఒక కొమ్మను నరుకుతూండగా, గొడ్డలి ఊడింది. దాని ఇనుప భాగం కింద ఉన్న నదిలో పడింది. 'అది అరువు తెచ్చుకున్న గొడ్డలి' అంటూ ఎలీషా ప్రవక్తతో శిష్యులు మొరపెట్టుకున్నారు. "ఒక చెట్టు కొమ్మను నరికి, అది పడిన చోట నీళ్లలో వెయ్యండి" అని ఎలీషా చెప్పారు. శిష్యులు అలా చెయ్యగానే, గొడ్డలి నీళ్ళ మీద తేలింది! శిష్యులు తమ పనిపూర్తి చేసుకొని, ఆ గొడ్డలిని తిరిగి ఇచ్చేశారు (2 కింగ్స్ 6:6).

ఇనుప వస్తువైన గొడ్డలి నీళ్లలో తేలడమా? అది పూర్తిగా అసంభవం కాదా!! కాని దైవప్రతినిధి అయిన ఎలీషా ప్రవక్త ఆ అసంభవాన్ని సుసాధ్యం చేశాడు. తమ పట్టణంలోని నీటి ఊటలోని నీళ్లు చేదయ్యాయనీ, ఆ నీటి ఊట మీదే ఆధారపడిన తమ బతుకులు ఇక బుగ్గిపాలైనట్టేననీ యెరికో పట్టణ ప్రజలు ఒకసారి మొరపెట్టుకున్నారు. ఎలీషా ప్రవక్త ఆ నీటిని తియ్యటి మంచినీటి ఊటగా మార్చారు. అందులోని నీళ్లు ఋతువులతో సంబంధం లేకుండా ఏడాది పొడవునా... గత 3,000 ఏళ్లుగా ఆ ప్రాంతాన్ని ఇప్పటికీ సుసంపన్నం చేస్తున్నాయి. సిరియా సైన్యాధిపతియైన నయమానుకు వచ్చిన భయంకరమైన కుష్టురోగాన్ని కూడా ఎలీషా ప్రవక్త నయం చేశాడు. భర్తను పోగొట్టుకొని, అప్పుల ఊబిలో చిక్కుకున్న ఒక విధవరాలి ఇంట నూనెను నీళ్లలా ప్రవహించేలా చేసి, ఆ నూనెను అమ్ముకొని అప్పులవాళ్ళకు డబ్బు తిరిగి చెల్లించే ఏర్పాటును కూడా ఎలీషాయే దేవుని పేరిట చేశాడు. చనిపోయిన ఒక చిన్నపిల్లవాడికి దేవుని పేరిట ప్రాణదానం చేశాడు. ఇవన్నీ 'గొడ్డలి నీళ్ల మీద తేలడం'లాంటి అసంభవాలే! కానీ దేవునికి అసాధ్యమైనదేదీ లేదని రుజువు చేసేందుకూ, ప్రజలకు అలా దేవుని మీద గురి, విశ్వాసం కలిగేలా చేసేందుకే ఎలీషా ఈ కార్యాలు చేశాడు. 'అసంభవం' అన్నది మనిషి సృష్టించుకున్న మాట. అది దేవుని 'డిక్షనరీ' లో లేదు.

తన కుమారుడు లేదా కుమార్తెయైన విశ్వాసులమైన మనల్ని ఆదుకునేందుకు, దేవుడు ఏదైనా, ఎంతైనా, ఎప్పుడైనా చేయడానికి సర్వదా సిద్ధంగా ఉన్నాడు. కొన్ని సార్లు మన సమస్యల కోసం ప్రార్థిస్తున్నపుడు, తమ ప్రార్థనాంశం ఎంత అసంభవమైన విషయమో తల్చుకున్నపుడు, నిరాశ సహజం. కాని గొడ్డలిని నీళ్ల మీద తేల్చిన దేవుడు... చేదు నీటిని మంచి నీటిగా మార్చి. యెరికోలో కోట్లాదిమందికి సుఖ జీవనాన్నిచ్చిన దేవుడు... కుష్టు వ్యాధి నుంచి నయమానుకు నిమిషాల్లో విముక్తినిచ్చిన దేవుడు... చనిపోయిన ఒక చిన్నవాడికి ప్రాణభిక్ష పెట్టిన దేవుడు... అంతే అద్భుతంగా, అసంభవాన్ని సంభవం చేస్తూ మీ సమస్యను కూడా తీర్చుతాడన్న విశ్వాసాన్ని కలిగి ఉంటే అది ఆశీర్వాదకరం.

ఎలీషా తన శక్తి నిరూపణకో, డబ్బు, పేరు ప్రఖ్యాతుల కోసమో అద్భుతాలు చెయ్యలేదు. వ్యక్తుల బాధలు తీర్చడానికి, పరిస్థితుల్ని చక్కబెట్టడానికి మాత్రమే చేశాడు. అందువల్ల, 'స్వస్థతా వీరులమనీ, తమ వద్దకు వస్తే అద్భుతాలు జరుగుతాయనే ప్రచారం చేసుకొనే వారి వద్దకు పరుగెత్తి కాలహరణం చేసుకొని, సమస్యను తీవ్రతరం చేసుకోవద్దు. ఎలీషా మహా ప్రవక్తే! అయినా అద్భుతాలు జరిగింది ఆయనలోని దైవిక శక్తితోనే. నిజానికి ఇది పాతనిబంధన యుగపు ఘటన. కాని కొత్త నిబంధన విశ్వాసులకు మరిన్ని మెరుగైన అవకాశాలున్నాయి. పాత కాలపు యాజక వ్యవస్థతో సంబంధం లేకుండా నేరుగా తనను సమీపించే మహా ఆశీర్వాదకరమైన ఆత్మీయ వ్యవస్థను ప్రభువు మనకు ఇచ్చాడు (హెబ్రీ 10:19-22). అర్ధరాత్రైనా, కారడవిలోనైనా, పిలిస్తే పలికి మన సమస్యను తన సమస్యగా భావించి తీర్చే ఆయన సాన్నిహిత్యాన్ని వదిలేసి, ఆయన పేరుతో పబ్బం గడుపుకునే వారిని ఆశ్రయించకండి. అందుకే ప్రభువు 'మీ చింత యావత్తు నా మీద వేయండి' అంటూ అభయమిచ్చాడు (1 పేతురు 5:7) కాని 'నా పరిచారకుల మీద వేయండి' అనలేదు.

● **సుశీల్ సందేశ్**


SMT. D.PARVATHI PRESENTS
DVV ENTERTAINMENT
MEGA POWERSTAR
MASS HIT
వినయ విధేయ రామ
DANAYYA DVV BOYAPATI SREENU
DEVI SRI PRASAD
M. RATHNAM RISHI PUNJABI - ARTHUR A. WILSON KOTAGIRI VENKATESWARA RAO
A.S. PRAKASH KANAL KANNAN V.Y. PRAVEEN KUMAR
2వ వారం
U/A
#VVR /ALWAYSRAMCHARAN /DVVMOVIES


DIL RAJU PRESENTS
SRI VENKATESWARA CREATIONS
'DIL' RAJU PRODUCTION
నేడే JRC కన్వెన్షన్,
హైదరాబాద్ లో సక్సస్‌మీట్
సా॥ 6 గం॥ల నుండి
FUN F2 FRUSTRATION
సంక్రాంతి అల్లుళ్ళు
SHIRISH - LAXMAN ANIL RAVIPUDI DEVI SRI PRASAD
HARSHITH REDDY SAMEER REDDY
AS PRAKASH TAMMIRAJU VENKAT BANDI RATNA KUMAR
S KRISHNA
U/A
ADITYA MUSIC
BOMMA BLOCKBUSTER



NBK FILMS LLP
వారాహి చలన చిత్రం
VIBRI
దివిలో కొలువైవున్న ఆరాధ్యరాముడికి
ఆత్మీయ నివాళి!
NTR కథానాయకుడు
క్రిష్ జాగర్లమూడి నందమూరి బాలకృష్ణ
సాయి కొర్రపాటి విష్ణు వర్ధన్ ఇందూరి యం.ఆర్.వి.ప్రసాద్ ఎమ్. ఎమ్. కీరవాణి
వి.ఎస్.జ్ఞాన శేఖర్ సాయి మాధవ్ బుర్రా సిరివెన్నెల సీతారామశాస్త్రి డా॥ ఎల్.శ్రీనాథ్ సాహి సురేష్
ఎర్రం రామకృష్ణ సంతోష్ కిరణ్ ఐశ్వర్య రాజీవ్ యుగంధర్.టి పుష్ప భాస్కర్ వంశీ శేఖర్


వైవీఎస్. చౌదరి, రాధాప్రసాద్, రమేశ్ ప్రసాద్, బాలకృష్ణ, గీతాంజలి, సురేశ్

ఎల్వీ ప్రసాద్ వ్యక్తిత్వం స్ఫూర్తిదాయకం

- నందమూరి బాలకృష్ణ

"నేను 'ఆదిత్య 369' చేసే సమయంలో ఎల్వీ ప్రసాద్‌గారిని కలిసేవాడిని. ఆయన చాలా సరదాగా ఉండేవారు. ఆయన జీవితం, వ్యక్తిత్వం అందరికీ స్ఫూర్తిదాయకం. గతాన్ని మనం మర్చిపోకూడదు. పెద్దల జీవితాలను గుర్తు చేసుకోవాలి. ఎల్వీప్రసాద్‌గారు కన్న కలలను రమేశ్‌గారు సాకారం చేస్తుండటం ఆనందంగా ఉంది" అని నందమూరి బాలకృష్ణ అన్నారు. ఆయన ముఖ్య అతిథిగా ఎల్వీప్రసాద్ 111వ జయంతి వేడుక హైదరాబాద్‌లోని ప్రసాద్‌ల్యాబ్స్‌లో గురువారం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నందమూరి బాలకృష్ణ మాట్లాడుతూ "ఎల్వీ ప్రసాద్‌గారి గురించి నేను చెప్పడమంటే సూర్యుడికి వెలుగు చూపించినట్టే అవుతుంది. ఆయన ఓ వ్యవస్థ. నటుడు కావాలనుకుని సినిమా రంగంలో అడుగుపెట్టారు. ఎందరికో స్ఫూర్తిని నింపేలా తానేంటో నిరూపించుకున్నారు. చెన్నైలో మా ఇల్లు, వాళ్ల ఇల్లు ఎదురెదురుగా ఉండేవి. కళ సమాజ సేవ కోసం అని నమ్మారు మా నాన్నగారు, ఎల్వీ ప్రసాద్‌గారు. సర్వేంద్రియాణాం నయనం ప్రధానం అని నమ్మి ఆయన ప్రసాద్స్ ఐ ఇన్‌స్టిట్యూట్‌ను ఏర్పాటు చేశారు. కృషి ఉంటే రుషులవుతారు అనడానికి ఆయన గొప్ప ఉదాహరణ" అని అన్నారు. రమేశ్‌ప్రసాద్ మాట్లాడుతూ "మా నాన్నగారికి సినిమానే సర్వస్వం. కుటుంబం కన్నా సినిమాను ఎక్కువ ప్రేమించారు. ఒక స్టూడియో నుంచి మరో స్టూడియోకు వెళ్తూ మధ్యలో రెస్ట్ తీసుకునేవారట. మా నాన్నగారు ముంబైకి వెళ్తే ధర్మేంద్ర, జితేంద్ర ఆయనకు పాదాభివందనం చేసేవారట. ఆయన మనసును అర్థం చేసుకున్న తర్వాత నేను సినిమా టెక్నికల్ అంశాల మీద దృష్టి పెట్టాను. ప్రసాద్ ల్యాబ్స్ బెస్ట్ ప్రాసెసింగ్ ల్యాబ్ అని ఇప్పటివరకు 17 సార్లు జాతీయ పురస్కారాలను అందుకున్నాం. ఏం చేసినా సామాజిక దృష్టితో ఆలోచించడం మా నాన్నగారికి అలవాటు. దాని ప్రతిఫలమే ప్రసాద్స్ ఐ ఇన్‌స్టిట్యూట్" అని అన్నారు. తన తాతగారి బయోపిక్ వస్తే బావుంటుందని రమేశ్ ప్రసాద్ కుమార్తె రాధాప్రసాద్ చెప్పారు. ఎల్వీ ప్రసాద్, ఎన్టీఆర్... ఇద్దరూ మహావృక్షాలని వైవీయస్ చౌదరి అన్నారు. 'ఇల్లాలు' చిత్రంలోని పాత్రను, 'సీతారామకల్యాణం'లో సీతమ్మ పాత్రను ఇప్పటికీ ప్రజలు గుర్తు చేస్తుంటారని సీనియర్ నటి గీతాంజలి అన్నారు. ఎల్వీ ప్రసాద్ జీవితం ప్రాతఃస్మరణీయమని ఎల్వీ ప్రసాద్ ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్‌కి చెందిన సురేశ్, సీనియర్ జర్నలిస్ట్ ప్రభు చెప్పారు.







రాముడెప్పుడూ... రాముడే!

సంస్మరణ

నేడు ఎన్టీఆర్ 23వ వర్ధంతి



నందమూరి తారక రామారావు... ఎన్టీఆర్...
మాస్ ప్రేక్షకులకు ముద్దుగా ఎన్టీవోడు...
పౌరాణిక చిత్రాలతో వెండితెర ఆరాధ్యదైవమైన రాముడు,
ప్రజాక్షేత్రంలో బడుగు బలహీన వర్గాల రామన్న...
పిలుపు ఏదైనా, కోట్లాది జనం తలపు... ఆయనే!
సినీప్రేక్షకులలో, సామాన్య జన హృదయాలలో అందరి అభిమానం ఆయన ఒక్కరిదే!!

సినిమాల్లో, రాజకీయాల్లో ఎన్టీఆర్ అపారమైన ప్రేమ సంపాదించడానికి కారణాలు అనేకం. వాటిలో అతి ముఖ్యమైనది... కష్టం కానీ, నష్టం రానీ... ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండడం! ఒకసారి మాట ఇచ్చాక వెనక్కి తగ్గకపోవడం!! ఈ మాట తప్పని, మడమ తిప్పని లక్షణం ఎన్టీఆర్ జీవితంలోనూ, పోషించిన సినిమా పాత్రల్లోనూ, రాజకీయ జీవితంలోనూ అడుగడుగునా కనిపిస్తుంది. వృత్తిలోనూ, ప్రవృత్తిలోనూ అలా బతకడం, జీవితం గడపడం అసిధారావ్రతం. జీవిత చరమాంకం దాకా అన్ని దశల్లో ఆ కత్తి మీద సామును విజయవంతంగా సాగించిన అరుదైన వ్యక్తి ఎన్టీఆర్.

మాటల్లో చెప్పినట్టే ఓ మనిషి బతకడం... అనుకునేంత సులభమేమీ కాదు. అందులోనూ వ్యాపారంతో కళ ముడిపడిన సినీ జీవితంలో మరీ కష్టం. పరిస్థితులను బట్టి ఎక్కడో అక్కడ రాజీ పడాల్సి వస్తుంది. రాజకీయాల్లో అయితే, అన్న మాట మీద నిలబడడం కష్టం. అవకాశవాద రాజకీయాలు చేయకుండా పాలిటిక్స్ చేయడం మరీ కష్టం. ఎన్టీఆర్ మాత్రం తన సిద్ధాంతాలతో ఎప్పుడూ, ఎక్కడా రాజీపడ లేదు. అందుకే, ఆయన స్ఫూర్తిదాయక పయనం గురించి ఇవాళ్టికీ జనం కథలు కథలుగా చెప్పుకుంటున్నారు. ఆయన తిరుగులేని ఆకర్షణ ఉన్న కథానాయకుడు, జనం మెచ్చిన మహానాయకుడు అని ప్రత్యర్థులు సైతం ఒప్పుకుంటున్నారు. చిన్నప్పటి నుంచి చివరి రోజుల దాకా ఎన్టీఆర్ జీవితాన్ని పరికిస్తే... మాటను బట్టి మనిషికి విలువ ఇచ్చారాయన! అంతేతప్ప, మనిషిని బట్టి మాట ఇవ్వలేదు!! చిన్నతనంలో కానీ, చదువు విషయంలో కానీ, నాటకాలు వేసే విషయంలో కానీ, తన పెళ్ళి విషయంలో కానీ, తమ్ముడి పెళ్ళి విషయంలో కానీ, ఉద్యోగం మానేసే విషయంలో కానీ, సినీ కథానాయకుడిగా కెరీర్ విషయంలో కానీ, రాజకీయ ప్రస్థానంలో కానీ... ఆయన నమ్మిన సిద్ధాంతం అదే! ఆయన జీవితకథ చదివితే ఆ సంగతి అర్థమవుతుంది.

ఒకే మాట... ఒకే బాణం... అన్నటువంటి 'తారకరాముడి'గా వెండితెరపై వెలిగిన ఆ మహానటుడు జీవితంలోనూ ఆ ఆదర్శాన్నే అనుసరించారు. నిర్మాతకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవడం కోసం కష్టపడ్డారు. తోటినటులు ముచ్చటపడ్డ పాత్ర కోసం తాను నష్టపడ్డారు. తోడబుట్టినవారి కోసం చివరికంటా నిలబడ్డారు. కన్నబిడ్డలతో సైతం కలబడ్డారు. కళాకారుడిగా ఆత్మతృప్తి కోసం నిర్మాతగా నష్టానికైనా సిద్ధపడ్డారు. కట్టుకున్న భార్యకు క్యాన్సర్ అంటే ఆ కష్టం మరొకరికి రావద్దనుకున్నారు. ఏకంగా ఒక వైద్యాలయాన్నే కట్టారు. . నిరుపేదల ఓటుకు ఖరీదు కట్టే విష రాజకీయాల వేళ... వట్టి మాటలు కట్టిపెట్టారు. పేదవాడికి పట్టెడన్నం పెట్టారు. అనుసరించిన అభిమానులను సైతం అందలాలెక్కించారు. 'అన్న రామన్న'గా అందరి మనసుల్లో నిలిచారు.

కృషి, పట్టుదల, నిజాయతీ, నిరంతర శ్రమ ఉంటే... సామాన్యుడికి సైతం అసామాన్య విజయం వరించి వస్తుందనడానికి ఎన్టీఆర్ సినీ జీవితం ఓ ఉదాహరణ. అవన్నీ ఇవాళ 'యన్.టి.ఆర్' బయోపిక్‌తో వెండితెరపైకి ఎక్కాయి. అవినీతిని సహించలేక సబ్ రిజిస్ట్రార్ ఉద్యోగం వదిలేయడం... తన వెంట నిలిచిన వర్ధమాన సినీ మిత్రులకు అండగా ఉండడం... అభిరుచి గల పాత్రల కోసం అవసరమైతే స్వీయ చిత్ర నిర్మాణానికైనా, దర్శకత్వానికైనా సై అనడం... పదితలల రావణాసురుడి దృశ్యం కోసం గంటల కొద్దీ కదలకుండా ఉండిపోవడం... పోటాపోటీ సినీసీమలో సాటి హీరో అడిగాడని తాను చేయాల్సిన చాణక్య పాత్రను సైతం అతనికే ఇవ్వడం... ఇలాంటివన్నీ అందులో కనిపించాయి. ఆ చిత్రీకరణకు విమర్శకుల ప్రశంసలు సైతం లభించాయి. ఒక వ్యక్తి జీవితం చరిత్రగా మారడం... చిరస్థాయిగా మిగలడం... చదివిన, చూసిన ప్రతిసారీ ఓ కొత్త మెరుపు మెరవడం... ఎన్టీఆర్ లాంటి కొందరి విషయంలోనే సాధ్యం. అందుకే, తెలుగునాట ఒకే ఒక్కడు... ఎన్టీఆర్.

వెండితెరపై మాట తప్పని రాముడు...
రాజకీయాల్లో మడమ తిప్పని రాముడు...
అవును... రాముడెప్పుడూ రాముడే!
అందుకే, తెలుగు జాతికి ఆయన చిరస్మరణీయుడు.

● కర్టెసీ : కొమ్మినేని వెంకటేశ్వరరావు

తారక్ అతిథిగా..!


ఎన్టీఆర్


అఖిల్

అఖిల్ అక్కినేని హీరోగా నటించిన 'మిస్టర్ మజ్ను' ప్రీ రిలీజ్ వేడుకకు చిన్న ఎన్టీఆర్ ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు. శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర ఎల్ఎల్‌పీ పతాకంపై బి.వి.యస్.యన్.ప్రసాద్ నిర్మిస్తున్న చిత్రమిది. వెంకీ అట్లూరి నిర్మాత. యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కింది. తమన్ సంగీతాన్ని అందించారు. ఈ సినిమాలోని అన్ని పాటలను ఇటీవల ఆన్‌లైన్‌లో విడుదల చేశారు. నిర్మాత మాట్లాడుతూ "పాటలకు చాలా మంచి స్పందన వస్తోంది. ప్రీ రిలీజ్ వేడుకను ఈ నెల 19న హైదరాబాద్‌లోని జె.ఆర్.సి.కన్వెన్షన్‌లో నిర్వహిస్తాం. ఈ వేడుకకు చిన్న ఎన్టీఆర్ ముఖ్య అతిథిగా హాజరవుతారు. మా చిత్రాన్ని రిపబ్లిక్ డే సందర్భంగా ఒక రోజు ముందుగానే అంటే ఈ నెల 25న భారీగా విడుదల చేస్తాం" అని అన్నారు. నిధి అగర్వాల్ నాయికగా నటించిన ఈ చిత్రంలో నాగబాబు, ప్రియదర్శి, జయప్రకాష్, హైపర్ ఆది ఇతర కీలక పాత్రధారులు.


శివ, నాగశౌర్య, కేఎస్ రామారావు, వెంకటేశ్వరరావు, శ్రీపాద విశ్వక్

సస్పెన్స్ థ్రిల్లర్

శివ కంఠంనేని టైటిల్ పాత్రధారిగా శ్రీపాద విశ్వక్ దర్శకత్వంలో రూపుదిద్దుకొన్న చిత్రం 'అక్కడొకడుంటాడు'. లైట్‌హౌస్ సినీ మ్యాజిక్ పతాకంపై కె.శివశంకరరావు, రావుల వెంకటేశ్వరరావు ఈ చిత్రాన్ని నిర్మించారు. ఇటీవల ఈ చిత్రం ట్రైలర్‌ను హీరో నాగశౌర్య ఆవిష్కరించగా, చిత్రంలోని 'ఆడిపాడి గడిపేద్దాం' పాటను నిర్మాత కె.ఎస్.రామారావు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'ట్రైలర్, పాట బాగున్నాయి. సినిమా కూడా ప్రేక్షకుల ఆదరణ పొందాలి' అన్నారు. 'సస్పెన్స్ థ్రిల్లర్ కథాంశంతో రూపుదిద్దుకొన్న ఈ చిత్రం పోస్టర్స్ ఆసక్తికరంగా ఉన్నాయి. టైటిల్ పాత్రధారి శివ కంఠంనేని తన పాత్రలో చక్కగా ఒదిగిపోయారు' అని ప్రశంసించారు. త్వరలో ఆడియోను, ఈ నెల్లోనే సినిమాను విడుదల చేస్తామని నిర్మాతలు తెలిపారు.

నాన్న ఆరోగ్యం మెరుగ్గా ఉంది

- గౌతమ్


బ్రహ్మానందం

'నాన్న ఆరోగ్యం నిలకడగానే ఉంది. ఐసీయు నుండి సాధారణ గదికి మార్చాం' అని ప్రముఖ హాస్యనటుడు బ్రహ్మానందం తనయుడు గౌతమ్ ఓ ప్రకటనలో తెలిపారు. సోమవారం బ్రహ్మానందానికి ముంబయ్‌లో శస్త్ర చికిత్స జరిగిన సంగతి విదితమే. 'నాన్నగారికి ఆపరేషన్ జరిగిందని తెలిసి అభిమానులు, శ్రేయోభిలాషులు, సినీ ప్రముఖులు ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి అడుగుతున్నారు. అందరి ప్రేమాభిమానాలు, ఆశీస్సుల వల్ల నాన్న ఆరోగ్యం చాలా మెరుగ్గా ఉంది' అని గౌతమ్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

ఇది తెలిస్తే...వాళ్లమ్మ చెంప చెళ్లుమనిపిస్తుంది!

- రకుల్ ప్రీత్‌సింగ్



"ఎక్కడో బయట ఉన్న అమ్మాయిని కాదు. మన ఇంట్లో ఆడవాళ్లని ఎవరైనా ఏమైనా అంటే ఎంత బాధగా ఉంటుందో తెలియజేయాలనే నేనలా మాట్లాడాను. నేను ఎందుకు అలా మాట్లాడాల్సి వచ్చిందో తెలుసుకుంటే వాళ్లమ్మ అతని చెంప చెళ్లుమనిపిస్తుంది" అని రకుల్ ప్రీత్‌సింగ్ ట్వీట్‌చేశారు. ఇంతకీ రకుల్ మాటల్లో వినిపిస్తున్న 'అతను' ఎవరు? దేని గురించి ఆమె అంత ఘాటుగా స్పందించారో తెలుసుకోవాలంటే గురువారం ఆమె చేసిన ట్వీట్లు గురించి తెలుసుకోవాల్సిందే. కురచ దుస్తులతో కారులో నుంచి దిగుతున్న రకుల్ ఫొటోను పోస్ట్ చేసి ఓ నెటిజన్ అసభ్యకరంగా కామెంట్ చేశారు. దీనికి రకుల్ స్పందించారు. "మీ ఇంట్లో మీ అమ్మని దీని గురించి అడుగు. దీంతో పాటు కాస్త సభ్యతను కూడా నేర్పమని అడుగు. చూసేవారి ఆలోచనల్లో మార్పు రానంత కాలం మహిళా సాధికారత గురించి, సమానత్వం గురించి ఎన్ని చర్చలు పెట్టినా వృథానే" అని ఆమె ట్వీట్ చేశారు. దీనికి కొందరు ఆమెకు సపోర్ట్ చేయగా, మరికొందరు 'అతని తల్లికి ఏం సంబంధం? ఆమెను ఎందుకు ఇందులోకి లాగారు?' అని సోషల్ మీడియాలో ప్రశ్నించసాగారు. వాటికి సమాధానంగా రకుల్ మరో పోస్ట్ చేశారు. కుటుంబసభ్యులను అంటే ఆ బాధ ఎలా ఉంటుందో తెలియజేయాలనే అలా ట్వీట్ చేసినట్టు అందులో పేర్కొన్నారు.

ఎల్ఐసీ దక్షిణ మధ్య జోన్ ప్రీమియం ఆదాయం రూ.35 వేల కోట్లు



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికం ముగిసేనాటికి మొత్తం రూ.35,000 కోట్ల బీమా ప్రీమియంను ఎల్ఐసీ దక్షిణ మధ్య జోన్ వసూలు చేసింది. 2018-19కి బీమా ప్రీమియం ఆదాయం రూ.55,000 కోట్లను మించగలదని జోనల్ మేనేజర్ టీసీ సుశీల్ కుమార్ తెలిపారు. కొత్తగా ప్రవేశపెట్టిన 'జీవన్ శాంతి' పాలసీకి ఆదరణ బాగా ఉందని.. ఈ పాలసీ తొలి ప్రీమియం ఆదాయం రూ.750 కోట్లు చేరిందని చెప్పారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి దక్షిణ మధ్య జోన్‌లో జీవన్ శాంతి పాలసీ తొలి ప్రీమియం ఆదాయం రూ.2,000 కోట్లకు చేరగలదన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

ఎల్ఐసీ దక్షిణ మధ్య జోన్ ప్రీమియం ఆదాయం రూ.35 వేల కోట్లు



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికం ముగిసేనాటికి మొత్తం రూ.35,000 కోట్ల బీమా ప్రీమియంను ఎల్ఐసీ దక్షిణ మధ్య జోన్ వసూలు చేసింది. 2018-19కి బీమా ప్రీమియం ఆదాయం రూ.55,000 కోట్లను మించగలదని జోనల్ మేనేజర్ టీసీ సుశీల్ కుమార్ తెలిపారు. కొత్తగా ప్రవేశపెట్టిన 'జీవన్ శాంతి' పాలసీకి ఆదరణ బాగా ఉందని.. ఈ పాలసీ తొలి ప్రీమియం ఆదాయం రూ.750 కోట్లు చేరిందని చెప్పారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి దక్షిణ మధ్య జోన్‌లో జీవన్ శాంతి పాలసీ తొలి ప్రీమియం ఆదాయం రూ.2,000 కోట్లకు చేరగలదన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. చనిపోయిన వారి బంధువులకు చేసిన చెల్లింపులు, మెచ్యూరిటీ, యాన్యుటీ క్లెయిమ్‌లు, ఇతర చెల్లింపులు కలిపి 2018 డిసెంబరు చివరి నాటికి మొత్తం రూ.25,000 కోట్లు చెల్లించినట్లు సుశీల్ చెప్పారు. పాలసీదారు చనిపోయినప్పుడు చాలా త్వరగా క్లెయిమ్‌లు చెల్లిస్తున్నామని, ఇటీవల కరీంనగర్, మైసూర్‌లలో ప్రమాదం జరిగిన 48 గంటల్లో చెల్లింపులు జరిగాయన్నారు.

జీతాల్లో 10% వృద్ధి

కార్న్ ఫెర్రీ నివేదిక అంచనా

న్యూఢిల్లీ: ఉద్యోగులకు మంచి వార్త. దేశీయంగా ఈ ఏడాదిలో ఉద్యోగుల జీతాల్లో రెండంకెల వృద్ధికి అవకాశం ఉందని గ్లోబల్ కన్సల్టింగ్ సంస్థ కార్న్ ఫెర్రీ నివేదిక అంచనా వేస్తోంది. ఆర్థిక వ్యవస్థలో శరవేగ వృద్ధి ఇందుకు కారణమని చెబుతోంది. గత ఏడాది జీతాల పెరుగుదల 9 శాతంగా ఉంది. ఈ ఏడాదిలో 10 శాతానికి పెరగవచ్చని, అయితే పెరిగే ద్రవ్యోల్బణాన్ని పరిగణనలోకి తీసుకుంటే వాస్తవంగా పెరిగే వేతనం 5 శాతంగా ఉండవచ్చని నివేదిక పేర్కొంది. గత ఏడాది వాస్తవ వేతన పెరుగుదల 4.7 శాతంగా ఉంది. ఆర్థిక వ్యవస్థలో శరవేగ వృద్ధి నెలకొంటున్న ఫలితంగా భారత్‌లో వేతన పెరుగుదల అత్యధికంగా ఉంటోందని, వాస్తవ వేతన వృద్ధి ఆసియాలోనే అధికంగా ఉందని కార్న్ ఫెర్రీ ఇండియా చైర్మన్, రీజినల్ మేనేజింగ్ డైరెక్టర్ నవనీత్ సింగ్ తెలిపారు. ఆటోమేషన్‌లో పెరుగుదల, కొత్త టెక్నాలజీల వినియోగం, నైపుణ్యం కలిగిన వారికి డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో కంపెనీలు వ్యాపార వ్యూహాల్లో మార్పులు చేర్పులకు చర్యలు తీసుకోవాలన్నారు.



- వేతనాల పెరుగుదల విషయానికొస్తే.. ఆసియాలో 5.4 శాతం (గత ఏడాది) నుంచి 5.6 శాతానికి (ఈ ఏడాది) పెరగవచ్చు. ద్రవ్యోల్బణ సర్దుబాటు తర్వాత వాస్తవ వేతన పెరుగుదల 2.6 శాతం ఉండవచ్చు. ఇది ప్రపంచంలోనే అత్యధికం. గత ఏడాది (2.8 శాతం)తో పోల్చితే మాత్రం తక్కువే.
- ఇక చైనాలో వాస్తవ వేతన పెరుగుదల అంచనా 3.2 శాతం, జపాన్‌లో 0.1 శాతం, వియత్నాంలో 4.8 శాతం, సింగపూర్‌లో 3 శాతం, ఇండోనేషియాలో 3.7 శాతంగా ఉండనుంది.
- తూర్పు యూరప్‌లోని ఉద్యోగుల వేతనాల సగటు పెరుగుదల 6.6శాతం ఉండనుంది. ద్రవ్యోల్బణాన్ని పరిగణనలోకి తీసుకుంటే వాస్తవ వేతనపెరుగుదల 2.0శాతం ఉండవచ్చు.
- యూకేలో వాస్తవ వేతన పెరుగుదల 0.6 శాతం ఉండే అవకాశం ఉంది.
- ద్రవ్యోల్బణం పెరుగుతున్న కారణంగా ప్రపంచవ్యాప్తంగా వాస్తవ వేతన పెరుగుదలలో కోత పడుతోంది.





'పెట్రోకెమికల్స్'లోకి అదానీ

బీఏఎస్ఎఫ్ భాగస్వామ్యంతో గుజరాత్‌లో ప్లాంట్.. రూ.16,000 కోట్ల పెట్టుబడి

న్యూఢిల్లీ: గౌతమ్ అదానీ సారథ్యంలోని అదానీ గ్రూప్.. పెట్రోకెమికల్స్ రంగంలోకి ప్రవేశించాలని సంకల్పించింది. ఇందుకోసం జర్మనీకి చెందిన కెమికల్ దిగ్గజం బీఏఎస్ఎఫ్‌తో చేతులు కలిపింది. ఈ రెండు కంపెనీల భాగస్వామ్యంతో గుజరాత్‌లోని ముంద్రా జిల్లాలో ఈ ప్లాంట్‌ను ఏర్పాటు చేయనున్నారు. ఇందుకోసం రూ.16,000 కోట్లు ఖర్చు చేయనున్నట్టు రెండు కంపెనీలు తెలిపాయి. కెమికల్ ప్లాంట్‌లో పెట్టుబడి పెట్టడమేకాకుండా ఈ ప్లాంట్‌కు సమీపంలో ఏర్పాటు చేసే విండ్, సోలార్ పవర్ ప్లాంట్‌లోనూ బీఏఎస్ఎఫ్ పెట్టుబడి పెట్టనుంది. వీటి ద్వారానే ప్లాంట్‌కు విద్యుత్‌ను సరఫరా చేయనున్నారు. ఇక కొత్త వ్యాపారంలో బీఏఎస్ఎఫ్‌కే మెజారిటీ వాటా ఉంటుంది. విద్యుత్ వ్యాపారంలో మాత్రం మైనారిటీ వాటా ఉంటుంది. వైబ్రంట్ గుజరాత్ గ్లోబల్ సమ్మిట్ 2019ను పురస్కరించుకుని బీఏఎస్ఎఫ్ ఎస్ఈ, అదానీ గ్రూప్ మధ్య అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదిరింది. అక్రిలిక్స్ వాల్యూ చెయిన్‌లో భారీ జాయింట్ ఇన్వెస్ట్‌మెంట్‌కు సంబంధించిన మదింపు ఈ ఒప్పందం జరిగినట్టు కంపెనీలు తెలిపాయి. కాగా ఇప్పటి వరకు భారత్‌లో బీఏఎస్ఎఫ్ పెట్టుబడుల్లో ఇదే అతిపెద్ద మొత్తమని పేర్కొన్నాయి. సాధ్యాసాధ్యాలకు సంబంధించిన అధ్యయనాన్ని ఈ ఏడాది చివరి వరకు పూర్తి చేయనున్నట్టు ఎంఓయూలో పేర్కొన్నారు. ఒప్పందంలో భాగంగా రెండు కంపెనీలు 200 కోట్ల యూరో (రూ.16,000 కోట్లు)ల పెట్టుబడులు పెట్టనున్నట్టు అందులో వెల్లడించారు. ఈ పెట్టుబడితో ప్లాంట్ల అభివృద్ధి, నిర్మాణం, ఉత్పత్తి కార్యకలాపాలను ప్రారంభించనున్నారు. ఇందులో ప్రొపేన్ డీహైడ్రోజనేషన్ (పీడీహెచ్), ఆక్సో సీ4 కాంప్లెక్స్, గ్లేసియల్ అక్రిలిక్ యాసిడ్ (జీఏఏ), బ్యుటిల్ అక్రిలేట్ తయారీ ఉత్పత్తులుంటాయి. ఈ ఉత్పత్తులను దేశంలోని నిర్మాణం, ఆటోమోటివ్, కోటింగ్ వంటి స్థానిక పరిశ్రమలకు సరఫరా చేయనున్నారు.

అంబానీకి పోటీ

అహ్మదాబాద్ కేంద్రంగా ఉన్న అదానీ గ్రూప్ దేశంలోనే అతిపెద్ద ఇంటిగ్రేటెడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ దిగ్గజం. కోల్ మైనింగ్, ట్రేడింగ్, లాజిస్టిక్స్ (పోర్టులు, లాజిస్టిక్స్, షిప్పింగ్, రైల్), ఎనర్జీ (రెన్యూవబుల్, థర్మల్ విద్యుదుత్పత్తి, ట్రాన్స్‌మిషన్, డిస్ట్రిబ్యూషన్), ఆగ్రో (కమోడిటీస్, ఎడిబుల్ ఆయిల్, ఫుడ్ ప్రొడక్ట్స్, కోల్డ్ స్టోరేజ్), రియల్ ఎస్టేట్, పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, కన్స్యూమర్ ఫైనాన్స్, డిఫెన్స్ వంటి రంగాలకు విస్తరించింది. తాజాగా పెట్రో కెమికల్స్ వ్యాపారంపై దృష్టిసారించింది. ప్రస్తుతం పెట్రోకెమికల్స్ రంగంలో ముకేష్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇండస్ట్రీస్ హవా సాగుతోంది. ఇప్పుడు అదానీ గ్రూప్ కూడా ఈ రంగంలోకి ప్రవేశించడంతో గుజరాత్‌కు చెందిన వీరిద్దరి కంపెనీల మధ్య గట్టి పోటీ నెలకొననుంది. 1,600 కోట్ల డాలర్ల పెట్టుబడితో గత ఏడాది జనవరిలో పెట్రోకెమికల్ ఉత్పత్తి సామర్థ్యాన్ని ఆర్ఐఎల్ విస్తరించింది. అంబానీ సంస్థ ప్యాకేజింగ్, వ్యవసాయం, ఆటోమోటివ్, హౌజింగ్, హెల్త్‌కేర్ తదితర రంగాలకు సంబంధించిన ఉత్పత్తులను తయారు చేస్తోంది.

మేక్ ఇన్ ఇండియాకు దన్ను: గౌతమ్ అదానీ

"భారత్ భారీ స్థాయిలో పెట్రోకెమికల్స్‌ను విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటోంది. మధ్యతరగతి ప్రజల సంఖ్య వేగంగా పెరుగుతుండటమే ఇందుకు కారణం. ఈ నేపథ్యంలో అధికంగా విదేశీ మారక నిల్వలను వెచ్చించి దిగుమతులు చేసుకోవాల్సి వస్తోంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని బీఏఎస్ఎఫ్ భాగస్వామ్యంతో ముంద్రా వద్ద వివిధ రకాల కెమికల్స్‌ను తయారు చేయాలని నిర్ణయించాం. ఇది మేక్ ఇన్ ఇండియాకు దన్నుగా నిలుస్తుంది. భారత కస్టమర్లకు మెరుగైన ఉత్పత్తులు అందించాలన్న కట్టుబాటుకు అనుగుణంగా భారీ పెట్టుబడులపై నిర్ణయం తీసుకున్నామని బీఏఎస్ఎఫ్ ఎస్ఈ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ల బోర్డు చైర్మన్ మార్టిన్ బ్రూడర్ ముల్లర్ తెలిపారు. అత్యధిక నాణ్యతతో కూడిన తమ ఉత్పత్తుల వల్ల కస్టమర్ల వ్యాపారం మరింత వృద్ధి చెందే అవకాశం ఉంటుందని చెప్పారు. పునరుత్పాదక ఇంధన వనరుల ద్వారా పర్యావరణంపై ప్రభావం చాలా తక్కువ స్థాయిలో ఉంటుందని ఆయన తెలిపారు. ముంద్రా వద్ద ఏర్పాటు చేసే ప్లాంట్ కంపెనీ తొలి సీ2 న్యూట్రల్ ప్రొడక్షన్ సైట్ అన్నారు.

రిలయన్స్ లాభం రూ.10,000 కోట్లు

ప్రైవేటు కంపెనీగా సరికొత్త రికార్డు

త్రైమాసిక ఆదాయంలో 56% వృద్ధి

పెట్రో కెమికల్స్, రిటైల్, టెలికామ్ వ్యాపారాల పనితీరు బాగు



న్యూఢిల్లీ: పెట్రో కెమికల్స్, రిటైల్, టెలికాం విభాగాల అద్భుత పనితీరుతో రిలయన్స్ ఇండస్ట్రీస్ మరో రికార్డు సృష్టించింది. అక్టోబరు-డిసెంబరు త్రైమాసికానికి రూ.10 వేల కోట్ల నికర లాభాన్ని దాటింది. అంతక్రితం ఇదే కాలంతో పోలిస్తే ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికానికి నికర లాభం 8.8 శాతం వృద్ధితో రూ.9,420 కోట్ల నుంచి రూ.10,251 కోట్లకు చేరింది. ఆదాయం ఆకర్షణీయంగా 56 శాతం పెరిగి రూ.1,71,336 కోట్లకు చేరినట్లు కంపెనీ వెల్లడించింది. అనుబంధ సంస్థ జియో అద్భుతమైన వృద్ధిని నమోదు చేయడం, పెట్రో రసాయనాల ఉత్పత్తి రికార్డు స్థాయిలో 97 లక్షల టన్నులకు చేరడం ఆదాయం పెరగడానికి దోహదం చేశాయని పేర్కొంది. దేశానికి, వాటాదారులకు నిలకడగా అధిక విలువ జోడించాలన్న ప్రయత్నమే ఈ అద్భుతమైన మైలురాయిని చేరేందుకు దోహదం చేసిందని రిలయన్స్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ముకేశ్ అంబానీ అన్నారు. అంతర్జాతీయంగా చమురు ధరలు భారీ ఆటుపోట్లకు గురైనప్పటికీ.. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన బలమైన త్రైమాసిక ఫలితాలు ప్రకటించగలిగామన్నారు. వినియోగ వ్యాపారాల వాటా క్రమక్రమంగా పెరుగుతూ స్థూల లాభదాయకత పెరిగేందుకు దోహదపడుతున్నట్టు చెప్పారు.

రూ.2.74 లక్షల కోట్ల రుణభారం

భారీ పెట్టుబడి ప్రణాళికల ప్రభావం వల్ల డిసెంబరు 31వ తేదీ నాటికి కంపెనీపై రూ.2,74,381 కోట్ల రుణభారం ఉన్నట్టు కంపెనీ ప్రకటించింది. ఈ రుణభారం ఈ ఏడాది మార్చి 31 నాటికి రూ.2,18,763 కోట్లు, సెప్టెంబరు 30 నాటికి రూ.2,58,701 కోట్లుగా ఉంది. అయితే చేతిలో ఉన్న నగదు నిల్వ రూ.77,933 కోట్లకు పెరిగింది.

రూ. 10 వేల కోట్ల లాభం మైలురాయిని దాటిన తొలి ప్రైవేటు కంపెనీగా రిలయన్స్ చరిత్ర సృష్టించింది. ఇప్పటివరకు ఈ ఘనత సాధించింది ప్రభుత్వ రంగంలోని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ ఒక్కటే. ఈ సంస్థ 2013 మార్చి త్రైమాసికంలో రూ.14,512.81 కోట్ల లాభాన్ని ఆర్జించి అత్యధిక త్రైమాసిక లాభం ఆర్జించిన కంపెనీగా చరిత్ర నెలకొల్పింది.

> "జియో చందాదారులు 28 కోట్లకు చేరారు. ప్రపంచంలోని అతిపెద్ద మొబైల్ డేటా నెట్‌వర్క్‌లలో ఒకటిగా జియో ఎదుగుతోంది. అత్యున్నత నాణ్యత, భరించగల ధరలతో ప్రతి ఒక్కరినీ, ప్రతీ చోటా, ప్రతి అంశంలోనూ కనెక్ట్ చేయాలన్న మా విజన్‌కు దీటుగానే కంపెనీ పురోగమిస్తోంది.
>
> – ముకేశ్ అంబానీ

విభాగాల వారీగా...

పెట్రోకెమికల్స్‌లో 43 శాతం వృద్ధి

పాలిమర్, ఫైబర్ ఇంటర్మీడియేటరీ ఉత్పత్తులు అధికంగా తయారుకావడంతో కంపెనీ పెట్రో కెమికల్స్ విభాగంలో పన్ను చెల్లింపు ముందు లాభాలు 43 శాతం పెరిగి రూ.8,221 కోట్లకు చేరాయి. పన్ను చెల్లింపు ముందు ఆదాయాలు మాత్రం 18 శాతం క్షీణించి నూ.5,055 కోట్లకే పరిమితం అయ్యాయి.

జియో లాభంలో భారీ వృద్ధి

టెలికాం విభాగం రిలయన్స్ జియో ఆదాయం 12.4 శాతం పెరిగి రూ.10,383 కోట్లకు చేరగా నికర లాభం 65 శాతం పెరిగి రూ.831 కోట్లకు చేరింది. ఒక్కో యూజర్‌పై ఆదాయం గత త్రైమాసికంతో పోల్చితే రూ.131.7 నుంచి రూ.130కి తగ్గింది. జియో డిసెంబరు 31 నాటికి 28 కోట్ల మంది కస్టమర్ల మైలురాయిని చేరింది.

రిటైల్‌దీ అదే దారి

రిలయన్స్ రిటైల్ పన్ను చెల్లింపుల ముందు లాభం రెండింతలు పెరిగి రూ.1,680 కోట్లకు చేరింది. ఆదాయం 89.25 శాతం వృద్ధితో రూ.35,577 కోట్లుగా నమోదయింది.

రూ.70,000 కోట్లు దాటొచ్చు

- **2018-19లో మొబైల్ ఫోన్ విడిభాగాల ఉత్పత్తిపై అంచనా**

న్యూఢిల్లీ: దేశీయంగా మొబైల్ ఫోన్ విడిభాగాల ఉత్పత్తి గణనీయంగా పెరుగుతోంది. ఈ నేపథ్యంలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2018-19)లో మొబైల్ ఫోన్ విడిభాగాల ఉత్పత్తి విలువ రూ.70,000 కోట్లు దాటే అవకాశం ఉందని మొబైల్ ఫోన్ పరిశ్రమ సంఘం ఐసీఈఏ అంచనా వేస్తోంది. 2019-20నాటికి రూ.50,000 కోట్లకు చేరాలన్నది లక్ష్యం. కానీ అంతకన్నా ఒక ఏడాది ముందే లక్ష్యంకన్నా 40 శాతం అధికంగా విడిభాగాల ఉత్పత్తి విలువ పెరుగుతుండటం విశేషం. "2020మార్చినాటికి కాంపోనెంట్ తయారీ లక్ష్యం రూ.50,000 కోట్లుగా ఉంది. అయితే ఇప్పటికే ఈ లక్ష్యాన్ని అధిగమించాం. 2018-19 సంవత్సరంలో రూ.70,000 కోట్లను అధిగమించే అవకాశం ఉంది" అని ఐసీఈఏ చైర్మన్ పంకజ్ మొహింద్రూ తెలిపారు. ఫేజ్డ్ మాన్యుఫ్యాక్చరింగ్ ప్రోగ్రామ్ (పీఎంపీ) కింద స్థానిక మాన్యుఫ్యాక్చరింగ్ కలిపి 2020నాటికి మొబైల్ రంగ లక్ష్యం 50 కోట్ల మొబైల్ ఫోన్లు. ఇందులో 29 కోట్ల ఫోన్లు తయారయ్యాయి. "రూ.1,50,000 కోట్ల కనీస విలువను సాధించాలన్నది లక్ష్యం. అయితే ఇప్పటికే రూ.1,65,000 కోట్లు సాధించాం.

అమెరికా కంపెనీ ఔషధాలు

అరబిందో చేతికి

- **రూ.2,100 కోట్లకు డీల్**
- **7 కేన్సర్ ఇంజెక్షన్ల కొనుగోలు**

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): అమెరికా మార్కెట్లో వ్యాపార విస్తరణలో భాగంగా అరబిందో ఫార్మా అమెరికాకు చెందిన గ్లోబల్ బ్రాండెడ్ ఆంకాలజీ కంపెనీ స్పెక్ట్రమ్ ఫార్మాసూటికల్స్ ఇంక్‌కు చెందిన 7 బ్రాండెడ్ ఆంకాలజీ ఇంజెక్టబుల్ ఉత్పత్తులను కొనుగోలు చేసింది. వీటి ద్వారా అమెరికా బ్రాండెడ్ ఆంకాలజీ మార్కెట్లోకి అరబిందో ప్రవేశించే అవకాశం లభిస్తోంది. 30 కోట్ల డాలర్లకు (దాదాపు రూ.2,100 కోట్లు) ఈ ఇంజెక్షన్లను సొంతం చేసుకుంది. ఈ మేరకు అరబిందో ఫార్మా అనుబంధ కంపెనీ ఆక్రోటెక్ బయోఫార్మా ఎల్ఎల్‌సీ, స్పెక్ట్రమ్ మధ్య ఒప్పందం కుదిరింది. ఒప్పందానికి అనుగుణంగా కంపెనీ ముందస్తుగా నగదు రూపంలో 16 కోట్ల డాలర్లు చెల్లిస్తుంది. మిగతా 14 కోట్ల డాలర్లను రెగ్యులేటరీ అనుమతులు, ఏడు ఉత్పత్తులు సాధించే అమ్మకాలను బట్టి దశల వారీగా చెల్లించనున్నట్లు అరబిందో ఫార్మా తెలిపింది. డెట్ ఫ్రీ, క్యాష్ ఫ్రీ ప్రాతిపదికతన ఈ ఉత్పత్తుల పోర్ట్‌ఫోలియోను ఆక్రోటెక్ హస్తగతం చేసుకుందని అరబిందో ఫార్మా తెలిపింది. కేన్సర్ ఇంజెక్షన్లతోపాటు మేధో సంపత్తి హక్కులు, కమర్షియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను ఆక్రోటెక్‌కు లభిస్తాయి. అరబిందో మేనేజింగ్ డైరెక్టర్ ఎన్ గోవిందరాజన్ మాట్లాడుతూ.. అమెరికా బ్రాండెడ్ మార్కెట్లో తమ ఉనికిని చాటుకునేందుకు తాజా కొనుగోలు దోహదపడుతుందన్నారు.

ఇంజనీర్స్ ఇండియాకు


హైకోర్టులో ఊరట

- **ఏపీ వాణిజ్య పన్నుల శాఖ జారీచేసిన ఉత్తర్వులు రద్దు**

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి): ఇంజనీర్స్ ఇండియా లిమిటెడ్ (ఈఐఎల్)కు హైకోర్టులో ఊరట లభించింది. అంతరాష్ట్ర ఒప్పందం కింద నిర్మిస్తున్న గ్యాస్ టెర్మినల్ ప్రాజెక్టుకు సంబంధించి వ్యాట్ చెల్లించాలని వాణిజ్య పన్నుల శాఖ డిప్యూటీ కమిషనర్ జారీచేసిన ఉత్తర్వులను రద్దు చేసింది. అంతరాష్ట్ర ఒప్పందాలు కొనుగోళ్లకు కేంద్ర సేల్స్ టాక్స్ పరిధిలోకి వస్తాయని స్పష్టం చేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ వి రామసుబ్రమణియన్, జస్టిస్ టి రజనితో కూడిన ఉమ్మడి హైకోర్టులోని ధర్మాసనం గత నెల 31న ఆదేశాలు జారీచేసింది. తూర్పుగోదావరి జిల్లా, మల్లవరం వద్ద గ్యాస్ టెర్మినల్ ప్రాజెక్టు నిర్మాణానికి ఆ సంస్థ.. గుజరాత్ స్టేట్ పెట్రోలియం కార్పోరేషన్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. ప్రాజెక్టు నిర్మాణం కోసం అవసరమైన పరికరాలు దిగుమతి, కొనుగోళ్లు అంతరాష్ట్ర పద్ధతిలో చేసింది. 2011-12, 2012-13 సంవత్సరాల్లో ప్రాజెక్టు నిర్మాణం కోసం చేసిన లావాదేవీలు/కొనుగోళ్లకు సంబందించి ఏపీ వ్యాట్ యాక్టు-2005 కింద పన్నులు చెల్లించాలని వాణిజ్య పన్నులశాఖ షోకాజ్ నోటీసులు ఇచ్చింది. ఈ నోటీసులకు ఇంజనీర్స్ ఇండియా సంస్థ బదులిచ్చింది. ఇంజనీర్స్ ఇండియా సంస్థ ఇచ్చిన వివరణను తిరస్కరించిన వాణిజ్య పన్నుల శాఖ వ్యాట్ చెల్లించాలని ఉత్తర్వులు జారీచేసింది. ఈ ఉత్తర్వులను సవాల్ చేస్తూ ఇంజనీర్స్ ఇండియా సంస్థ హైకోర్టును ఆశ్రయించింది. ఈ వ్యాజ్యాల్లో ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం వాణిజ్య పన్నుల శాఖ అధికారులు జారీచేసిన ఉత్తర్వులు చెల్లవని స్పష్టం చేసింది. అంతరాష్ట్ర ఒప్పందాల కింద చేసిన కొనుగోళ్లు కేంద్ర సేల్స్ టాక్స్ (సీఎస్‌టీ) పరిధిలోకి వస్తాయని స్పష్టం చేస్తూ ఇటీవల ఆదేశాలు జారీ చేసింది.

ఫైబర్ మౌలిక వసతుల్లో పెట్టుబడులు పెరగాలి

ట్రాయ్ చైర్మన్ ఆర్ఎస్ శర్మ



న్యూఢిల్లీ: భారత్ 5జీ టెక్నాలజీలు ప్రవేశపెట్టడంతో అగ్రగామిగా నిలిచే ఆస్కారం ఉన్నప్పటికీ ఫైబర్ ఇన్‌ఫ్రాలో పెట్టుబడులతోనే అది సాధ్యమవుతుందని ట్రాయ్ చైర్మన్ ఆర్ఎస్ శర్మ అన్నారు. భారత టెలికాం రంగంలో కన్సాలిడేషన్ చోటు చేసుకుంటున్నదంటూ రానున్న కాలంలో ఒక ప్రభుత్వ రంగ సంస్థ, మూడు ప్రైవేటు రంగ సంస్థలే బరిలో ఉండవచ్చునని, అంతర్జాతీయంగా కూడా అత్యుత్తమ సంఖ్య ఇదేనని ఆయన తెలిపారు. ఇలా చేయడం వల్ల అది ఆ రంగంలో స్థిరత్వం వస్తుందని ఆయన అన్నారు. భారత ఇంటర్నెట్, మొబైల్ అసోసియేషన్ (ఐఏఎంఏఐ) నిర్వహించిన ఇండియా డిజిటల్ సదస్సులో మాట్లాడుతూ ప్రస్తుతం అందరూ 5జి గురించి పెద్దగా మాట్లాడుతున్నప్పటికీ ఫైబర్ మౌలిక వసతులు లేకుండా అది సాధ్యం కాదని ఆయన తేల్చి చెప్పారు. ప్రస్తుతం దేశంలో 22 శాతం మొబైల్ టవర్లు మాత్రమే ఫైబర్‌తో అనుసంధానం అయి ఉన్నాయని, 78 శాతం ఫైబర్ సదుపాయానికి దూరం వైర్‌లెస్‌గానే ఉన్నాయని, చైనాలో ఇందుకు భిన్నంగా 80 శాతం టవర్లు ఫైబర్ పైనే పని చేస్తున్నాయని ఆయన వివరించారు. ఇప్పటివరకు మన దేశంలో వేసిన ఫైబర్ కేబుల్ నిడివి ఏడాదిలో చైనాలో వేసిన నిడివికి సమానమని ఆయన అన్నారు. ఆ విభాగంలో పెట్టుబడులను ప్రోత్సహించే దిశగా విధానాలు రూపొందాల్సిన అవసరం ఉన్నదని శర్మ సూచించారు. నేషనల్ డిజిటల్ కమ్యూనికేషన్ పాలసీ (ఎన్‌డీసీపీ) ఆ దిశగా సానుకూలమైనదే అయినప్పటికీ అందులో పొందుపరిచిన విధానాలను ఆచరణీయం చేయడం కీలకమని ఆయన చెప్పారు. కొత్త టెలికాం పాలసీ ఎన్‌డీసీపీ 2022 నాటికి డిజిటల్ రంగంలోకి 10 వేల కోట్ల డాలర్ల పెట్టుబడుల సమీకరణ, 40 లక్షల కొత్త ఉద్యోగాల కల్పన లక్ష్యాలుగా నిర్దేశించుకుంది.

బైజూస్ చేతికి ఓస్మో

» డీల్ విలువ రూ.850 కోట్లు

న్యూఢిల్లీ : అమెరికాకు చెందిన ప్లేఫుల్ లెర్నింగ్ సిస్టమ్ సేవలను అందిస్తున్న 'ఓస్మో'ను రూ.850 కోట్లకు కొనుగోలు చేసినట్లు ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ స్టార్టప్ బైజూస్ వెల్లడించింది. అగ్మెంటెడ్ రియల్టీ, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ ద్వారా బొమ్మలను (టాయ్స్) డిజిటల్ రూపంలోకి మార్చి విద్యా సంబంధిత సేవలను ఓస్మో అందిస్తోంది. ఓస్మో కొనుగోలుతో ఫిజికల్ నుంచి డిజిటల్ టెక్నాలజీ విభాగాలలోకి అడుగుపెట్టినట్లయిందని బైజూస్ తెలిపింది. కొనుగోలును పూర్తి చేసినప్పటికీ ఓస్మో సొంతంగానే కార్యకలాపాలు సాగిస్తుందని తెలిపింది. అంతర్జాతీయంగా బైజూస్ కార్యకలాపాలను విస్తరించటంతోపాటు చిన్న పిల్లల కోసం ప్రత్యేకమైన, కస్టమైజ్డ్ సేవలందించే అవకాశం లభిస్తుందని సంస్థ సీఈఓ, బైజూ రవీంద్రన్ తెలిపారు. కాగా ఓస్మో సీఈఓ, కో ఫౌండర్ ప్రమోద్ శర్మ, ఆయన బృందం సారథ్యంలోనే ఓస్మో కార్యకలాపాలు సాగిస్తుందని పేర్కొన్నారు.

హెచ్‌యూఎల్ లాభం రూ.1,444 కోట్లు

ఆటుపోట్లలోనూ నిలకడ వృద్ధి

పెరిగిన మార్జిన్లు

న్యూఢిల్లీ: ఎఫ్ఎంసీజీ దిగ్గజం హిందుస్తాన్ యూనిలీవర్ డిసెంబరు 31వ తేదీతో ముగిసిన మూడో త్రైమాసికంలో అమ్మకాలు, మార్జిన్లలో వృద్ధి కారణంగా రూ.1444 కోట్ల లాభం ఆర్జించింది. గత ఏడాది క్యూ3లో కంపెనీ ఆర్జించిన లాభం రూ.1326 కోట్లతో పోల్చితే ఇది 9 శాతం ఎక్కువ. ఇదే సమయంలో అమ్మకాలు 12.42 శాతం పెరిగి రూ.8,323 కోట్ల నుంచి రూ.9,357 కోట్లకు పెరిగాయి. ఎబిటా మార్జిన్ 17 శాతం పెరిగిందని హెచ్‌యూఎల్ తెలిపింది. దేశీయ వినియోగ విభాగాలలో 13 శాతం వృద్ధి నమోదు కావటంతో మొత్తం అమ్మకాల్లో 10 శాతం వృద్ధి నమోదైనట్లు తెలిపింది. ముడిసరుకు, కరెన్సీ ఆటుపోట్లను సమర్థవంతంగా ఎదుర్కొనే విధానాలు అనుసరించడం, నిర్వహణాపరమైన ప్రయోజనాలను సమర్థవంతంగా ఉపయోగించుకోవటం వల్ల మార్జిన్లు పెరిగినట్లు పేర్కొంది. క్యూ3లో మొత్తం వ్యయాలు రూ.7,652 కోట్లున్నాయి. హోంకేర్ విభాగం నుంచి ఆదాయాలు 14.84 శాతం పెరిగి రూ.3,148 కోట్లకు చేరాయి. సౌందర్యం, వ్యక్తిగత సంరక్షణ విభాగాల్లో ఆదాయం 10 శాతం పెరిగి రూ.4,539 కోట్లకు చేరింది. ప్రధానంగా చర్మ సంరక్షణ, శిరోజాల సంరక్షణ విభాగాలు మంచి వృద్ధిని నమోదు చేశాయి. ఇక ఆహార విభాగాల్లో ఆదాయం 9.92 శాతం పెరిగి రూ.1,728 కోట్లుగా నమోదైంది. మొత్తం మీద మూడో త్రైమాసికంలో తాము బలమైన వృద్ధిని నమోదు చేశామని కంపెనీ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ సంజీవ్ మెహతా అన్నారు. కీలకమైన వ్యాపార విభాగాలు పటిష్ఠం చేసుకోవడంతో పాటు వర్తమాన ధోరణులను అందిపుచ్చుకునే దిశగా సమాంతరంగా చర్యలు తీసుకునే వ్యూహం మంచి ఫలితాన్నిచ్చిందని ఆయన తెలిపారు. సమీప భవిష్యత్తులో డిమాండ్ స్థిరంగా ఉండవచ్చని మెహతా అంచనా వేశారు. నిలకడ వృద్ధి, పోటీసామర్థ్యం, లాభదాయకత, బాధ్యతాయుత ధోరణి వంటి విభాగాలన్నింటిలోనూ తాము నిర్దేశిత వ్యూహాలపై అధికంగా దృష్టి సారించాలని నిర్ణయించుకున్నట్టు ఆయన చెప్పారు.



సైయెంట్ లాభంలో 6 శాతం వృద్ధి

మూడో త్రైమాసికానికి రూ.92 కోట్లు.. ఆదాయం రూ.1,169 కోట్లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ప్రస్తుత ఆర్థిక సంవత్సరం డిసెంబరుతో ముగిసిన మూడో త్రైమాసికానికి ఏకీకృత ప్రాతిపదికన సైయెంట్ రూ.92.5 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. ఏడాది క్రితం ఇదేకాలం నికర లాభం రూ.87.1 కోట్లతో పోల్చితే 6.1 శాతం పెరిగింది. సమీక్ష త్రైమాసికంలో మొత్తం ఆదాయం రూ.1,013 కోట్ల నుంచి రూ.1,169 కోట్లకు చేరిందని కంపెనీ వెల్లడించింది. అంతక్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చితే. 2018, డిసెంబరుతో ముగిసిన తొమ్మిది నెలలకు నికర లాభం రూ.282 కోట్ల నుంచి రూ.301 కోట్లకు చేరగా.. మొత్తం ఆదాయం రూ.2,963 కోట్ల నుంచి రూ.3,510 కోట్లకు పెరిగింది. 2018 డిసెంబరుతో ముగిసిన మూడు నెలల నిర్వహణ మార్జిన్ 14.6 శాతం నుంచి 14.7 శాతానికి స్వల్పంగా పెరిగినప్పటికీ.. పన్ను అనంతర లాభం మార్జిన్ 10.8 శాతం నుంచి 7.9 శాతానికి తగ్గింది. డివిడెండ్ చెల్లింపు తర్వాత కంపెనీ వద్ద రూ.1,230 కోట్ల నగదు, నగదు సమానమైన నిధులు ఉన్నాయి. డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో ఇజ్రాయిల్ కంపెనీ బ్లూబర్డ్ ఏరో సిస్టమ్స్‌తో కలిసి ఏర్పాటు చేసిన సైయెంట్ సొల్యూషన్స్ అండ్ సిస్టమ్స్ కంపెనీ హై ఆల్టిట్యూడ్ ఏరియల్ సర్వైలెన్స్ సిస్టమ్స్‌ను భారత రక్షణ దళానికి అందజేసింది. సాధారణంగా మూడో త్రైమాసిక ఫలితాలు తక్కువగా ఉంటాయని సైయెంట్ ఎండీ, ముఖ్య కార్యనిర్వహణ అధికారి (సీఈఓ) కృష్ణ బోదనపు తెలిపారు. గత 12 త్రైమాసికాల్లోనే అత్యధికంగా నిర్వహణ మార్జిన్ నమోదైందని కంపెనీ సీఎఫ్ఓ, ప్రెసిడెంట్ అజేయ్ అగర్వాల్ తెలిపారు. నాలుగో త్రైమాసికం ఫలితాలు ఆశావహంగా ఉండగలవని, ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ప్రకటించిన వృద్ధి అంచనాలను కంపెనీ చేరుకోగలదని అగర్వాల్ అన్నారు. సమీక్ష త్రైమాసికంలో ఏరోస్పేస్ అండ్ డిఫెన్స్ వ్యాపారంలో 2.9 శాతం వృద్ధి నమోదైంది. నాలుగో త్రైమాసికంలో కూడా ఇది కొనసాగగలదు. స్థిర కరెన్సీలో కమ్యూనికేషన్స్ వ్యాపారంలో 10.9 శాతం వృద్ధి నమోదైంది.

ముగింపు నిలకడ

టెక్ వ్యూ

నిఫ్టీ పాజిటివ్‌గానే ప్రారంభమై నిరోధ స్థాయి 10930 వద్ద రియాక్షన్‌కు గురయింది. చివరిలో మళ్లీ కోలుకుని ఇదే స్థాయిలో రియాక్షన్ ఎదురైనా మద్దతు స్థాయిల కన్నా పైనే నిలవడంతో టెక్నికల్‌గా పాజిటివ్ ట్రెండ్‌లోనే ఉంది. కాని గత రెండు రోజులుగా ఇదే స్థాయిలో విఫలమవుతూ ఉండడం అప్రమత్త ధోరణికి సూచన. మూడో సారి కూడా ఎదుర్కొనబోయే పరీక్షలో తప్పనిసరిగా బలాన్ని ప్రదర్శించాలి. వీక్లీ చార్టులను కూడా పరిశీలించి నిలవడంతో స్పందన శుక్రవారం నాటి ముగింపు అత్యంత కీలకం.

శుక్రవారం స్థాయిలివే...

నిరోధం : 10930 మద్దతు : 10850

- మరింత అప్‌ట్రెండ్ కోసం 10930కన్నా పైన నిలదొక్కుకోవాలి. ప్రధాన నిరోధం 11000. ముందుకు పురోగమించడానికి ఇక్కడ బ్రేకౌట్ అవసరం.
- ఇంట్రాడే మద్దతు స్థాయి 10850 కన్నా దిగువకు వస్తే మరింత కరెక్షన్‌లో పడుతుంది. ప్రధాన మద్దతు స్థాయి 10800. అంతకన్నా దిగువకు వస్తే స్వల్పకాలిక కరెక్షన్ తప్పదు.

■ వి.సుందర్ రాజా

ఆటుపోట్లకు ఆస్కారం

ఆస్ట్రో వ్యూ

తిథి: పుష్య శుక్ల ద్వాదశి
నక్షత్రం: రోహిణి/మృగశిర

పునర్వసు, విశాఖ, పూర్వాభాద్ర, పుష్యమి, అనూరాధ, ఉత్తరాభాద్ర నక్షత్ర జాతకులు, మిథున, తులా రాశుల వారు అప్రమత్తంగా ఉండాలి.

నిఫ్టీ : 10905.20 (+14.90)

ట్రెండ్ మార్పు వేళలు : 12.23

ధోరణి: నిఫ్టీ ఫ్యూచర్ నిన్నటింగా ప్రారంభమై 11 గంటల నుంచి 12.30 మధ్యలో మెరుగైన ట్రేడింగ్‌ను ఆ తర్వాత 2 గంటల వరకు మళ్లీసారి మెరుగైన ట్రేడింగ్ కావచ్చు. ఆ తర్వాత చివరి వరకు మళ్లీసారి మెరుగైన ట్రేడ్యే ఆస్కారం ఉంది.

ట్రేడింగ్ వ్యూహం: నిఫ్టీ ఫ్యూచర్ 9.30 సమయానికి ప్రారంభ స్థాయి/గనుక (ఏటీపీ) కన్నా దిగువన ట్రేడవుతుంటే తగు స్టాప్‌లాస్‌తో షార్ట్ పొజిషన్లు తీసుకుని 11 గంటల సమయానికి క్లోజ్ చేసుకోవాలి. 11 తర్వాత ఏటీపీ కన్నా పైన ట్రేడవుతుంటే లాంగ్ పొజిషన్లు తీసుకుని 12.30 సమయానికి క్లోజ్ చేసుకోవాలి. 2 గంటల తర్వాత ఏటీపీ కన్నా పైన ఉంటే మరోసారి లాంగ్ పొజిషన్లు తీసుకుని 3.30 సమయానికి క్లోజ్ చేసుకోవచ్చు.

నిరోధం : 10945, 10980

మద్దతు స్థాయిలు : 10865, 10830

ఇంట్రాడే ట్రేడింగ్‌కు ప్రారంభ స్థాయి కీలకం. అంత కన్నా దిగువన మాత్రమే షార్ట్ పొజిషన్లు శ్రేయస్కరం.

గమనిక : ఇది ఫ్యూచర్ ఆస్ట్రోటెక్నికల్ అంశాల ఆధారంగా ఇచ్చిన సూచన. మార్కెట్ వాస్తవిక కదలికల ఆధారంగా నిర్ణయాలు తీసుకోవాలి.

■ డా.భువనగిరి అమరనాథశాస్త్రి
www.thefinanciala strologer.blogspot.in

బాండ్ల ద్వారా రూ. 8,800కోట్లు: ఎస్‌బీఐ

న్యూఢిల్లీ: విదేశీ మార్కెట్లలో బాండ్ల జారీ ద్వారా రూ.8,800 కోట్లు (125 కోట్ల డాలర్లు) సమీకరించాలని చూస్తున్నట్లు ఎస్‌బీఐ వెల్లడించింది. సమీకరించిన మొత్తాలను వ్యాపార విస్తరణకు వెచ్చించనున్నట్లు తెలిపింది. రెండు దశల్లో ఫిక్స్‌డ్ రేటు సీనియర్ అన్‌సెక్యూర్డ్ నోట్ల జారీ ద్వారా ఈ మొత్తాలను సమీకరించనున్నట్లు పేర్కొంది. లండన్ శాఖ ద్వారా ఈ బాండ్లను జారీ చేయనున్నట్లు తెలిపింది. వీటిని సింగపూర్ స్టాక్ ఎక్స్ఛేంజ్, గిఫ్ట్ సిటీలోని ఇండియా ఇంటర్నేషనల్ ఎక్స్ఛేంజ్‌లో లిస్ట్ చేయనున్నట్లు వెల్లడించింది.

ఫ్లిప్‌కార్ట్ ఇండియా రూ. 1,431 కోట్ల సమీకరణ

న్యూఢిల్లీ : మాతృ సంస్థ నుంచి రూ.1,431 కోట్లు సమీకరించినట్టు వాల్‌మార్ట్‌కు చెందిన ఈ-కామర్స్ సంస్థ ఫ్లిప్‌కార్ట్ ఇండియా వెల్లడించింది. సింగపూర్ కేంద్రంగా ఉన్న మాతృ సంస్థకు 4.86 లక్షల షేర్లను జారీ చేయటం ద్వారా ఈ మొత్తాలను సేకరించినట్లు కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖకు సమర్పించిన డాక్యుమెంట్లలో పేర్కొంది. ఒక్కో షేరును రూ.29,400కు జారీ చేసినట్లు తెలిపింది. గత ఏడాది డిసెంబరులో ఫ్లిప్‌కార్ట్ ఇండియా.. ఫ్లిప్‌కార్ట్‌లో రూ.2,190 కోట్ల పెట్టుబడులు పెట్టింది. కాగా విదేశీ పెట్టుబడులకు సంబంధించి ఈ-కామర్స్ సంస్థల కోసం కొత్త మార్గదర్శకాలు అమల్లోకి రానున్న తరుణంలో ఫ్లిప్‌కార్ట్ ఈ పెట్టుబడులు పెట్టడం గమనార్హం.

సానుకూల సంకేతాలతో..

పెరిగిన మార్కెట్.. 10900 పాయింట్లు దాటిన నిఫ్టీ

ముంబై: స్టాక్ మార్కెట్లు వరుసగా మూడో రోజూ లాభాల్లోనే ముగిసాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు వెలువడటంతో బీఎస్ఈ సెన్సెక్స్ 53 పాయింట్లు, ఎన్ఎస్ఈ 15 పాయింట్లు లాభంతో క్లోజయ్యాయి. గురువారంనాడు బీఎస్ఈ సెన్సెక్స్ దాదాపు 300 పాయింట్ల ఆటుపోట్లకు గురైనా చివరకు 52.79 పాయింట్ల లాభంతో 36374.08 పాయింట్ల వద్ద స్థిరపడింది. ఎన్ఎస్ఈ కూడా 14.90 పాయింట్ల లాభంతో 10905.20 పాయింట్ల వద్ద క్లోజైంది. నిఫ్టీ మరోసారి 10900 పాయింట్ల మార్కును అధిగమించింది. మధ్యంతర బడ్జెట్, కార్పొరేట్ ఫలితాల వెల్లడితో మార్కెట్లు రోజంతా పాజిటివ్, నెగటివ్ జోన్‌లో సాగుతూ చివరకు లాభాల్లో క్లోజయ్యాయని ఈక్విటీ రీసెర్చ్ ప్రెసిడెంట్ పారస్ బోత్రా తెలిపారు. రూపాయి బలహీనతతో ఐటీ షేర్ల జోరు, రియల్ ఎస్టేట్ స్టాక్స్‌లో సానుకూల ధోరణి కూడా మార్కెట్లకు కలిసివచ్చిందని బోత్రా పేర్కొన్నారు. అయితే అంతర్జాతీయ వాణిజ్య ఉద్రిక్తలు సమీప భవిష్యత్తులో దేశీయ మార్కెట్లపై పడే అవకాశాలు కనిపిస్తున్నాయని, దీంతో ఇండెక్స్‌లు పూర్తిగా ఆటుపోట్లతో సాగాయని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ తెలిపారు.

- లాభపడిన షేర్లలో యాక్సిస్ బ్యాంక్, హెచ్‌సీఎల్ టెక్, ఎం అండ్ ఎం, టీసీఎస్, హెచ్‌డీఎఫ్‌సీ, కోటక్ బ్యాంక్, పవర్ గ్రిడ్, హీరో మోటోకార్ప్, వేదాంత ఉన్నాయి.
- నష్టపోయిన వాటిల్లో సన్ ఫార్మా, యెస్ బ్యాంక్, ఎస్‌బీఐ, బజాజ్ ఫైనాన్స్, టాటా స్టీల్, భారతి ఎయిర్‌టెల్, ఓఎన్‌జీసీ, ఆర్‌ఐఎల్, హెచ్‌యూఎల్ ఉన్నాయి.



కొచ్చిలో ఐఏఏ సదస్సు

» ఫిబ్రవరి 20 నుంచి 3 రోజులు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): అంతర్జాతీయ అడ్వర్టైజింగ్ అసోసియేషన్ (ఐఏఏ) ప్రపంచ కాంగ్రెస్ తొలిసారిగా భారత్‌లో కోచిలో జరుగనుంది. ఫిబ్రవరి 20-22 తేదీల్లో ఈ సమావేశం జరుగుతుందని ఐఏఏ చైర్మన్, వరల్డ్ ప్రెసిడెంట్ శ్రీనివాసన్ స్వామి తెలిపారు. ప్రతి రెండేళ్లకు ఒకసారి జరిగే ఈ సదస్సు ఇప్పటి వరకు 43సార్లు జరిగింది. ఇది 44వ సదస్సు అని స్వామి వివరించారు.

ఢిల్లీ-చండీగఢ్ మార్గంలో భెల్ ఎలక్ట్రిక్ చార్జింగ్ స్టేషన్లు

న్యూఢిల్లీ: ఢిల్లీ-చండీగఢ్ జాతీయ రహదారిలో సౌర విద్యుత్ ఆధారిత ఎలక్ట్రిక్ వాహన చార్జింగ్ (ఎస్ఈవీసీ) స్టేషన్లను ఏర్పాటు చేయనున్నట్లు భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ (భెల్) తెలిపింది. ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహించడం లక్ష్యంగా ప్రతి 25 కిలోమీటర్లకు ఒకటి చొప్పున ఈ మార్గంలో వీటిని నెలకొల్పనున్నట్లు పేర్కొంది. ఈ చార్జింగ్ స్టేషన్ల డిజైన్, ఇంజనీరింగ్, తయారీ, సరఫరా, స్థాపనతోపాటు పర్యవేక్షణ కూడా భెల్ చేపట్టనుంది.

యూకో బ్యాంక్ వెయ్యికోట్ల సమీకరణ

న్యూఢిల్లీ: ప్రైవేట్ ప్లేస్‌మెంట్ ప్రాతిపదికన రూ. 1000 కోట్లు సమీకరించేందుకు బోర్డు అనుమతి లభించిందని యూకో బ్యాంక్ తెలిపింది. క్వాలిఫైడ్ ఇన్‌స్టిట్యూషనల్ ప్లేస్‌మెంట్ (క్యూఐపీ) ద్వారా ఈ మొత్తాలను సమీకరించనున్నట్లు పేర్కొంది. వ్యాపారాభివృద్ధి కోసం వెచ్చించనున్నట్లు బ్యాంక్ తెలిపింది.

బీఎస్‌ఈలో తెలుగు రాష్ట్రాల కంపెనీల షేర్లు

ACI INFOCOM .63(.64)942
ADITYA SPIN. 6.01(6.32)320
AGRO TECH FO 612.3(605.6)32
AISHWARYA TE 3.15(3.15)30006
ALPHAGEO (I) 476.95(478.45)7620
ALU FLUORIDE 122.4(121.85)911
AMAR RAJA BA 781.1(765.15)91097
ANDHRA BANK 28.8(29.1)28111
ANDHRA CEMEN 5.73(5.8)1361
ANDHRA PETRO 68(67.15)51521
ASTRA MICRO 83.55(83.35)7575
AUROB.PHARMA 774.3(787.05)88331
AVANTEL LTD 228.3(230.7)1484
AVANTI FEEDS 378.65(383.15)17703
B.N.RATHI SE 25.8(26)6808
BALAJI AMINE 482.25(483.45)6462
BAMBINO AGRO 188.2(193)89
BARTRONICSIN 7.17(7.21)9550
BCG 2.91(2.85)162535
BHAGIRA.CHEM 432.7(442.4)3126
BHAGYA INL 36.5(36.9)510
BHARATFIN 960.15(964.9)257787
BNR UDYOG 16.96(16.64)5
CAMBRIDGE 46.4(44.1)96
CAT TECHN. .69(.72)317
CCHHL 7.4(7.42)671
CCL PRODUCTS 266.95(264.25)93421
CELESTIAL 7.95(7.9)2128
CIL SECURITS 15.8(15.75)266
COROM INTER 454.35(453.85)1419
CUBEX TUBING 14.55(14.78)690
CYBERMATE 2.09(2.16)23895
CYIENT 627.55(623.15)17151
DANLAW TECH. 92.7(94.55)1184
DECAN CEMENT 400.45(395)183
DHAN ROTO SP 31.35(29.9)183
DIAMONPOWER 1.35(1.42)7467
DIVI'S LAB. 1504.25(1520.75)59472
DIVYA.GRANIT 98.9(94.2)8330
DQ ENT 7.85(7.92)123
DR.REDDY'S 2616.8(2621.85)21395
EMPEE SUGARS 1.49(1.43)5315
EVEREST ORG. 116(116.25)387
FACOR ALLOYS 2.02(1.97)14901
FIRSTOBJ 10.01(10.56)271
GATI LTD. 80.8(81.45)49123
GAYATRI PROJ 180.95(184.15)259707
GENNEX LAB 3.63(3.63)23207
GMR INFRASTR 16.35(16.6)410310
GODAVARI DRU 22.5(22.55)766
GOLDSTONE EN 15.55(15.7)2962
GRANULES (I) 90.05(91.2)24390
GVK POWERINF 7.49(7.57)318259
HBL P SYS 28.75(28.75)4699
HERITGFOOD 531.1(537.2)1822
HIND.FLUROCA 16.35(16.5)3550
IPAPPM 449.4(450.4)2663
IVRCL LTD 1(.99)85115
KAKATIYA CEM 195.5(196.25)1327
KALLAM 18.2(17.8)27543
KAVERI SEED 570.4(573.5)19947
KCP LTD 89.45(89.95)7423
KERNEX MICRO 26.7(28.1)6202
KNR CONST 210.7(216.15)5472
KREBS BIOCHM 125.35(127.5)210
LOKESH MACH 45.4(45.5)2303
LOTUS CHOC 24.2(23.05)5262
MADHUCON PRJ 7.05(6.71)1495
MOLD-TEK TEC 48.2(46.4)6992
MOSCHIP SEMI 24.25(25)8045
MSR INDIA 11.05(11.6)12602
N C L IND. 129.55(129)2610
NACLIND 27.55(27.5)1267
NATCO PHARM 692.65(679.8)1996
NCC 89.55(88.55)481206
NEHA INTER. 3.98(4)2734
NETTLINX LTD 49.7(50.5)2526
NEULAND LAB. 501.75(502.1)867
NIHAR INFO 13.5(14)1335
NILE LTD. 368.15(366.85)1451
NTL 1.32(1.38)1965
OIL COUNTRY 15.3(15.4)1379
OLECTRA 242.05(244.35)21399
PADMALAYA TE 2.38(2.3)473
PALRED 37(36.85)119
PANYAM CEMEN 13.68(13.59)555
PENNAR STEEL 37.65(37.9)64503
PFL INFOTECH 8.49(8.49)7
PHYTOCHEM I. 44.8(46.15)1006
PITTIENG 66.65(64.85)11115
POKARNA LTD 188.8(182.95)25157
PRAJAY ENGS. 8.43(8.55)5869
PREMIER EXPL 236.6(237.25)2050
PRSMJOHNSN 84.6(85.4)14182
RAIN 121.85(123.45)172158
REG.CERAMIC 4.52(4.55)1001
RESTILE CER. 4.05(3.98)8193
SAGAR CEM. 648.9(655.2)338
SAMKRG PIST. 191.7(194.65)1073
SANGHI IND. 57.9(60.75)11905
SATVAH ISPAT 9.2(9.3)1086
SAVEN TECHNO 25.4(26.7)15848
SMPL 41(41)28834
SMS PHARMACE 79(75.4)15649
SREE RAYALA 159.45(157.4)364
STEEL EXCH 13.15(13.7)4930
SURYACHAKRA .3(.31)14185
SURYAMBA SP 68.65(68.6)353
SURYLAK.COTT 43.15(42.05)2096
SUVEN LIFE S 218.7(219.55)24050
TAJ GVK HOTL 179.45(180.05)187
TANLA 30.15(30.25)2525
TRANSCORP IN 24.2(23.05)4915
TRANSGENE BI 5.17(4.93)95721
TRANSPORT CO 292.2(294.5)1605
VICEROY HOTE 4.45(4.55)15078
VIJAY TEXTIL 42.5(41.2)217
VIMTA LABS 285.15(291.1)3750
VIRAT CRANE 33(33.15)580
VIRINCHI 80(81.15)7700
VISAKA IND. 429.15(429.75)1198
VISTA PHARMA 28.4(28.7)5238
VIVIMED LABS 33.1(33.7)29562
VST INDUS. 3221.95(3269.2)66
WATERBASE 159.9(160.6)22892
XLENERGY 1.03(1.08)12850
ZEN TECH 80.95(81)7441
ZENOTECH 31.95(34.95)24107

ఎన్ఎస్ఈ-500

షేర్ల ప్రస్తుత, క్రితం ముగింపు ధరలు, వాణిజ్య పరిమాణం వరుసగా

AARTIDRUGS 608.4(599.45)11848
AARTIIND 1525.9(1546)30252
ABAN 73.9(74.7)423126
ABB 1286.7(1287.45)44053
ABFRL 202.25(201.2)682898
ABGSHIP 1.9(1.9)12309
ACC 1455.15(1473.95)467164
ADANIENT 149(148.45)2618859
ADANIPORTS 394.5(389.3)4156932
ADANIPOWER 50.85(49.8)10398155
ADANITRANS 220.35(226.4)103778
AEGISCHEM 206.3(210.05)56753
AHLUCONT 315(320.65)9118
AIAENG 1644.95(1637.9)9036
AJANTPHARM 1151.55(1138.8)318987
AKZOINDIA 1730.8(1751.8)1523
ALBK 44.45(44.45)2810926
ALLCARGO 110.95(110.45)60529
ALOKTEXT 3.65(3.65)821304
AMARAJABAT 785.2(767.1)1270322
AMBUJACEM 215.25(216.85)934332
ANANTRAJ 34.7(35.2)348987
ANDHRABANK 28.75(29.2)669108
APARINDS 620.9(635.3)2585
APLLTD 591.4(596.35)113613
APOLLOHOSP 1352.95(1347.6)420061
APOLLOTYRE 218.4(218.85)2694921
ARVIND 94.45(96.4)1310234
ASHIANA 117.9(115.6)24451
ASHOKA 135(130.75)310264
ASHOKLEY 93.25(93.95)8949001
ASIANPAINT 1389.6(1389.75)853829
ASTRAL 1111.9(1133.65)61400
ASTRAZEN 1624.25(1652.75)4229
ATUL 3490.8(3466.35)2482
AUROPHARMA 775(788.3)1308601
AXISBANK 676.65(664)10448209
BAJAJ-AUTO 2729.65(2717.45)230784
BAJAJCON 385.7(388.65)223230
BAJAJELEC 470.45(479.7)156500
BAJAJFINSV 6359(6464.85)139043
BAJAJHIND 9.15(9.3)1747821
BAJAJHLDNG 2950.05(2958.45)61769
BALKRISIND 873.15(867.6)483139
BALLARPUR 4.6(4.9)1879703
BALMLAWRIE 199.2(200)21504
BALRAMCHIN 110.55(112.85)1746980
BANKBARODA 119.2(121)9553120
BANKINDIA 104.35(105.3)5644751
BASF 1513.05(1547.4)12300
BATAINDIA 1152.25(1165.05)555003
BBTC 1251.35(1274.7)61966
BEML 895.1(914)1766580
BERGEPAINT 324.75(322.9)451921
BFUTILITIE 225.8(222.45)639024
BGRENERGY 59.9(60.4)71687
BHARATFIN 962.65(966.7)259963
BHARATFORG 489.2(489.75)780731
BHARTIARTL 332.05(333.95)4118364
BHEL 70.15(68.35)9573414
BIOCON 657.65(650.7)1100775
BIRLACORPN 556.25(565.85)23332
BLISSGVS 165.75(163.15)744102
BLUEDART 3336.7(3285.4)3114
BLUESTARCO 608.35(612.25)6386
BOMDYEING 123.75(127.7)1300711
BOSCHLTD 19150.55(19089.4)7450
BPCL 355.2(347.25)3949498
BRFL 9.05(9.05)55569
BRIGADE 214.6(208.65)1381777
CADILAHC 355.85(352.55)1053793
CANBK 275.45(275.35)3578928
CARERATING 999.75(998)73274
CASTEXTECH 1.15(1.15)176858
CASTROLIND 166.45(165.55)1608356
CCL 264.5(265.05)5797
CEATLTD 1232.8(1231)288338
CENTRALBK 35.45(35.65)217570
CENTURYPLY 184.8(182.9)146986
CENTURYTEX 893.95(902.2)395449
CERA 2611.05(2622.35)1932
CESC 686.15(703.95)710514
CHAMBLFERT 168.25(163.55)336636
CHENNPETRO 266.2(263.25)340110
CHOLAFIN 1196.2(1192)206870
CIPLA 509.6(511.5)1598184
CLNINDIA 405.45(411.85)8191
COALINDIA 232.05(232.05)3220136
COLPAL 1326.6(1330.75)246007
COROMANDEL 453.5(455)71598
CORPBANK 28.45(28.55)147060
COX&KINGS 169.5(174.7)27914
CRISIL 1654.6(1647.8)38109
CUB 189.6(186.05)460685
CUMMINSIND 841.75(841.7)758174
CYIENT 629.45(623.7)281860
DABUR 420.3(423.85)2118185
DBCORP 177.2(181)29145
DBREALTY 27.45(27.9)113483
DCBBANK 186.3(181.35)6999112
DCMSHRIRAM 350.2(359.55)29000
DEEPAKFERT 138.1(140.65)184237
DELTACORP 251.3(254.25)538554
DEN 69.95(70.05)237140
DENABANK 13.55(13.55)826040
DHANUKA 417.2(422.65)4579
DHFL 219.8(223.1)4421460
DISHTV 34.9(36.2)6492355
DIVISLAB 1505.35(1519.8)927211
DLF 184.2(182.95)4558933
DREDGECORP 436.65(445.55)167945
DRREDDY 2619.15(2616.95)649802
DYNAMATECH 1495.3(1473)291
ECLERX 1094.5(1101.65)5425
EDELWEISS 168(173.15)1083027
EICHERMOT 20369.95(20735.7)103777
EIDPARRY 222.4(224.65)39409
EIHOTEL 182.1(181.6)34600
ELECTCAST 21.4(21.35)67909
ELGIEQUIP 265.1(261.75)14135
EMAMILTD 437.55(435.85)94021
ENGINERSIN 118.35(122.4)2852535
EROSMEDIA 82.15(83)368850
ESCORTS 733.8(737.7)1195025
ESSDEE 18.25(18.6)19055
ESSELPACK 110.3(109.85)36016
EVEREADY 222.55(224.9)368389
EXIDEIND 250.55(252.65)1433616
FCONSUMER 42.8(43.45)617360
FDC 171.95(171.95)30001
FEDERALBNK 88.5(91.2)52214012
FINCABLES 447.95(449.6)18934
FINPIPE 559.4(557.4)33298
FLFL 390.35(392.4)121805
FORTIS 136.55(137.9)1022473
FSL 50.35(52.5)2579282
GAIL 332.4(325.5)4290595
GATI 80.95(81.35)277971
GDL 113.85(117.05)109577
GEPIL 815.85(818.05)2408
GESHIP 308.55(305.05)86392
GET&D 321.2(314.55)142724
GILLETTE 6499.7(6499.5)1882
GLAXO 1437.9(1440.5)14037
GLENMARK 661.5(655.95)599607
GLOBOFFS 13.35(13.8)10809
GMDCLTD 86.05(86.1)38291
GMRINFRA 16.35(16.55)6546972
GODFRYPHLP 964.6(964.5)596318
GODREJCP 793.3(774.95)875985
GODREJIND 527.85(529)244222
GODREJPROP 759.95(736.5)341351
GPPL 93.75(95.95)138236
GRANULES 90.2(91.3)526781
GREAVESCOT 123.3(124.1)242603
GREENPLY 141.1(139.85)39674
GRINDWELL 555.4(565.4)7190
GRUH 237.9(236.9)1036864
GSFC 111.05(111.65)416149
GSKCONS 7288.6(7440.05)86652
GSPL 177.75(177.9)249543
GUJFLUORO 942.2(935.45)25385
GULFOILLUB 894.85(851.15)212686
GVKPIL 7.5(7.55)629948
HATHWAY 31.25(30.9)246526
HAVELLS 676.15(683.45)969498
HCC 13.1(13.15)3057907
HCL-INSYS 24.45(24.6)561135
HCLTECH 954.7(938.25)1845117
HDFC 2004.55(1975)2773741
HDFCBANK 2132.3(2120.2)2060057
HDIL 27.55(28.25)4212746
HEIDELBERG 152(151.65)38710
HEROMOTOCO 2903.6(2879.85)515341
HEXAWARE 324.85(323.45)1500383
HFCL 23.6(23.95)2370154
HIMATSEIDE 210.4(211.8)25373
HINDALCO 206(208.4)6537377
HINDCOPPER 49.85(50.1)257293
HINDPETRO 244.2(240.6)4239731
HINDUNILVR 1751.5(1772.55)1941204
HINDZINC 271.75(272.6)571873
HMT 19.25(20)7354
HMVL 122.9(124.15)16858
HONAUT 21937.05(21819.55)2644
HOTELEELA 15.25(15.5)552070
HSIL 242.5(257.6)516336
HTMEDIA 44.85(47.2)367379
IBREALEST 85.75(85.9)1712086
IBULHSGFIN 816.75(829.6)6405691
ICICIBANK 374.6(375.3)13171721
ICRA 3187(3189.45)531
IDBI 60.7(61.95)2825033
IDEA 36.95(36.4)14915441
IDFC 43.6(43.75)2515030
IFBIND 918.85(924.95)8740
IFCI 14.85(15.05)4202533
IGARASHI 535.15(532.4)17556
IIFL 461.85(473.85)47579
IL&FSTRANS 10.8(10.55)710279
INDHOTEL 137.35(139.8)1458260
INDIACEM 86.1(87.8)3950203
INDIANB 260.15(257.05)1252757
INDOCO 216.4(223.55)35557
INDUSINDBK 1523(1526.7)1467807
INEOSSTYRO 685.2(697.7)8342
INFRATEL 280.45(275.85)3729858
INFY 733.35(736.8)6903771
INGERRAND 583.65(580.8)8666
INOXLEISUR 246.05(245.25)153101
INOXWIND 73.5(73.65)60395
INTELLECT 219.4(217.45)346718
IOB 14.4(14.55)245919
IOC 137.65(135.8)11644105
IPAPPM 449.1(451.8)14904
IPCALAB 787.95(788.8)174576
IRB 155(155.55)805492
ITC 293.95(294.05)10601100
J&KBANK 38.55(39.15)3051189
JAGRAN 110.3(111.85)96602
JAICORPLTD 112.1(113.45)799485
JBCHEPHARM 315.65(319.3)9141
JBFIND 21.1(20.85)37508
JCHAC 1809(1844.35)1206
JETAIRWAYS 285.3(269.7)60386854
JINDALPOLY 244.95(245.25)16742
JINDALSTEL 146.05(146.65)7752732
JISLJALEQS 65.25(66.45)2717221
JKCEMENT 716.9(733.15)17440
JKIL 127.6(128.85)111197
JKLAKSHMI 301.75(306.4)28391
JKTYRE 101.1(101.5)197958
JMFINANCIL 87.65(89.6)174631
JPASSOCIAT 7.25(7.35)7043976
JPINFRATEC 3.55(3.55)864224
JPPOWER 1.95(1.95)981197
JSWENERGY 68.8(69.8)424716
JSWHL 2588.1(2602.8)1334
JUBILANT 703.65(711.55)145736
JUBLFOOD 1212.3(1214.75)1845442
JUSTDIAL 477.35(496.8)2164778
JYOTHYLAB 196.05(197.45)72203
KALPATPOWR 375.3(374.3)46297
KANSAINER 449.65(456.75)59001
KEC 274.85(274.25)80793
KESORAMIND 82.05(83.7)138156
KIRLOSENG 195.1(194.4)12099
KITEX 108.9(109.05)25805
KOLTEPATIL 266.6(260.15)442916
KOTAKBANK 1219.95(1202.75)3934500
KPIT 213.55(216.2)4655177
KRBL 339.1(337.05)537043
KSCL 572(570.6)142379
KSK 1.4(1.45)254820
KTKBANK 120.95(119.2)2020824
KWALITY 7.85(7.95)1172018
L&TFH 141.3(141.85)7492429
LAKSHVILAS 74.8(76.55)333923
LAOPALA 219.95(219.95)16861
LAXMIMACH 5679.8(5674.6)1092
LICHSGFIN 490.7(481.85)2038083
LT 1346.05(1342.15)1610419
LUPIN 868.75(863.2)1995674
M&M 734.65(726.25)3318440
M&MFIN 447.75(446.9)1680253
MAGMA 105.55(107.65)44352
MAHINDCIE 231.75(232.85)46718
MAHLIFE 392.9(384.45)21169
MANAPPURAM 99.6(97.7)3296108
MANPASAND 83.9(85.15)149951
MARICO 380.2(380.4)986391
MARKSANS 27.95(27.95)1135445
MARUTI 7336.25(7310.25)462725
MAYURUNIQ 394.1(395.35)2983
MCLEODRUSS 110.6(111)106673
MERCK 3182.65(3203.35)5556
MHRIL 215.9(215)293377
MINDACORP 154.85(150.7)148928
MINDTREE 867.85(841.2)10222282
MMTC 28.85(29.15)462998
MOIL 164.6(165.55)65667
MONSANTO 2561.6(2561.4)2423
MOTHERSUMI 159.6(162.3)3141731
MOTILALOFS 681.8(682.45)452495
MPHASIS 900.7(863.2)537130
MRF 65802.8(65991.2)3530
MRPL 70.35(70.85)678311
MTNL 14.95(15.6)1263659
MUTHOOTFIN 533.4(537.15)688271
NATCOPHARM 689.6(680)85930
NATIONALUM 61.8(61.65)1640045
NAUKRI 1622.85(1677.35)170950
NAVKARCORP 50.8(51.35)76303
NCC 89.7(88.4)7752038
NETWORK18 39.55(40.45)227030
NHPC 25.55(25.85)1356978
NIITTECH 1222.15(1209.6)963321
NITINFIRE 1.75(1.8)43177
NLCINDIA 67.75(67.9)288649
NMDC 91.85(93.3)6755057
NTPC 144.9(146.35)6274305
OBEROIRLTY 460.25(453.75)620582
OFSS 3694.4(3682.75)23553
OIL 172.75(173.55)862255
OMAXE 213.7(214)241670
ONGC 145(146.35)5142302
ORIENTBANK 96.8(97.85)3385324
ORIENTCEM 76.8(77.15)9407
ORISSAMINE 895.6(894.6)4842
PAGEIND 23265.75(23361.2)32601
PARSVNATH 7.25(7.15)101882
PCJEWELLER 79.7(80.45)6155851
PEL 2387.9(2372.15)367656
PERSISTENT 549.9(551.75)156763
PETRONET 221.95(220.5)3428274
PFC 107(107.05)10302573
PFIZER 2685(2722.5)29250
PFS 17.4(17.3)288993
PGHH 9996.95(9896.85)1549
PHOENIXLTD 564.65(574.3)45471
PIDILITIND 1151.55(1154)323531
PIIND 855.75(835.1)74633
PNB 84.55(84.25)22181000
POWERGRID 193.9(192)2995612
PRAJIND 142.5(153.95)9213223
PRESTIGE 215.25(220.35)372823
PRSMJOHNSN 84.45(85.2)98692
PTC 89.45(90.4)1086582
PUNJLLOYD 4.2(4.4)4031912
PURVA 79.55(78.6)165949
PVR 1634.1(1646.65)224438
RADICO 413.25(414.95)155250
RAIN 121.65(123.65)1121450
RAJESHEXPO 593.6(590.5)1081041
RALLIS 173.5(171.2)460887
RAMCOCEM 627.1(633.9)955867
RAMCOSYS 263.05(264.35)5528
RATNAMANI 920.45(919.35)1785
RAYMOND 809.45(815.85)883406
RCF 64.9(65.65)801016
RCOM 13.55(13.8)70098847
RECLTD 128.35(125.45)11252224
REDINGTON 80.75(80.9)227239
RELAXO 739.75(748.8)9981
RELCAPITAL 217.65(224.3)4266422
RELIANCE 1134.45(1135.9)7487963
RELINFRA 296.45(314.2)5825105
RENUKA 11.1(11.2)369523
REPCOHOME 445.15(439.95)653147
RIIL 336.65(338.45)210166
RKFORGE 510.95(514.95)5448
RNAVAL 13.25(13.4)571158
ROLTA 8.15(8.25)1357872
RPOWER 29.35(30.25)4845520
RTNPOWER 3.7(3.55)1678051
RUCHISOYA 7.9(8.1)813917
SADBHAV 215.75(214.1)44610
SADBHIN 94.4(94.9)9198
SAIL 49.9(50.4)13023795
SANOFI 6388.25(6383.35)10102
SBIN 297.4(303.15)15974634
SCHAEFFLER 5604.75(5676.05)497
SCHNEIDER 97.1(97.65)19124
SCI 45.15(45.9)182854
SHARDACROP 309.5(308.4)5944
SHILPAMED 397.6(396.15)7329
SHK 181.3(178.8)518868
SHOPERSTOP 508.35(522.6)44560
SHREECEM 15914.7(15822.95)16720
SHRIRAMCIT 1738.3(1731.85)4962
SIEMENS 1064.8(1060.55)499832
SIMPLEXINF 187.8(190.95)12646
SINTEX 11.35(11.4)1094079
SITINET 9.95(10.35)37873
SJVN 25.75(25.65)722620
SKFINDIA 1930.65(1937.9)11702
SMLISUZU 633.1(633.8)4067
SNOWMAN 34.5(34.7)90442
SOBHA 503.9(461.35)1415288
SOMANYCERA 367.15(361.55)44823
SONATSOFTW 312.4(306.9)1169379
SOUTHBANK 15.7(15.9)18136437
SPARC 171.7(178.5)723118
SREINFRA 33.45(33.65)2227970
SRF 2050.9(2041.2)238825
SRTRANSFIN 1149.5(1188.2)2060773
STAR 528.4(525.25)1131121
STCINDIA 130.4(132.45)65321
SUNDARMFIN 1458.5(1455.2)9679
SUNDRMFAST 534.95(534.05)191198
SUNPHARMA 426.55(453.8)8343750
SUNTV 564.95(573.45)1087914
SUPREMEIND 1080(1100.55)28821
SUVEN 218.35(218.6)241846
SUZLON 5.3(5.3)19148504
SWANENERGY 99(98.65)264450
SYMPHONY 1151.55(1146.75)7228
SYNDIBANK 39.55(39.8)2084653
SYNGENE 562.25(541.95)90168
TAKE 151.9(153.05)43824
TATACHEM 693.1(694.9)206158
TATACOFFEE 98.7(99.5)141806
TATACOMM 531.15(531.2)425034
TATAELXSI 968.4(970.5)478499
TATAGLOBAL 218.15(216.45)1267904
TATAMOTORS 184.9(185.45)9365756
TATAMTRDVR 98.15(98.75)1380127
TATAPOWER 76(76.5)4496763
TATASPONGE 779(785.85)73344
TATASTEEL 473.15(474.55)4281935
TATASTLBSL 36.15(36.55)350014
TBZ 63.6(62.65)74986
TCS 1894.3(1870.15)2625816
TECHM 705.55(699.9)1434040
TEXRAIL 59.95(59.65)482875
THERMAX 1079.25(1095.9)33733
THOMASCOOK 232.9(232.2)92849
TIDEWATER 5307.8(5356.8)886
TIMKEN 576.2(579)22920
TITAN 961.55(961.2)1303576
TNPL 239.25(235)27430
TORNTPHARM 1886(1946.95)381301
TORNTPOWER 261.6(263.3)923753
TREEHOUSE 4.45(4.55)17527
TRIDENT 70.8(70.7)935269
TRITURBINE 113.35(114.5)15216
TTKPRESTIG 7571.05(7522.65)1503
TTML 3.85(3.85)371250
TV18BRDCST 36(38.05)10759877
TVSMOTOR 547.15(548.9)726877
TVSSRICHAK 2402.6(2419.95)6499
TVTODAY 372.8(376.65)7709
UBL 1410.55(1416.65)240642
UCOBANK 20.55(20.6)406907
UFLEX 269(271.15)37532
ULTRACEMCO 3846.45(3887)235993
UNICHEMLAB 213.7(209.25)325934
UNIONBANK 94.85(96.2)8840714
UNITECH 1.95(1.95)1625313
UPL 769.05(766.1)1442884
VAIBHAVGBL 709.6(707.3)2432
VAKRANGEE 48.1(45.85)5815427
VEDL 197.45(196.3)6591718
VIDEOIND 3.05(3.05)97769
VIJAYABANK 47.45(48)669396
VINATIORGA 1597.55(1568.15)11084
VIPIND 518.4(512.05)440790
VOLTAS 534.65(533.3)509792
VRLLOG 289.95(288.75)42908
VSTIND 3240.25(3265.6)768
VTL 1078.7(1104.55)5208
WABAG 309(306.65)289971
WABCOINDIA 6446.85(6407.35)2272
WELCORP 124.05(128.45)576096
WELSPUNIND 61.05(61.5)448510
WHIRLPOOL 1462.75(1459.6)67409
WIPRO 335.4(336.55)5289184
WOCKPHARMA 501.3(510.45)846304
WONDERLA 275.7(273.75)64414
ZEEL 440.9(452.1)8620833
ZEELEARN 35.5(36)86533
ZYDUSWELL 1342.5(1351.6)2402

బులియన్



బంగారం (10 గ్రాములు)	హైదరాబాద్	విజయవాడ	విశాఖపట్నం	ప్రొద్దుటూరు	చెన్నై
24 క్యారెట్లు	33,580	---	33,490	32,800	32,580
క్రితం ముగింపు	33,390	---	33,470	---	32,490
22 క్యారెట్లు	31,090	---	30,810	30,390	31,110
క్రితం ముగింపు	30,910	---	30,790	---	31,020
వెండి (కిలో)	40,500	---	40,300	40,050	42,900
క్రితం ముగింపు	40,400	---	40,500	---	42,900

రిటైల్ (ఒక గుడ్డు) ధర రూ. 4.80 — నెక్ (100 గుడ్లు)



హైదరాబాద్	418	చిత్తూరు	443
వరంగల్	420	చెన్నై	450
విజయవాడ	435	నమక్కల్	435
గోదావరి	435	బెంగళూరు	445
విశాఖపట్నం	435	ముంబై	468

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	87	విజయవాడ	89
కరీంనగర్	88	గుంటూరు	90
వరంగల్	87	ఒంగోలు	91
మహబూబ్‌నగర్	87	చిత్తూరు	91
కర్నూలు	87	నెల్లూరు	91
విశాఖపట్నం	86	అనంతపురం	83
గోదావరి	86		

సైకిలెక్కిన అహ్మదుల్లా

అమరావతి/కడప, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ సీనియర్ నేత, కడప జిల్లాకు చెందిన మాజీ మంత్రి అహ్మదుల్లా, ఆయన కుమారుడు అష్రఫ్, పలువురు ముస్లిం నేతలు తెలుగుదేశం పార్టీలో చేరారు. గురువారం రాత్రి ఉండవల్లి ప్రజావేదికలో సీఎం చంద్రబాబు వారికి పసుపు కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. చిత్తూరు జిల్లా సత్యవేడు నాయకుడు రాజశేఖర్ కూడా తన అనుచరులతో కలిసి టీడీపీలో చేరారు. చంద్రబాబు పాలనాదక్షుడని, ఆయన చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితులమై పార్టీలో చేరామని అహ్మదుల్లా, రాజశేఖర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కడప జిల్లా ఇన్‌చార్జి మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు సీఎం రమేశ్, జిల్లా టీడీపీ అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, మాజీ ఎమ్మెల్యే వరదరాజులురెడ్డి, ఎమ్మెల్సీలు టీడీ జనార్దన్, బీటెక్ రవి, రాష్ట్ర కార్యాలయ కార్యదర్శి ఏవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్‌కి అత్యంత ఆప్తుడు: కడప జిల్లా రాజకీయాల్లో హాజీ మహమ్మద్ అహ్మదుల్లాకు ఓ గుర్తింపు ఉంది. తండ్రి రహంతుల్లాకు వారసుడిగా రాజకీయ ప్రవేశం చేసిన ఆయన వైఎస్ రాజశేఖరరెడ్డికి అత్యంత సన్నిహితుడిగా మెలిగారు. కడప మున్సిపల్ చైర్మన్‌గా ఒకసారి, రెండుసార్లు ఎమ్మెల్యేగా, వైఎస్, రోశయ్య, కిరణ్ కేబినెట్‌లలో మైనారిటీ సంక్షేమం, చక్కెర మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. 2014 సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేయకున్నా కాంగ్రెస్‌లోనే కొనసాగుతూ వచ్చారు. ఆయన తండ్రి మహమ్మద్ రహంతుల్లా.. నాటి జలగం వెంగళరావు, నీలం సంజీవరెడ్డి వంటి ఉద్దండులతో కలిసి పనిచేశారు. కడప ఎమ్మెల్యేగా, రాజ్యసభ సభ్యుడిగా, పీసీసీ అధ్యక్షుడిగా పనిచేశారు. రహంతుల్లా కూడా వైఎస్ కుటుంబంతో ఎంతో సన్నిహితంగా మెలగుతూ మైనింగ్ వ్యాపారాలు సైతం వారితో కలిసి చేసేవారు. ఆయన మరణానంతరం అహ్మదుల్లా రాజకీయ ప్రవేశం చేశారు. 2000లో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో కడప మున్సిపల్ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. వైఎస్‌తో సాన్నిహిత్యం కారణంగా 2004 ఎన్నికల్లో కడప అసెంబ్లీ టికెట్ లభించింది. ఆయన గెలుపొందారు. 2009లో కూడా ఎమ్మెల్యేగా విజయం సాధించారు. అప్పుడే వైఎస్ కేబినెట్‌లో మైనారిటీ సంక్షేమ మంత్రి అయ్యారు. రోశయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డి మంత్రివర్గాల్లోనూ 2014 వరకు కొనసాగారు. 1996లో కడప లోక్‌సభ నుంచి పోటీ చేసిన వైఎస్ రాజశేఖరరెడ్డి ఐదు వేల ఓట్ల స్వల్ప మెజారిటీతో గట్టెక్కడం వెనుక అహ్మదుల్లా నేర్పు, చాతుర్యం ఉన్నాయని ఇప్పటికీ చెప్పుకొంటుంటారు. వైఎస్ తనయుడు జగన్ సొంత పార్టీ పెట్టినా అహ్మదుల్లా చేరలేదు.

27న 'జయహో బీసీ' సభ: టీడీపీ

రాజమహేంద్రవరం, జనవరి 17(ఆంధ్రజ్యోతి): టీడీపీ ఆధ్వర్యంలో ఈ నెల 27న రాజమహేంద్రవరం ఆర్ట్స్ కాలేజీ గ్రౌండ్‌లో 'జయహో బీసీ' బహిరంగ సభ నిర్వహిస్తామని రాష్ట్ర టీడీపీ అధ్యక్షుడు, విద్యుత్‌శాఖ మంత్రి కళా వెంకట్రావు చెప్పారు. కనీసం 3లక్షలకుపైగా బీసీలు హాజరవుతారని ఇప్పటికే అంచనా ఉందని, అయితే అంతకుమించి రావచ్చునని అన్నారు. ఆ రోజు దూర ప్రాంతాల నుంచి వచ్చేవారికి భోజన, వసతి సౌకర్యాలు కల్పిస్తామన్నారు. ఇప్పటికే 32 సమాయత్త సభలు పెట్టామని, ఉభయ గోదావరి జిల్లాలకు కేంద్రమైన రాజమహేంద్రవరానికి అత్యధికంగా జనం తరలి వస్తారన్నారు. రాజమహేంద్రవరం ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో గురువారం సాయంత్రం టీడీపీ జిల్లా సమన్వయ కమిటీ సమావేశం ముగిశాక చినరాజప్పతో కలిసి వెంకట్రావు మీడియాతో మాట్లాడారు. 1994 ఎన్నికల ముందు ఎన్టీ రామారావు రాజమహేంద్రవరం నుంచే ఎన్నికల శంఖారావం పూరించారని, ఇవాళ మళ్లీ బీసీ సభతో బాబు శంఖం పూరిస్తారని రాజప్ప తెలిపారు.

రాయలసీమపై బాబు నిర్లక్ష్యం: కన్నా

వేంపల్లె, కడప మారుతీనగర్: "చంద్రబాబు రాయలసీమ వాసి అయినప్పటికి సీమ అభివృద్ధిపై నిర్లక్ష్య వైఖరి అలవంబిస్తున్నారు. జరగాల్సిన అభివృద్ధిని అడ్డుకుంటున్నారు. కేంద్రం ఆధ్వర్యంలో కడపలో స్టీల్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలని మెకాన్ ఆధ్వర్యంలో టాస్క్‌ఫోర్స్ ఏర్పాటుచేస్తే... ఆ సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి సరైన సమాచారం ఇవ్వకుండా సీఎం అడ్డుపడ్డారు" అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. "అధికార వికేంద్రీకరణ జరగాలంటే రాజధాని, హైకోర్టు వేర్వేరు ప్రాంతాల్లో ఉండాలని బీజేపీ భావిస్తోంది. రాయలసీమలో హైకోర్టు ఏర్పాటుచేయాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నప్పటికి చంద్రబాబు పట్టించుకోలేదు' అని కన్నా విమర్శించారు. 'బీజేపీ, కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయంగా తెలంగాణ సీఎం కేసీఆర్ ప్రతిపాదిస్తున్న సమాఖ్య కూటమి దశదిశ నిర్దేశించే నిమిత్తం కేటీఆర్, వైసీపీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డితో కలవడాన్ని చంద్రబాబు భూతద్దంలో చూపడం సరైందికాదు. వారిద్దరూ ఒకరికొకరు మనసు విప్పి చర్చించుకుంటే చంద్రబాబుకెందుకు మంటో అర్థం కావడం లేదు' అని సోము వీర్రాజు ప్రశ్నించారు.

రాష్ట్రంపై గద్దల్లా పడుతూ!

(మొదటి పేజీ తరువాయి)

పెద్ద సంఖ్యలో గురువారం ఉండవల్లిలోని నివాసంలో సీఎంను కలిశారు. డప్పుకళాకారులకు రూ.1,000నుంచి రూ.2వేలకు, చర్మకారులకు రూ.1500 నుంచి రూ.3వేలకు పింఛను పెంచినందుకు ఆయనకు కృతజ్ఞతలు తెలియజేశారు. సీఎంకు శాలువాలు కప్పి, గజమాలతో సత్కరించారు. ఆ సందర్భంగా, రాత్రి మాజీ మంత్రి అహ్మదుల్లా టీడీపీలో చేరిన సమయంలోను, అంతకుముందు ఉదయం టీడీపీ నేతలతో టెలికాన్ఫరెన్స్‌లోను చంద్రబాబు మాట్లాడారు. 'అవినీతి గొంగళిపురుగు (జగన్)ను కేసీఆర్ కౌగిలించుకున్నారు. ఈ స్నేహం కూడా తెలంగాణ కోసమేనా? తెలంగాణలో 26 బీసీ కులాలను బీసీ జాబితా నుంచి తొలగించి ఆ కులాలకు తీరని ద్రోహం చేసిన కేసీఆర్‌తో జగన్ అంటకాగుతున్నారు. తూర్పు కాపు, శెట్టి బలిజ, కళింగ, గవర వంటి అనేక కులాల వారికి కేసీఆర్ అన్యాయం చేశారు. టీఆర్ఎస్‌తో జతకట్టిన జగన్‌కు ఈ 26 కులాల బీసీలు తగిన బుద్ధి చెప్పాలి. ఆంధ్ర అభివృద్ధి చెందితే తన చేతగానితనం బయటపడుతుందని కేసీఆర్ బాధ. కేసుల్లో జైలుకు వెళ్లాల్సి వస్తుందేమోనని జగన్ అనుమానం. అసూయాపరులంతా ఏకమై కుట్రలు పన్నుతున్నారు. గద్దల్లా రాష్ట్రంపై వాలుతున్నారు. తెలంగాణలో సెంటిమెంటు రెచ్చగొట్టినట్లుగా.. ఆంధ్రలో కులాల మధ్య చిచ్చు రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారు' అని విమర్శించారు. ఇంకా ఏమన్నారంటే..

ఆ ముగ్గురికీ నాపై దుగ్ధ, ఈర్ష్య

'ఆదాయం లేని రాష్ట్రాన్ని నేను అభివృద్ధి చేశా. ఆదాయం ఉన్నా అభివృద్ధి చేయలేకపోయాననే దుగ్ధ కేసీఆర్‌ది. కేంద్రం సహాయం చేయకున్నా రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్నారనే వ్యధ మోదీది. పులివెందులకు నీళ్లు ఇచ్చారని జగన్‌కు ఈర్ష్య. హేతుబద్ధత లేని విభజనతో రాష్ట్రానికి అన్యాయం చేశారు. కనీసం కొన్ని హామీలైనా కాంగ్రెస్ ఇచ్చింది. వాటిని కూడా అమలు చేయకుండా బీజేపీ ద్రోహం చేసింది. రాష్ట్ర ప్రజలను నమ్మించి మోసగించింది. జగన్ మెడపై సీబీఐ కత్తి ఉంది. తెలంగాణలో ఆయనకు అక్రమ ఆస్తులున్నాయి. కేసుల మాఫీ కోసం మోదీతో, అక్రమాస్తులు కాపాడుకోవడానికి కేసీఆర్‌తో లాలూచీ పడుతున్నారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇస్తే మాకూ ఇవ్వాలని తెలంగాణ సీఎం డిమాండ్ చేశారు. షెడ్యూల్ 9, 10 జాబితాల్లోని సంస్థల విభజనకు అడ్డుపడ్డారు. చివరకు సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును కూడా అమలు చేయనివ్వలేదు. విభజన హామీలు అమలు చేస్తారా? పోలవరం ప్రాజెక్టుకు అడ్డుపడకుండా ఉంటారా? ప్రత్యేకహోదాకు అడ్డుపడకుండా ఉంటారా? ఆంధ్రకు వస్తానంటున్న కేసీఆర్ వీటికి సమాధానం చెప్పాలి. మోదీ ప్రణాళికలో భాగంగానే టీఆర్ఎస్, వైసీపీ కలిసి పనిచేస్తున్నాయని టీడీపీ గతం నుంచీ చెబుతోంది. తాజా భేటీతో ఈ పార్టీలు ఇంతకాలం వేసుకున్న ముసుగు తొలగిపోయింది.'

అనుబంధ సంఘాల నేతల భేటీ

టీడీపీ అనుబంధ సంఘాల అధ్యక్షులుగా నియమితులైన నేతలు చంద్రబాబును ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్ర తెలుగు యువత అధ్యక్షుడిగా నియమితులైన దేవినేని అవినాశ్ సీఎంకు కృతజ్ఞతలు తెలియజేశారు. బీసీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు బోనబోయిన శ్రీనివాస్ యాదవ్ అనుచరులతో వచ్చి బాబును కలిశారు. ఏ రాష్ట్రంలో జరగనన్ని సంక్షేమ కార్యక్రమాలతో బీసీల్లో ఆత్మవిశ్వాసాన్ని, గౌరవాన్ని కల్పించినందుకు చంద్రబాబుకు రుణపడి ఉంటామన్నారు. తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలిగా నియమితులైన పోతుల సునీత సచివాలయంలో సీఎంను కలిశారు. ఆయనకు శాలువా కప్పి, బుద్ధ విగ్రహాన్ని బహూకరించారు. తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థంగా నిర్వహిస్తానన్నారు.



పెన్షన్ రెట్టింపు చేసినందుకు తనకు కృతజ్ఞతలు చెప్పేందుకు వచ్చిన డప్పు కళాకారులు, చర్మకారులతో కలిసి డప్పు కొడుతున్న చంద్రబాబు

ముస్లింలలో అభద్రత..

'మోదీ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేశారు. వ్యవస్థలను పతనం చేశారు. ఎస్సీ, ఎస్టీ, ముస్లింలలో అభద్రత సృష్టించారు. బలహీన వర్గాలకు రక్షణ లేదు. చివరకు మీడియాపై కూడా వేధింపులు మొదలు పెట్టారు. దేశంలో భయానక వాతావరణం తెచ్చారు. రాష్ట్రాధికారాల్లో కేంద్రం జోక్యాన్ని సహించేది లేదు. న్యాయస్థానంలో పోరాటం చేస్తాం'

షర్మిల ఫిర్యాదు దురదృష్టకరం..

'సోషల్ మీడియాలో తనపై వచ్చిన కథనాలకు టీడీపీని బాధ్యురాలిని చేస్తూ వైసీపీ నాయకురాలు షర్మిల ఫిర్యాదు చేయడం దురదృష్టకరం. సోషల్ మీడియాలో అసభ్య ప్రచారం చేస్తున్న ఘనత వైసీపీదే. నాటి సీబీఐ జేడీ లక్ష్మీనారాయణపై దుష్ప్రచారం చేసింది. చివరకు న్యాయమూర్తులపై కూడా దుష్ప్రచారానికి తెగబడింది. పవన్ కల్యాణ్ పెళ్లిళ్లపై అసభ్యంగా ప్రచారం చేశారు. సోషల్ మీడియాను ఎవరు దుర్వినియోగం చేసినా సహించేది లేదు. పార్టీలకు అతీతంగా కఠిన చర్యలు తీసుకుంటాం.'

బంధుత్వాలు ఉంటే మీ ఇళ్లలో పెట్టుకోండి..

టీఆర్ఎస్‌కు చెందిన మాజీ మంత్రి తలసాని శ్రీనివాస యాదవ్ ఇటీవల రాష్ట్ర పర్యటనకు వచ్చినప్పుడు కొందరు టీడీపీ నేతలు ఆయనతో కలిసి పాల్గొనడంపై చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ఆలయాల్లో మొక్కులకు వచ్చి తలసాని రాజకీయ వ్యాఖ్యలు చేయడం ఏం పద్ధతి? టీఆర్ఎస్ నేతల పర్యటనల్లో టీడీపీ నేతలు పాల్గొనవద్దు. పాల్గొంటే ఊరుకోం. బంధుత్వాలు ఉంటే ఇంట్లో పెట్టుకోండి. స్నేహం ఉంటే వ్యక్తిగతంగా చేసుకోండి. కానీ వాటి కోసం పార్టీని పణంగా పెట్టవద్దు. పార్టీకి నష్టం కలిగించేలా వ్యవహరిస్తే సహించేది లేదు. తెలంగాణలో 26 బీసీ కులాలను బీసీ జాబితా నుంచి తొలగిస్తే మాట్లాడనివారు ఇక్కడకు వచ్చి బీసీలపై కపట ప్రేమ చూపిస్తున్నారు' అని ధ్వజమెత్తారు. శుక్రవారం ఎన్టీఆర్ వర్ధంతిని అన్ని ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించాలని ఆయన పార్టీ శ్రేణులకు పిలుపిచ్చారు.

వారికి పెన్షన్లు ఇచ్చిన ఘనత మాదే..

'మళ్లీ రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి రావడం చారిత్రక అవసరం. రాష్ట్రాన్ని కాపాడుకోవలసిన బాధ్యత మీపై ఉంది. ఎస్సీలకు ఏ రాష్ట్రం చేయనన్ని సంక్షేమ కార్యక్రమాలు చేసిన ఘనత టీడీపీ ప్రభుత్వానిది. వచ్చే ఎన్నికల్లో టీడీపీ గెలుపు ఏకపక్షం కావాలి. ఇది పేదల ప్రభుత్వం. మొట్ట మొదటసారిగా చర్మకారులకు పింఛన్లు అమలు చేసిన ప్రభుత్వం మాది. డప్పు కళాకారులకు సైతం పింఛను ఇచ్చి చరిత్ర సృష్టించాం. టీడీపీకే ఓటేయాలని విజ్ఞప్తి చేస్తూ ఊరూరా డప్పు కళాకారులు ప్రచారం చేయాలి. టీడీపీ గెలుపుకోసం కష్టపడాలి.'

నేడు కోల్‌కతాకు బాబు

- రేపటి మమత ర్యాలీకి హాజరయ్యేందుకే
- రాజకీయ వేడితో సీఎం దావోస్ పర్యటన రద్దు
- ఆయన స్థానంలో వెళ్లనున్న లోకేశ్, అధికారులు
- 'సన్‌రైజ్ ఏపీ' పేరుతో ప్రత్యేక గ్యాలరీ ఏర్పాటు

అమరావతి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): దేశంలోని బీజేపీయేతర పక్షాలన్నిటినీ ఆహ్వానించి.. తృణమూల్ కాంగ్రెస్ అధ్యక్షురాలు, బెంగాల్ సీఎం మమతా బెనర్జీ కోల్‌కతాలో నిర్వహిస్తున్న ర్యాలీకి సీఎం చంద్రబాబు హాజరుకానున్నారు. 19వ తేదీన జరిగే ఈ ర్యాలీలో పాల్గొనేందుకు ఆయన శుక్రవారం (18న) సాయంత్రమే బయల్దేరి వెళ్తున్నారు. మరోవైపు రాష్ట్రంలో రాజకీయ వేడి పెరగడం, అదే సమయంలో జాతీయ రాజకీయాలను సమన్వయం చేయడంలో బిజీగా ఉండడంతో చంద్రబాబు తన దావోస్ పర్యటనను రద్దుచేసుకున్నారు. ఫిబ్రవరి చివరిలో ఎన్నికల నోటిఫికేషన్ రానుండడం.. ఈలోపు రాష్ట్ర, జాతీయ రాజకీయాల్లో చేయాల్సిన పనులతో తీరికలేకుండా ఉండడంతో పర్యటనను రద్దుచేసుకున్నారు. ఆయన స్థానంలో మంత్రి లోకేశ్, ఈడీబీ సీఈవో కృష్ణకిషోర్, సీఎంవో ముఖ్య కార్యదర్శి సాయిప్రసాద్, ఇతర ఉన్నతాధికారుల బృందం దావోస్‌కు వెళ్లనుంది. ఈ నెల 22నుంచి 25వ తేదీ వరకు వీరు అక్కడ పర్యటిస్తారు. 22వ తేదీన ఒర్లెకిన్ సీఈవో రోలాండ్ ఫిషర్, డికిన్సన్ అండ్ కంపెనీ ఉపాధ్యక్షుడు గ్యారీ ఎం.కొహెన్, జేఎస్‌డబ్ల్యూ చైర్మన్ సజ్జన్ జిందాల్, ఫుల్లర్టన్ హెల్త్, అరుబా నెట్‌వర్క్స్, బెట్కన్, వాల్‌మార్ట్, హెచ్‌పీఈ తదితర కంపెనీల సీఈవోలతో భేటీ అవుతారు. 25వ తేదీన పెగా సిస్టమ్స్, అలీబాబా, లూయిస్ డ్రెఫిల్స్, డాన్‌ఫోస్, హిల్‌ఉడ్, మిత్సుబిషి కెమికల్స్, ఐనాక్స్ గ్రూప్, బెర్టెస్‌మాన్ గ్రూప్, హెంకెల్, ప్రోక్టర్ అండ్ గ్యాంబుల్ తదితర కంపెనీల సీఈవోలను కూడా కలుస్తారు. రాష్ట్రప్రభుత్వం దావోస్‌లో ఏర్పాటుచేసిన 'సన్‌రైజ్ ఏపీ' గ్యాలరీలో ఈ భేటీలు జరుగుతాయి.

స్టాలిన్ కూడా కోల్‌కతాకు: చెన్నై, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): మమతా బెనర్జీ ఆధ్వర్యంలో శనివారం కోల్‌కతాలో జరిగే ర్యాలీకి డీఎంకే అధ్యక్షుడు ఎంకే స్టాలిన్ కూడా హాజరుకానున్నారు. ఆయన శుక్రవారం బయల్దేరి వెళ్తున్నట్లు డీఎంకే ఓ ప్రకటనలో తెలిపింది. కాగా.. ఈ ర్యాలీకి తనకెలాంటి ఆహ్వానం అందలేదని మక్కల్ నీదిమయ్యం నాయకుడు కమల్‌హాసన్ చెన్నైలో విలేకరులకు తెలిపారు.

30నుంచి అసెంబ్లీ సమావేశాలు

అమరావతి, జనవరి 17(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ సమావేశాలు ఈనెల 30నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు శాసనసభ, శాసనమండలి కార్యాలయాలు గురువారం నోటిఫికేషన్ జారీ చేశాయి. ఆరోజు ఉదయం 9.30కు ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగిస్తారు. ఫిబ్రవరి 5న ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టే అవకాశం ఉంది. వచ్చేనెల 7వరకూ సమావేశాలు జరుగుతాయని చెబుతున్నారు.

జనసేన పార్లమెంటరీ కమిటీల ఎంపిక పూర్తి

అమరావతి, జనవరి 17(ఆంధ్రజ్యోతి): జనసేన పార్లమెంటు స్థాయి పార్టీ కమిటీల ఎంపిక ప్రక్రియ పూర్తయింది. రాష్ట్రంలోని 25 లోక్‌సభ నియోజకవర్గ కమిటీల జాబితాను పార్టీ అధ్యక్షుడు పవన్‌కల్యాణ్‌కు ముఖ్య నాయకులు శుక్రవారం అందజేయనున్నారు. ఈ కమిటీల ఎంపిక కసరత్తు ఈనెల 3నుంచి ప్రారంభమైంది.

వైసీపీ కాదు... ఏపీ టీఆర్ఎస్

- జెండాలో కేసీఆర్ బొమ్మ పెట్టండి
- ఆంధ్రోళ్లను, వైఎస్‌ను తిట్టిపోశారు
- అలాంటోళ్లతో జగన్ చెట్టపట్టాలా!
- పీసీసీ ఉపాధ్యక్షుడు తులసిరెడ్డి ఆగ్రహం

అమరావతి, ఆత్మకూరు, జనవరి 17(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ తెలంగాణ రాష్ట్ర సమితి (ఏపీటీఆర్ఎస్)గా వైసీపీ పేరు మార్చుకోవాలని, జెండాలో కేసీఆర్ బొమ్మ ముద్రించడం మంచిదని పీసీసీ ఉపాధ్యక్షుడు నర్రెడ్డి తులసిరెడ్డి సూచించారు. ఏపీసీసీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రానికి వైసీపీ చీడపురుగులా తయారయింది. వైసీపీ అధ్యక్షుడు జగన్‌కు రాష్ట్ర ప్రయోజనాలు పట్టవు. వ్యక్తిగత ప్రయోజనాల కోసం, డబ్బు మూటల కోసం ఎంతకైనా దిగజారుతారు. కేసీఆర్‌కు రాష్ట్రాన్ని తాకట్టు పెట్టారు. నవ్యాంధ్ర ప్రజలనూ, దేశాన్నీ అవమానకరంగా మాట్లాడారు. సీమాంధ్రుల పంచెలు ఊడదీసి కొడతాం, తెలంగాణ జాగో, ఆంధ్రా భాగో, ఆంధ్రులది పేడ బిర్యానీ, లంకలో పుట్టినవారంతా రాక్షసులే, అలాగే ఆంధ్రాలో పుట్టినవారంతా దుర్మార్గులేని కేసీఆర్ రాష్ట్ర ప్రజలను ఉద్దేశించి పలు సందర్భాల్లో వ్యాఖ్యానించారు. రాజశేఖరరెడ్డిని ఉద్దేశించి కేసీఆర్ అవమానకరంగా మాట్లాడారు. వైఎస్‌ను నీటి దొంగన్నారు. పోతిరెడ్డిపాడుకు బొక్కపెట్టి తెలంగాణ నీటిని రాయలసీమకు తీసుకుపోయి అన్యాయం చేసినందునే.. పావురాళ్లగుట్టలో పావురం అయిపోయాడన్నారు. నవ్యాంధ్రకు నంబర్‌వన్ ద్రోహి టీఆర్ఎస్. రాష్ట్రానికి సంజీవనిలాంటి ప్రత్యేక హోదా, పోలవరానికి సైంధవుడిలా అడ్డుపడింది. దిగువ రాష్ట్రమైన ఆంధ్రను ఎడారిగా మార్చడానికి ఎలాంటి అనుమతులు లేకుండా, నీటి కేటాయింపులు లేకుండా పాలమూరు - రంగారెడ్డి , డిండి ఎత్తిపోతల పథకాలు, కల్వకుర్తి ప్రాజెక్టు సామర్థ్యం పెంపు, వాటర్ గ్రిడ్ పథకం వంటి ప్రాజెక్టులను చేపట్టింది. వీటి ద్వారా 160 టీఎంసీల కృష్ణా జలాలను అక్రమంగా, దౌర్జన్యంగా తరలించేందుకు తయారైంది. అలాంటి టీఆర్ఎస్‌తోనూ, కేసీఆర్, కేటీఆర్‌తోనూ జగన్ చెట్టపట్టాలేసుకుని తిరగడం శోచనీయం' అని మండిపడ్డారు.

రెడ్ల ఎదుగుదలకు జగనే అడ్డంకి: బైరెడ్డి

"ప్రధాని మోదీ డైరెక్షన్‌లోనే కేసీఆర్, జగన్ కలయిక జరిగింది. ఆంధ్రుల ఆత్మగౌరవాన్ని కించపరిచేలా దుర్భాషలాడిన కేసీఆర్‌తో జగన్ జతకట్టడం సిగ్గుచేటు. రాయలసీమ పౌరుషాన్ని జగన్ మరిచిపోయారు. ఆంధ్రుల ఆత్మగౌరవాన్ని కేసీఆర్ కాళ్ల వద్ద పెట్టడం బాధాకరం. జగన్ చేసిన ఈ తప్పిదం రాజకీయంగా ఆత్మహత్య చేసుకున్నట్టే. రాష్ట్ర విభజన సమయంలో ఏపీకి అన్యాయం చేయడమే కాకుండా ప్రత్యేక హోదాకు అడ్డుపడిన కేసీఆర్‌ను జగన్ తన గృహప్రవేశానికి ఆహ్వానించడం నీచరాజకీయాలకు నిదర్శనం. ఫెడరల్‌ఫ్రంట్ ఏర్పాటు కోసం కేసీఆర్ చేస్తున్న ప్రయత్నాలు టైమ్‌పాసే. వైసీపీని ఆదరిస్తున్న రెడ్డి కులస్థులు జగన్ కుట్రను తెలుసుకోవాలి. ఏ రెడ్డి ఎదుగుదలకూ జగన్ సహకరించడు" అని మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖరరెడ్డి ఆత్మకూరులో వ్యాఖ్యానించారు.

ఈర్ష్యా ద్వేషాలతోనే కలయిక

అధికారం కోసం జగన్ చౌకబారు రాజకీయం.. నీచమైన ప్రచారాన్ని టీడీపీ ప్రోత్సహించదు.. మంత్రుల విమర్శ

ఏపీలో జరుగుతున్న అభివృద్ధిని చూడలేక నరేంద్ర మోదీ కేసీఆర్, జగన్ చేతులు కలిపారంటూ టీడీపీ మంత్రులు, నేతలు విరుచుకుపడ్డారు. అధికారం కోసం జగన్ చౌకబారు రాజకీయాలు చేస్తున్నారని, సొంత చెల్లెలిని అడ్డుపెట్టుకొని దిగజారుడు రాజకీయాలు చేస్తున్నాడని మండిపడ్డారు. కుటుంబాల విలువ టీడీపీకి తెలుసునని, సోషల్ మీడియా వేదికగా నీచమైన ప్రచారం చేయటాన్ని టీడీపీ ఎన్నడూ ప్రోత్సహించదని, అలాంటి పనులకు దిగే అలవాటు వైసీపీకే ఉందని దుయ్యబట్టారు.

జగన్‌ది దిగజారుడు రాజకీయం

ఆంధ్రలో నాలుగున్నరేళ్లలో జరిగిన అభివృద్ధిని చూసి ఓర్వలేని కేసీఆర్.. జగన్‌కు మద్దతు ఇస్తామంటున్నారు. ఎలాగైనా సీఎం కుర్చీలో కూర్చోవాలనే జగన్ చౌకబారు రాజకీయాలు చేస్తున్నారు. సొంత చెల్లెలిని అడ్డుపెట్టుకుని దిగజారుడు రాజకీయాలు చేస్తున్నాడు. రాష్ట్రపోలీసులపై నమ్మకం లేని వైసీపీ నేతలు తెలంగాణలో కేసులు పెడుతున్నారు. ఎన్నికల షెడ్యూల్‌కు ముందు రాష్ట్రంలో నూతన గృహ ప్రవేశం చేయాలనుకుంటున్న జగన్‌కి అభివృద్ధి గురించి మాట్లాడే అర్హత లేదు. ఊహించని అభివృద్ధి జరుగుతుంటే, జగన్, కేసీఆర్ ఈర్ష్యా, ద్వేషాలతో తట్టుకోలేకపోతున్నారు. బీసీలే టీడీపీకి అండ. ప్రజల దృష్టిమరల్చేందుకే కోడికత్తి డ్రామా, తలసాని శ్రీనివాస్ యాదవ్ పర్యటనలు. పెట్టుబడులను ఆకర్షించే చంద్రబాబు నాయకత్వాన్ని తప్పించి, ప్రతిష్ఠ లేని జగన్‌ని కేసీఆర్ ప్రోత్సహిస్తున్నారు. వైఎస్ కుమార్తె షర్మిలమ్మపై సోషల్ మీడియాలో అసత్య ప్రచారాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. 2014లోనే ఈ విషయంపై సినీ నటుడు ప్రభాస్ ఖండించారు. ఐదేళ్ల తర్వాత మళ్లీ ఈ విషయాన్ని తెరమీదకు తెచ్చి, తెలంగాణలో కేసు పెట్టడం విచిత్రంగానే ఉంది. పైగా షర్మిలపై సోషల్ మీడియాలో పోస్టింగుల వెనుక చంద్రబాబు ఉన్నారనడం చాలా తప్పు. షర్మిలను పోలీస్ స్టేషన్‌కు పంపి, చంద్రబాబుపై విమర్శలు చేయడం ఎంత వరకు సబబు.



- సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, మంత్రి

మోదీ డైరెక్షన్‌లో కేసీఆర్, జగన్



రాష్ట్రానికి అన్యాయం చేసిన కేసీఆర్‌తో జతకట్టిన జగన్ ఏ ముఖంతో ఇక్కడి ప్రజలను ఓట్లు అడుగుతారు? వారిద్దరూ మోదీ డైరెక్షన్‌లోనే నడుస్తున్నారు. తెలంగాణ ఎన్నికల్లో కేసీఆర్‌కు జగన్ సపోర్ట్ చేశారు. బీజేపీ కూడా సపోర్ట్ చేసింది. ఇవాళ వారిద్దరు బీజేపీకి ఉపయోగపడేటట్టు ఫెడరల్ ఫ్రంట్ అంటూ ప్రయత్నాలు చేస్తున్నారు. షర్మిలపై సోషల్ మీడియాలో జరిగిన ప్రచారాన్ని చంద్రబాబుకు అంటకట్టడం సరికాదు. వాట్సాప్‌లో సరిగ్గా చూసుకుని కేసులు పెట్టుకోండి. చంద్రబాబును అంటే మాత్రం మర్యాద దక్కదు.

- కళా వెంకట్రావు, నిమ్మకాయల చినరాజప్ప, మంత్రులు

అవకాశవాద రాజకీయాలు చేసే గద్దలు కేసీఆర్, జగన్. వారి అపవిత్ర కలయికపై ఆంధ్రులు రగిలిపోతున్నారు. కేసులనుంచి బయటపడటం కోసం మోదీతో దోస్తీ చేస్తున్నజగన్, ఇప్పుడు హైదరాబాద్‌లో ఉన్న ఆస్తులను కాపాడుకోవడం కోసం కేసీఆర్‌కు ఊడిగం చేస్తున్నాడు. ఆంధ్రకు ప్రత్యేక హోదా ఇస్తే పరిశ్రమలన్నీ ఏపీకు వెళతాయని పార్లమెంటులో గగ్గోలు పెట్టిన టీఆర్ఎస్ ఎంపీలతో కలిసి, ఏపీకి ప్రత్యేక హోదా తెస్తానని, కేంద్రంపై పోరాటం చేస్తానని చెప్పడం జగన్ వంటి దోపిడీదారుకే చెల్లిందన్నారు. టీడీపీని అంతం చేయడం, చంద్రబాబును తుదముట్టించడమనే రెండు ప్రధాన సారూప్యతలే జగన్, కేసీఆర్‌లను ఏకం చేశాయి.



- కొల్లు రవీంద్ర, మంత్రి

రాష్ట్రాభివృద్ధికి అడ్డంపడుతున్న కేసీఆర్



నవ్యాంధ్ర అభివృద్ధిని చూసి కేసీఆర్ ఓర్వలేకపోతున్నారు. రాష్ట్ర విభజనకు కేసీఆర్ ముఖ్య కారకుడు. నాటి ప్రధాని మన్మోహన్ సింగ్ పార్లమెంట్ సాక్షిగా నవ్యాంధ్రకు ఇచ్చిన హామీలను, చట్టంలో పొందుపరిచిన 18 అంశాలను అమలు కాకుండా అడ్డుపడుతున్నారు. కేసీఆర్, కుమార్తె కవిత చేత పోలవరం ప్రాజెక్టు నిర్మాణం అడ్డుకోవడానికి కోర్టులో పిటిషన్ దాఖలు చేయించడం దుశ్చర్య. షెడ్యూల్ 9, 10లోని అంశాలు అమలు చేయడం, ఉమ్మడి సంస్థల విభజన వంటివి ఐదేళ్లు గడుస్తున్నా పరిష్కారం కాలేదు. దమ్ముంటే బీజేపీ, వైసీపీ, టీఆర్ఎస్ కలిసి రాష్ట్రంలో పోటీ చేయాలి.

- నక్కా ఆనంద్ బాబు, మంత్రి

జగన్, ఒవైసీ క్యాలెండర్‌గాళ్లు



వైఎస్ జగన్, అసదుద్దీన్ ఒవైసీ క్యాలెండర్‌గాళ్లు. క్యాలెండర్‌లో నెలలు మారినట్లు వారు మారుతూ ఉంటారు. టీఆర్ఎస్‌తో పొత్తు పెట్టుకుని జగన్ ఆంధ్రుల ఆత్మాభిమానాన్ని పొరుగు రాష్ట్రం సీఎం కాళ్ల దగ్గర తాకట్టు పెట్టారు. పౌరుషంగా బతికే తెలుగుజాతి గుండెల్లో జగన్ గునపం దించారు. జగన్ చేసిన పాపాలతోనే వైఎస్ చనిపోయారు. ఏడు కొండలు ఎందుకు రెండు కొండలు చాలని ఆనాడు వైఎస్ అన్నారు. ఇప్పుడు రాజకీయాల కోసం జగన్ గుళ్లు.. మసీదులు పట్టుకుని తిరుగుతున్నారు. ధర్మాన సోదరుడు తుని దగ్గర నుంచి ఉన్న కొండలన్నీ కొట్టేశారు.

- జలీల్ ఖాన్, చైర్మన్, వక్ఫ్‌బోర్డు

ఆంధ్రపై విషం చిమ్ముతున్నారు



ఐదేళ్ల పసిగుడ్డు అయిన ఆంధ్రప్రదేశ్‌పై విషం చిమ్మటమే విషనాగులైన కేసీఆర్, జగన్‌ల లక్ష్యం. కేంద్రం సహకరించకపోయినా రాష్ట్రాభివృద్ధికి చంద్రబాబు తీవ్రంగా శ్రమిస్తుంటే విషనాగులైన వారువిషం చిమ్మడం దుర్మార్గం. స్వప్రయోజనాల కోసం కేసీఆర్ దగ్గర మార్కులు పొందాలని తనకు రాజకీయ బిక్షపెట్టిన టీడీపీపై తలసాని శ్రీనివాస్ అర్థంలేని ఆరోపణలు చేస్తున్నారు. దేవాలయాలు, కోడిపందేల పేరుతో ముసుగు దొంగలా తలసాని శ్రీనివాస్ రాష్ట్రానికి వచ్చి రాజకీయాలు చేస్తానంటే చూస్తూ ఊరుకోం. వ్యక్తిగత విమర్శలకు మూల పురుషుడు జగన్ అనే సంగతి షర్మిల గుర్తించాలి.

- పంచుమర్తి అనురాధ, టీడీపీ

కేసీఆర్, జగన్ మధ్య 2 వేల కోట్ల డీల్!



ఫెడరల్ ఫ్రంట్ పేరుతో ఆంధ్ర ద్రోహుల ఫ్రంట్‌గా ఏర్పడిన కేసీఆర్, జగన్‌లు ఏ ముఖం పెట్టుకొని ప్రజల్లోకి వస్తారు. ఇంకెంతకాలం కపటనాటకాలతో కాలం గడుపుతారు. చంద్రబాబు పోతిరెడ్డిపాడు నుంచి రాయలసీమకు నీళ్లు ఇస్తుంటే, ఆ పోతిరెడ్డిపాడును అడ్డుకుంటున్న కేసీఆర్‌తో జగన్ స్నేహం చేయడం రాయలసీమ ప్రజలను వెర్రివాళ్లను చేయడం కాదా? చంద్రబాబుకి వ్యతిరేకంగా కేసీఆర్‌కు, జగన్‌కు మధ్య రూ.2 వేల కోట్ల డీల్ కుదిరిందని ప్రజలు అనుకుంటున్నారు.

-ఆనంద్ సూర్య, చైర్మన్, బ్రాహ్మణ కార్పొరేషన్

- ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్

బాబుది నీచ సంస్కృతి

- శవాల దగ్గరా రాజకీయం.. వాళ్లు దద్దమ్మ మంత్రులు: తలసాని

హైదరాబాద్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర సీఎం చంద్రబాబుది శవాల దగ్గర కూడా రాజకీయం చేసే నీచ సంస్కృతి అని టీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ధ్వజమెత్తారు. 'దేవాలయాల దగ్గర రాజకీయం చేస్తారా' అంటూ తనను ఉద్దేశించి చంద్రబాబు అన్న వ్యాఖ్యలపై ఆయన మండిపడ్డారు. గురువారమిక్కడ తెలంగాణ అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద విలేకరులతో మాట్లాడారు. సంక్రాంతి ఉత్సవాల్లో భాగంగానే తాను ఆంధ్రకు వెళ్లానని, రాజకీయం చేసేందుకు కాదని స్పష్టం చేశారు. చంద్రబాబు లాగా దేవాలయాల దగ్గర, శవాల దగ్గర రాజకీయాలు చేసే అలవాటు తనకు గానీ, టీఆర్ఎస్‌కు గానీ లేవన్నారు. నందమూరి హరికృష్ణ శవం దగ్గర కూడా ఆయన రాజకీయం చేశారని మండిపడ్డారు. తనకు అక్కడ ఆహ్వానం పలికిన తమ సామాజిక వర్గ నేతలను ఆయన హెచ్చరించారని.. ఇలాగైతే బీసీలెవరూ టీడీపీలో ఉండరన్నారు. 'కేటీఆర్, జగన్ భేటీ మోదీ కుట్ర అంటూ ఏపీ దద్దమ్మ మంత్రులు, నీతి, జాతి లేని మనుషులు మాట్లాడుతున్నారు' అని మండిపడ్డారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీకి ప్రతిపక్ష హోదా వచ్చే పరిస్థితి కూడా కనిపించడం లేదన్నారు.

షర్మిలపై 12 వెబ్‌సైట్లలో పోస్టింగులు

హైదరాబాద్ సిటీ, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): వైఎస్ షర్మిల ఇచ్చిన ఫిర్యాదుపై దర్యాప్తు ముమ్మరం చేసినట్లు తెలంగాణ సైబర్ క్రైం పోలీసులు తెలిపారు. సోషల్ మీడియాలో తనపై దుష్ప్రచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలంటూ షర్మిల హైదరాబాద్ సీపీ అంజనీకుమార్‌కు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. విచారణ ప్రారంభించిన సైబర్ క్రైం పోలీసులు షర్మిలపై సోషల్ మీడియా వేదికగా జరిగిన ప్రచారాలకు సంబంధించి 12 వెబ్‌సైట్లను గుర్తించారు. ఆ వెబ్‌సైట్ల యూఆర్ఎల్ నంబర్లు, ఐపీ అడ్రస్‌ల కోసం పోలీసులు గూగుల్‌కు లేఖ రాశారు. ఐపీ అడ్రస్‌ల వివరాలు తెలియగానే సర్వీస్ ప్రొవైడర్లకు నోటీసుల జారీ చేయనున్నారు. గూగుల్ నుంచి ఆయా ఐపీ అడ్రస్‌లు చేరడానికి రెండు రోజులు పట్టొచ్చని తెలిపారు.

బాబు, పాల్ ఒకేలా: విజయసాయిరెడ్డి



(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్): వైసీపీ నేత విజయసాయి రెడ్డి మరోసారి వరుసట్వీట్లతో చంద్రబాబు, కేఏ పాల్ లక్ష్యంగా విరుచుకుపడ్డారు. "ఫెడరల్ ఫ్రంట్ ఏర్పాటు కోసం జగన్, కేటీఆర్ భేటీ తర్వాత చంద్రబాబు, కేఏ పాల్ ఒకేలా రియాక్ట్ అయ్యారు. వైసీపీ, టీఆర్ఎస్ కలిసి పనిచేస్తే తమదే విజయమని రెచ్చిపోయి ప్రకటనలు చేస్తున్నారు. పండుగ రోజుల్లో వీరి కామెడీతో ప్రజలకు మంచి ఎంటర్‌టైన్‌మెంట్ దొరికింది" అని ట్వీట్ చేశారు. మరో గంటకి... "రాజకీయాలను కామెడీగా మార్చావు కదా చంద్రబాబూ. అందితే జుట్టు, లేకపోతే కాళ్లు. కేసీఆర్‌తో పొత్తుపెట్టుకొని ఓటుకు నోటు కేసు నుంచి బయటపడాలని పథకం వేసి.. కుదరకపోయేసరికి రోజుకో రకంగా ఏడుస్తున్నావు. చిట్టినాయుడిని సీఎంగా చూడక ముందే అడ్రసు లేకుండా పోతున్నా అనే భయం పట్టుకుంది బాబుకి" అంటూ మరో ట్వీట్ చేశారు. శ్రీకాకుళం జిల్లా మందస మండలం రట్టి గ్రామంలో మాట్లాడుతూ, "రానున్న సాధారణ ఎన్నికల్లో వైఎస్ జగన్‌కు అధికారం ఖాయం " అని అన్నారు.

ఫెడరల్ ఫ్రంట్‌తో టీడీపీలో వణుకు: రోజా

"వైఎస్ జగన్, టీఆర్ఎస్ మంత్రి కేటీఆర్‌తో ఫెడరల్ ఫ్రంట్ ఏర్పాటుపై చర్చించడంతో టీడీపీ నాయకుల్లో వణుకు పట్టుకుంది. చంద్రబాబు, ఆ పార్టీ నాయకులు రాద్ధాంతం చేస్తున్నారు" అని వైసీపీ ఎమ్మెల్యే రోజా వేంపల్లెలో విమర్శించారు. "ఓటుకు నోటు కేసులో దొరికిపోయిన సీఎం చంద్రబాబు, కేసీఆర్‌తో సన్నిహితంగా మెలగడం ప్రజలు మరచిపోలేదు. మంత్రి దేవినేని ఉమ ఆడోమగో తెలియదని కేసీఆర్ ప్రకటించినప్పటికీ, ఆయనకు దుర్గమ్మ గుడిలో స్వాగతంపలికి దర్శనాన్ని చేయించడాన్ని ఏమనాలో చెప్పాలి. ఏ పార్టీతో పొత్తులేకుండానే ఎన్నికల్లో ముందుకెళ్తామని జగన్ చెబుతున్నప్పటికీ టీడీపీ నాయకులు భయంతో లేనిపోని ఆరోపణలు చేస్తున్నారు. చంద్రబాబుకు ఓటమి భయం పట్టుకుంది. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయని టీడీపీ ప్రభుత్వాన్ని బంగాళాఖాతంలో కలిపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారు" అని రోజా విరుచుకుపడ్డారు.

విశాఖలో 'స్థానిక' మేళా

ఉన్న దగ్గరే ఉద్యోగకల్పన.. ఉత్తరాంధ్ర నుంచి ఏటా 5 వేలమంది ఇంజనీర్లు

- ఐటీ, పరిశ్రమల వృద్ధితో విశాఖలోనే వారికి కొలువు
- సర్కారు ప్రోత్సాహకాలతో కదిలొస్తున్న ఎన్‌ఆర్‌ఐలు
- డిగ్రీ చదివితే శిక్షణ ఇచ్చి.. ఏదో కంపెనీలో అవకాశం
- రెండేళ్లుగా ఐటీకి ఊపు.. శ్రమ, మేధోపర వనరుల వలసల్లో క్రమంగా తగ్గుదల
- మహిళల సాధికారతను సాధించిన బ్రాండిక్స్ కంపెనీ

విశాఖపట్నం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : ఉత్తరాంధ్ర అంటేనే వలసలు గుర్తుకొస్తాయి. పక్క ప్రాంతాలు మొదలు, దూరపు జిల్లాలు, వేరే రాష్ట్రాల దాకా, ఈ వలస కథలు విస్తరించాయి. ఈ ప్రాంతంలో ఉపాధిలో కాస్త మెరుగ్గా విశాఖపట్నం ఉంటుంది. ఉత్తరాంధ్ర జిల్లాల్లోని శ్రీకాకుళం, విజయనగరం నుంచి పనుల కోసం విశాఖకు ఏటా వేలాది వస్తుంటారు. అలాంటి విశాఖ.. రాష్ట్ర విభజనకు ముందు ఐటీ, సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల విషయం వచ్చేసరికే తానూ వలసబాట పట్టాల్సిన పరిస్థితి! ఏ హైదరాబాద్‌కో, బెంగళూరుకో ఇక్కడి మేధ తరలిపోతుండేది. నాలుగున్నరేళ్ల తరువాత చూస్తే, ఉత్తరాంధ్రలోని మిగతా జిల్లాలకు సైతం తానే ఐటీ ఉద్యోగాలు ఇచ్చే స్థితికి విశాఖపట్నం చేరుకొంది. సైబర్ క్షేత్రాలు, పరిశ్రమల్లోకి పెట్టుబడుల ప్రవాహం మొదలయ్యాక.. క్రమంగా వలసలు కూడా క్రమంగా తగ్గుముఖం పడుతున్నాయి. ఉత్తరాంధ్రలో ఐదు వేల మంది ఏటా ఇంజనీరింగ్ పట్టభద్రులు ఉపాధి కోసం విశాఖపట్నం వస్తుండగా, వారిలో నైపుణ్యం ఉన్నవారికి ఐటీ, ఐటీఈఎస్ కంపెనీలు తమ వద్ద ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నాయి. రాష్ట్ర విభజనకు ముందు ఇలాంటి పరిస్థితిని ఊహించడానికి ఉండేది కాదు. ఉద్యోగాల కోసం ఎక్కడికో వెళ్లాల్సిన అవసరం లేకుండా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. విదేశాల్లో స్థిరపడిన ఎన్‌ఆర్‌ఐలతో చర్చించి విశాఖలో కంపెనీలు ఏర్పాటు చేయించింది. వారికి అవసరమైన భవనాలను సేకరించడానికి 'డిజిగ్నేటెడ్ టెక్నాలజీ పార్కు' స్కీమును ప్రారంభించింది. అందులో ప్లగ్ అండ్ ప్లే సౌకర్యాలు సమకూర్చింది. అద్దెలో 50 శాతం రాయితీ ప్రకటించింది.



విశాఖజిల్లాలోని బ్రాండిక్స్ కంపెనీలో పనిలో నిమగ్నమైన మహిళలు

ఏ కంపెనీలో ఎందరు..



విశాఖపట్నం సీతమ్మధార వుడా కాంప్లెక్స్‌లో 2016లో తొమ్మిది కంపెనీలను ఏర్పాటు చేశారు. రెండేళ్లలో 700 మందికి ఉద్యోగాలు వచ్చాయి. టెక్ మహీంద్రా ఆవరణలో ఏర్పాటుచేసిన టెక్ హబ్‌లో 12 కంపెనీలు ప్రారంభించగా, 1,500 మందికి ఉద్యోగాలు వచ్చాయి. హెల్త్‌కేర్ రంగంలో విశేష అనుభవం వున్న కాండ్యుయెంట్‌లో ఐదువేల మందికి ఉపాధి కల్పించడానికి ఒప్పందం జరిగింది. మొదట 200 మందితో ఆ సంస్థ కార్యకలాపాలు ప్రారంభించింది. ఫ్రాంక్లిన్ టెంపుల్టన్‌కు 25 ఎకరాలు కేటాయించారు. 'వాక్ టు వర్క్' విధానంలో పనిచేసే చోటే ఉద్యోగులకు నివాసం కల్పించడం ఈ సంస్థ ధ్యేయం. ఈ సంస్థ మొదటి 80 మందితో సేవలు మొదటు పెట్టింది. దశల వారీగా 1,500 మందికి ఉపాధి కల్పిస్తుంది. బీపీఓ కంపెనీలు పాత్ర, ఏఎన్ఎస్‌డబ్ల్యు కంపెనీలు చెరో 1,500 మందికి ఉపాధి కల్పిస్తాయి.

మెడ్‌టెక్‌తో మారిన ఉద్యోగ చిత్రం..



రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటుచేసిన ఏపీ మెడికల్ టెక్నాలజీ పార్క్ (ఏపీ మెడ్‌టెక్ జోన్)తో విశాఖకు అంతర్జాతీయ ఖ్యాతి దక్కింది. ప్రపంచదేశాల నుంచి ఏటా సుమారు రూ.30 వేల కోట్ల విలువైన వైద్య పరికరాలు దిగుమతి చేసుకుంటున్న భారత్, రానున్న రోజుల్లో ఎగుమతి చేసే స్థాయికి వెళ్లాలన్న ఉద్దేశంతోనే ముఖ్యమంత్రి చంద్రబాబు దీనిని రూపకల్పన చేశారు. విశాఖనగర శివారు పెదగంట్యాడలో 270 ఎకరాలను మెడ్‌టెక్ పార్కుకు కేటాయించారు. 2016 ఆగస్టు 19వ తేదీన మెడ్‌టెక్ జోన్‌కు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. 2018 డిసెంబరు 13న ఫేజ్-1ను ప్రారంభించి రెండో దశ పనులకు శంకుస్థాపన చేశారు. మెడ్‌టెక్ పార్క్‌లో 280 కంపెనీలను ఏర్పాటుచేసి 24 వేల మందికి ఉద్యోగాలను కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. మొదటి దశ పనులు పూర్తయ్యే నాటికి 20 కంపెనీలు ఉత్పత్తి ప్రారంభించే స్థాయికి చేరుకోగా, మరో 60 కంపెనీలు జనవరి నుంచి ఉత్పత్తులను ప్రారంభించనున్నాయి. ఫేజ్-2, ఫేజ్-3 పనులు పూర్తయ్యేసరికి 250 కంపెనీలను ఏర్పాటుచేసి 24 వేల మందికి ఉద్యోగాలను కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. మెడ్‌టెక్ జోన్ ఏర్పాటుతో స్థానికంగా ఉంటున్న ప్రజలకు చిన్న చిన్న ఉద్యోగావకాశాలు ఎక్కువగా లభిస్తున్నాయి. మెడ్‌టెక్ జోన్ పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే మరిన్ని ఉద్యోగాలు స్థానికులకు లభించనున్నాయి. మెడ్‌టెక్ జోన్ ఏర్పాటుతో చుట్టుపక్కల భూముల ధరలు భారీగా పెరగడంతో ఎంతోమంది ఆర్థికంగా బలోపేతమయ్యారు.

ప్లగ్ అండ్ ప్లే అంటే..

అడుగు పెట్టిన క్షణమే కార్యకలాపాలు ప్రారంభించడానికి వీలుగా ఒక కంపెనీకి అన్ని రకాల మౌలిక, సాంకేతిక సదుపాయాలను ప్రభుత్వమే ఏర్పాటు చేస్తుంది. ఈ విధానానికే ప్లగ్ అండ్ ప్లే అని పేరు. ఈ పద్ధతుల్లో ప్రభుత్వం కొత్త కంపెనీకి కేటాయించే భవనంలో బ్యాండ్ విత్ ఇంటర్నెట్ సౌకర్యం, నిరంతరాయ విద్యుత్ సరఫరా, ఏసీ వంటి సౌకర్యాలు ఉంటాయి. రాష్ట్ర ప్రభుత్వం చొరవతో ఎక్కువగా ఎన్‌ఆర్‌ఐలే పరిశ్రమలు, కంపెనీలు పెట్టడానికి విశాఖకు వస్తున్నారు. వీరంతా భూసేకరణ ప్రక్రియను పూర్తిచేసుకొని, కార్యాలయ నిర్మాణాలను పూర్తిచేసి, తమ కార్యకలాపాలను ప్రారంభించేసరికే చాలాకాలం గడిచిపోతోంది. ఈ ప్రక్రియలోని విపరీత జాప్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం వీలైనంతగా తగ్గించడానికే ఈ విధానాన్ని చేపట్టింది. రెండేళ్ల క్రితం ఒక కంపెనీ తన కార్యాలయం విశాఖలో పెట్టడానికి ఉత్సాహం చూపించింది. ఉడా పరిధిలోని సీతమ్మధారలో ఉన్న ఓ షాపింగ్ కాంప్లెక్స్‌లో రెండు ఫ్లోరులను తీసుకొని.. అన్ని వసతులతో సదరు కంపెనీకి ఆ ప్రదేశాన్ని రాష్ట్ర ప్రభుత్వం అప్పగించింది.

అవకాశాల్లో 9వ స్థానంలో..

అత్యధికంగా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్న నగరాల జాబితాలో విశాఖపట్నం దేశంలో తొమ్మిదో స్థానంలో నిలిచింది. గత నాలుగేళ్లలో జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యాన 82,756 మందికి శిక్షణ ఇవ్వగా, వారిలో 12,614 మందికి ఉద్యోగాలు వచ్చాయి. ఆన్‌లైన్‌లో జావా, టాలీ, టాలీ విత్ జీఎస్‌టీ, సీ లాంగ్వేజ్, వెబ్ టెక్నాలజీస్, పైథాన్, డిజిటల్ మార్కెటింగ్, క్లౌడ్ కంప్యూటింగ్, వెబ్ డిజైనింగ్ కోర్సుల్లో, ఆఫ్‌లైన్‌లో టాలీ విత్ జీఎస్టీ, అమెజాన్ వెబ్ సర్వీసెస్, సాఫ్ట్ స్కిల్స్, కమ్యూనికేషన్ స్కిల్స్, యాప్టిట్యూడ్ స్కిల్స్, ఇంటర్వ్యూ స్కిల్స్ నేర్పిస్తున్నారు. నైపుణ్యాలు సాధించినవారు ఐటీ కంపెనీలు, ఇతర రంగాల్లో మెరుగైన వేతనాలతో ఉపాధి పొందుతున్నారు.

'రియల్' చక్రం తిరిగింది

విశాఖ నగరం మధ్య నుంచి వెళుతున్న జాతీయ రహదారి వల్ల ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని గుర్తించారు. భారీ వాహనాలను బైపాస్ చేయడానికి ఆనందపురం-పెందుర్తి-అనకాపల్లి మధ్య ఆరు లేన్ల రహదారికి రూ.2300 కోట్లు మంజూరు చేశారు. ఆ విధంగానే సబ్బవరం మండలంలో పెట్రో యూనివర్సిటీ, స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీలకు భూములు కేటాయించారు. సబ్బవరం సమీపాన ట్రై జంక్షన్‌లో అఫర్డబుల్ హౌసింగ్ కోసం 1,800 ఎకరాల ల్యాండ్ పూలింగ్‌కు నడుం కట్టారు. ఈ నిర్ణయాలు, ప్రాజెక్టుల వల్ల సబ్బవరం, పెందుర్తి, అనకాపల్లి, ఆనందపురం మండలాల్లో భూముల ధరలు భారీగా పెరగడంతో యజమానులు లబ్ధిపొందుతున్నారు.



రెండేళ్లలో మూడు భారీ పరిశ్రమలు

2017-18 ఆర్థిక సంవత్సరంలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు 602 ఏర్పాటయ్యాయి. వాటి ద్వారా 9,207 మందికి ఉపాధి కల్పించారు. రూ.10కోట్ల పెట్టుబడి దాటిన ఏడు భారీ పరిశ్రమల ద్వారా 9,122 మందికి ఉపాధి లభించింది. 2018-19 ఆర్థిక సంవత్సరంలో 269 ఎంఎస్ఎంఈల ద్వారా 2,649 మందికి, మూడు భారీ పరిశ్రమల ద్వారా మరో 632 మందికి ఉపాధి కల్పించారు.

బ్రాండిక్స్‌లో మరో దఫా కొలువులు



అచ్యుతాపురంలో ఏర్పాటుచేసిన అపెరల్ సిటీ బ్రాండిక్స్‌లో 18వేల మంది మహిళలు ఇప్పటికే ఉపాధి పొందుతున్నారు. అక్కడ కొత్తగా మరో నాలుగువేల మందికి ఉద్యోగాలు కల్పించేందుకు చర్యలు చేపట్టారు. ఇక్కడ చేరిన తరువాత పలువురు మహిళలు సొంత గృహాలు సమకూర్చుకుని, పిల్లలను మంచి విద్య చెప్పించుకుంటున్నారు.

11 వేల సీట్లలో ఏడు వేలు మనకే..

కేంద్రం ప్రవేశపెట్టిన ఐబీపీఎస్ పథకంలో మొత్తం 11వేల సీట్లు ఉన్నాయి. వాటిలో ఒక్క ఆంధ్రప్రదేశే ఏడువేల సీట్లను సాధించింది. వాటిలో అత్యధికం విశాఖపట్నం ఐటీ కంపెనీలే దక్కించుకున్నాయి. డిగ్రీ పాసైన వారికి హెచ్‌పీసీఎల్ స్కిల్ డెవలప్‌మెంట్ ఇనిస్టిట్యూట్‌లో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. అనంతరం స్థానికంగానే ఉద్యోగాలు కల్పిస్తున్నారు.

సిసోడియా బదిలీ

- ఎన్నికల కొత్త ప్రధానాధికారిగా గోపాలకృష్ణ ద్వివేది
- మరింత సమర్థుడి కోసం ఈసీ నిర్ణయం
- ముగ్గురిని సూచించిన రాష్ట్రప్రభుత్వం
- వారిలో ద్వివేది ఎంపిక; ఉత్తర్వులు జారీ
- తక్షణమే బాధ్యతలు స్వీకరించిన కొత్త సీఈవో

అమరావతి, జనవరి 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి (సీఈవో) ఆర్.పి.సిసోడియాను కేంద్ర ఎన్నికల కమిషన్ (ఈసీ) అర్ధాంతరంగా ఆ పదవి నుంచి తప్పించింది. ఆయన స్థానంలో రాష్ట్ర పశుసంవర్ధక శాఖ ముఖ్య కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేదిని నియమించింది. నవ్యాంధ్రలో త్వరలో అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలు ఒకేసారి వస్తున్నాయని.. దీంతో పని బాధ్యతలు ఎక్కువగా ఉంటాయని.. మరింత సమర్థుడు, చురుగ్గా ఉండే అధికారి ఉంటే బాగుంటుందని ఈసీ రాష్ట్రప్రభుత్వానికి చెప్పినట్లు తెలిసింది. 'సిసోడియాను మార్చాలి.. మీకేమైనా అభ్యంతరమా' అని అడిగినట్లు సమాచారం. ఈసీ ఏ నిర్ణయం తీసుకున్నా తమకు అభ్యంతరం లేదని ప్రభుత్వం తెలిపింది. కొత్తగా ఎవరిని నియమించాలో ముగ్గురి పేర్లతో ప్యానెల్ పంపాలని కమిషన్ సూచించింది. సీనియర్ ఐఏఎస్ అధికారులు గోపాలకృష్ణ ద్వివేది, ముఖేశ్‌కుమార్ మీనా, శ్యామలరావు పేర్లతో కూడిన ప్యానెల్‌ను ప్రభుత్వం పంపింది. వీరిలో ద్వివేదిని నూతన సీఈవో నియమిస్తూ ఈసీ గురువారం నోటిఫికేషన్ జారీచేసింది. ఆ మేరకు రాష్ట్రప్రభుత్వం కూడా ఉత్తర్వులిచ్చింది. సిసోడియాను గిరిజన సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శిగా బదిలీచేసింది. ప్రస్తుతం పశుసంవర్ధక శాఖ ముఖ్య కార్యదర్శిగా ఉన్న ద్వివేది.. గతంలో తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్‌గా పనిచేశారు. పురందేశ్వరి కేంద్ర మంత్రిగా ఉన్నప్పుడు ఆమె వద్ద ఓఎస్‌డీగా కూడా బాధ్యతలు నిర్వర్తించారు.

ఓటర్ల జాబితాల్లో లోపాలు దొర్లకుండా..

ద్వివేది తక్షణమే బాధ్యతలు స్వీకరించారు. అనంతరం సచివాలయంలో మీడియాతో మాట్లాడారు. వచ్చే ఎన్నికలను ప్రశాంతంగా, అత్యంత పారదర్శకంగా నిర్వహిస్తామన్నారు. ఓటర్ల జాబితాల్లో ఎలాంటి లోపాలు దొర్లకుండా చూస్తానని స్పష్టం చేశారు. 'ఎన్నికలు అత్యంత పారదర్శకంగా, స్వేచ్ఛాయుతంగా ఎన్నికలు నిర్వహిస్తాం. ఓటర్లు తమ పేర్లను వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చు. ఎస్ఎంఎస్ ద్వారా కూడా ఓటు ఉన్నదీ లేనిదీ తెలుసుకోవచ్చు' అని సూచించారు. ఓటర్లు తమ ఓట్లు ఉన్నదీ లేనిదీ తప్పని సరిగా పరిశీలించుకోవాలన్నారు. శాఖలన్నీ సహకరిస్తే ఎన్నికల ప్రక్రియ విజయవంతమవుతుందని తెలిపారు. ఎన్నికల నిర్వహణపై అధికారులు, రాజకీయ పార్టీలతో చర్చిస్తామని చెప్పారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పిస్తామన్నారు.

సొంత జిల్లాల్లో పనిచేస్తున్న అధికారులను బదిలీ చేయండి

- రాష్ట్రాలకు ఎన్నికల కమిషన్ ఆదేశం
- నవ్యాంధ్రలో ఇద్దరు కలెక్టర్ల బదిలీ

అమరావతి, జనవరి 17(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా త్వరలో లోక్‌సభకు, వివిధ రాష్ట్రాల శాసనసభలకు ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో అధికారులను సొంత జిల్లాల నుంచి బదిలీ చేయాలని ఏపీ సహా అన్ని రాష్ట్రాలను కేంద్ర ఎన్నికల కమిషన్(ఈసీ) ఆదేశించింది. ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉన్నతస్థాయి నుంచి కింద స్థాయి అధికారి వరకూ అన్ని శాఖల అధికారులకు ఈ నిబంధన వర్తిస్తుందని స్పష్టం చేసింది. ఒకేచోట మూడేళ్ల నుంచి విధులు నిర్వర్తిస్తూ.. ఎన్నికల విధుల్లో భాగస్వాములు కాబోయే అధికారులను తప్పనిసరిగా ఆ ప్రాంతం నుంచి బదిలీ చేయాలని నిర్దేశించింది. దీనిపై రాష్ట్రప్రభుత్వం తక్షణమే స్పందించింది. పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ కాటంనేని భాస్కర్‌ను విశాఖ కలెక్టర్‌గా.. అక్కడ కలెక్టర్‌గా ఉన్న ప్రవీణ్‌కుమార్‌ను పశ్చిమగోదావరికి బదిలీ చేసింది. రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారిగా ఉన్న సిసోడియాను గిరిజన సంక్షేమశాఖ ముఖ్యకార్యదర్శిగా బదిలీ చేశారు. ఇప్పటివరకు గిరిజన, సాంఘిక సంక్షేమ శాఖల ముఖ్యకార్యదర్శిగా ఉన్న రావత్ ఇక సాంఘిక సంక్షేమశాఖకు మాత్రమే పరిమితమవుతారు. జీఏడీ పొలిటికల్ కార్యదర్శిగా ఉన్న ఎన్.శ్రీకాంత్‌కు జీఏడీ సర్వీసెస్ కార్యదర్శిగా పూర్తి అదనపుబాధ్యతలు అప్పగించారు. ఉన్నతవిద్యాశాఖ ముఖ్యకార్యదర్శి దమయంతికి పశుసంవర్ధకశాఖ ముఖ్యకార్యదర్శిగా పూర్తి అదనపు బాధ్యతలిచ్చారు.

వినియోగదారులు ఇక్కడ..ప్రజాభిప్రాయం అక్కడ

- ఏపీఈఆర్‌సీ తీరుపై విమర్శలు
- నేడు హైదరాబాద్‌లో అభిప్రాయ సేకరణ

అమరావతి, జనవరి 17(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్‌సీ) తీరుపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఏటా విద్యుత్ చార్జీల సవరణ నిమిత్తం వాస్తవ వార్షిక ఆదాయ నివేదిక (ఏఆర్‌ఆర్) సమర్పణ సమయంలో ఏపీఈఆర్‌సీ ప్రజాభిప్రాయ సేకరణను చేపడుతుంది. వాస్తవ వినియోగదారులు ఏపీలో ఉంటే.. ఏపీఈఆర్‌సీ మాత్రం హైదరాబాద్‌లో ఆ కార్యక్రమం నిర్వహిస్తోంది. రాష్ట్ర విభజన నేపథ్యంలో దాదాపు అన్ని ప్రభుత్వ విభాగాలు అమరావతికి వచ్చేశాయి. కానీ, ఏపీఈఆర్‌సీ మాత్రం ఇంకా హైదరాబాద్‌లోనే ఉండడాన్ని పలువురు ఆక్షేపిస్తున్నారు. విద్యుత్ వినియోగదారులు ప్రజాభిప్రాయ సేకరణ కోసం పొరుగు రాష్ట్రమైన హైదరాబాద్‌కు ప్రత్యేకంగా వెళ్లి సమస్యలు వెల్లడించాలి. వినియోగదారులకు ఇది భారంగా మారడంతో వెళ్లేందుకు ఎవరూ సుముఖతను వ్యక్తం చేయడం లేదు. 2019-20 ఏఆర్‌ఆర్ కోసం హైదరాబాద్‌లో వినియోగదారుల అభిప్రాయ సేకరణను ఏపీఈఆర్‌సీ నిర్వహిస్తోంది. కాగా, ఈ ఏడాది జనవరి ఒకటో తేదీ నుంచి హైకోర్టు అమరావతి నుంచే కార్యకలపాలను చేపట్టడంతో... తాము కూడా హైదరాబాద్‌ను వీడి వచ్చేస్తామని, రాజధాని నగరం నుంచే కార్యకలాపాలు చేపడతామని రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాశామని ఏపీఈఆర్‌సీ ఛైర్మన్ జస్టిస్ భవానీ ప్రసాద్ 'ఆంధ్రజ్యోతి'తో చెప్పారు. ఈ నెల మూడో తేదీనే అమరావతి నుంచి కార్యకలాపాలు సాగించేలా నోటిఫికేషన్‌ను జారీ చేయాలని, తమకు కార్యాలయాన్ని కేటాయించాలని కోరామని వివరించారు. అయితే ఇప్పటికే 2019-20 ఏఆర్‌ఆర్ నోటిఫికేషన్ ప్రక్రియ ప్రారంభించినందున ఈ సారికి హైదరాబాద్‌లో తుది ప్రజాప్రాయ సేకరణను చేపడుతున్నామన్నారు.

కేంద్రానికి ఆ హక్కు లేదు

- కోడికత్తి కేసు ఎన్ఐఏ పరిధిలోకి రాదు.. రేపు హైకోర్టులో పిటిషన్ దాఖలు!
- కేంద్రం తీరు సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధం: రాష్ట్ర ప్రభుత్వం

అమరావతి, జనవరి 17(ఆంధ్రజ్యోతి): కోడికత్తి కేసును ఎన్ఐఏకు అప్పగించాలన్న కేంద్రం నిర్ణయంపై న్యాయపోరాటం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్రాల హక్కుల్లో తలదూర్చే విధంగా.. సమాఖ్య వ్యవస్థకు తూట్లు పొడిచేలా కేంద్రం వ్యవహరిస్తోందని రాష్ట్ర ప్రభుత్వం విమర్శిస్తోంది. 'ఎన్ఐఏకు ఉగ్రవాదం కేసులు, రెండు, మూడు రాష్ట్రాల్లో నేరాలతో సంబంధమున్న కేసులను మాత్రమే అప్పగిస్తారు. ఎన్ఐఏ ఏర్పాటు చట్టంలోనే ఆ విషయాన్ని స్పష్టంగా పేర్కొన్నారు. అలాంటిప్పుడు వైసీపీ అధ్యక్షుడు జగన్‌పై జరిగిన కోడికత్తి దాడిలాంటి చిన్న కేసుపై ఎన్ఐఏ విచారణ చేయడం.. ఆ సంస్థ చట్ట పరిధిని అతిక్రమించడమే' అని రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంటోంది. ఈ విషయాలన్నింటినీ ప్రస్తావిస్తూ శనివారం హైకోర్టులో పిటిషన్ వేయనుంది. వాస్తవానికి కోడికత్తి కేసుపై ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం విచారణ జరిపింది. ఆ విచారణను కాదంటూ ఎన్ఐఏకు కేసును అప్పగిస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. దీనిపై ఏం చేయాలన్న దానిపై సీఎం చంద్రబాబుతో డీజీపీ ఠాకూర్, అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్‌లు రెండుసార్లు భేటీ అయ్యారు. తొలుత కేంద్ర నిర్ణయానికి నిరసనగా ఒక లేఖ రాయాలని అనుకుని ఆ మేరకు రాశారు. అయినా కేంద్రం నుంచి స్పందన లేకపోవడంతో.. ఇప్పుడు హైకోర్టులో పిటిషన్ వేయాలని నిర్ణయించారు. అలాగే హైకోర్టులో ఈ అంశం తేలేవరకు కోడికత్తికి సంబంధించిన ఏ రికార్డునూ ఎన్ఐఏకు ఇవ్వకూడదని కూడా రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. రాష్ట్రాల హక్కుల విషయంలో కేంద్రం తలదూర్చడం సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధమని.. న్యాయపరంగా బలమైన పోరాటం చేస్తామని ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి.

కోర్టు ఆదేశాలను పాటించడం లేదు.. ఇది ధిక్కారమే!

- కోడికత్తి రికార్డుల స్వాధీనంపై ఎన్ఐఏ మెమో.. కోర్టులో వాదనలు.. నేడు తీర్పు!

విజయవాడ, జనవరి 17(ఆంధ్రజ్యోతి): కోడికత్తి కేసులో రికార్డులకు సంబంధించిన ఎన్ఐఏ తరఫు న్యాయవాది విజయవాడ కోర్టులో గురువారం మెమోను దాఖలు చేశారు. ఈ కేసు బదిలీ అయిన తర్వాత రికార్డులు అప్పగించాలని ఎన్ఐఏ లోగడ ఓ పిటిషన్‌ను దాఖలు చేసింది. దర్యాప్తునకు సంబంధించిన రికార్డులను ఎన్ఐఏకు అప్పగించాలని విశాఖ పోలీసులను అప్పట్లో కోర్టు ఆదేశించింది. అయితే ఈ ఆదేశాలను పోలీసులు పాటించడం లేదని తాజాగా ఎన్ఐఏ మెమోను దాఖలు చేసింది. దీనిపై ఎన్ఐఏ తరఫు న్యాయవాది వాదనలను వినిపించారు. 'రికార్డులు ఎన్ఐఏకు అప్పగించమని కోర్టు ఆదేశించింది. వాటిని విశాఖ పోలీసులు పాటించడం లేదు. ఇది కోర్టు ఉత్తర్వుల ఉల్లంఘన కిందికి వస్తుంది. ఎన్ఐఏ చట్టంలో సెక్షన్ 4లో స్పష్టంగా ఉంది. దీనిపై విశాఖ పోలీసులకు ఆదేశాలు ఇవ్వాలి' అని వాదించారు. 'ఎన్ఐఏ అధికారులు, రాష్ట్ర పోలీసు ఉన్నతాధికారులు కూర్చుని మాట్లాడుకోవచ్చు కదా' అని న్యాయమూర్తి ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. తీర్పును శుక్రవారానికి వాయిదా వేశారు.

సానుభూతి కోసమే చేశా!

- ఎన్ఐఏ విచారణలో కోడికత్తి నిందితుడి స్పష్టీకరణ.. ముగిసిన కస్టడీ



హైదరాబాద్, జనవరి 17(ఆంధ్రజ్యోతి): వైసీపీ అధ్యక్షుడు జగన్‌పై కోడికత్తితో దాడి చేసిన నిందితుడు శ్రీనివాసరావు ఎన్ఐఏ కస్టడీ ముగిసింది. దీంతో శుక్రవారం అతడిని విజయవాడ కోర్టులో హాజరుపర్చనున్నారు. రిమాండ్‌లో ఉన్న శ్రీనివాస్‌ను కోర్టు అనుమతితో ఎన్ఐఏ అధికారులు గత శనివారం కస్టడీలోకి తీసుకున్నారు. ఆదివారం సాయంత్రం హైదరాబాద్ కార్యాలయానికి తీసుకువచ్చి విచారణ మొదలు పెట్టారు. ఎన్ఐఏ అధికారులు ఎన్ని విధాలుగా ప్రశ్నించినా... కేవలం సానుభూతి కోసమే జగన్‌పై దాడి చేశానని, ఇందులో ఎలాంటి కుట్ర, రాజకీయ ప్రమేయం లేదని చెప్పుకొచ్చాడు. కేసు తీవ్రత నేపథ్యంలో ఢిల్లీ నుంచి వచ్చిన ప్రత్యేక బృందం రెండు రోజులపాటు శ్రీనివాస్‌ను ప్రశ్నించింది. కొన్నింటికి అతను సమాధానాలు చెప్పినా మరికొన్ని ప్రశ్నలకు జవాబు దాటవేయగా ఇంకొన్నింటికి మౌనంగా ఉన్నట్లు తెలిసింది. జైల్లో శ్రీనివాసరావు రాసిన 25 పేజీల లేఖను జైలు అధికారుల నుంచి తీసుకున్న ఎన్ఐఏ బృందం అందులోని అంశాల్ని విశ్లేషించింది. స్వల్ప అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్న శ్రీనివాస్‌కు రెండు దఫాలుగా గాంధీ ఆస్పత్రిలో వైద్య పరీక్షలు చేయించారు. న్యాయవాది సమక్షంలో విచారించి, మొత్తం ప్రక్రియను వీడియో తీశారు.

కోడికత్తి కేసులో చంద్రబాబు అతిచేశారు: సీపీఐ నేత రామకృష్ణ

విజయవాడ, జనవరి 17: జగన్‌పై కోడికత్తి దాడి కేసుపై చంద్రబాబు కాస్త అతిగా స్పందించారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ విమర్శించారు. దాడిజరిగిన వెంటనే చంద్రబాబు జగన్‌కు ఫోన్‌చేసి పరామర్శించి వుంటే బావుండేదన్నారు. కేసును ఎన్ఐఏకు అప్పగించిన తర్వాత అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ 5 పేజీల లేఖ రాయడం సరికాదన్నారు. కేరళలో మోదీ ప్రసంగం ప్రజాస్వామ్యాన్ని కించపరిచేట్టు ఉందని ఆరోపించారు. శబరమల విషయంలో కేరళ ప్రభుత్వమే సొంతంగా నిర్ణయం తీసుకుందని వ్యాఖ్యానించడం సరికాదన్నారు. దీనిపై సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందన్న విషయాన్ని మోదీ గుర్తించుకోవాలన్నారు. మోదీ తీరు చూస్తుంటే కమ్యూనిస్టు వ్యతిరేకత ఆయన నరనరాలలో ఉందని తెలుస్తున్నదని అన్నారు.

జగన్ వ్యాఖ్యలు సరికాదు

- సీసీ కెమెరాలు పనిచేస్తున్నాయి
- విశాఖ విమానాశ్రయం డైరెక్టర్ ప్రకాశ్‌రెడ్డి



విశాఖపట్నం, జనవరి 17(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం జిల్లాలో తన పర్యటన ప్రారంభమైన నాటి నుంచి (3 నెలలుగా) విమానాశ్రయంలో సీసీ కెమెరాలు పనిచేయడం మానేశాయని వైసీపీ అధ్యక్షుడు జగన్ చేస్తున్న ఆరోపణలు అవాస్తవమని విమానాశ్రయం డైరెక్టర్ జి.ప్రకాశ్‌రెడ్డి పేర్కొన్నారు. ఆయన గురువారం 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. 'విశాఖ విమానాశ్రయంలో మొత్తం 65 సీసీ కెమెరాలు ఉన్నాయి. అన్నీ సక్రమంగా పనిచేస్తున్నాయి. ఏదైనా కెమెరా పనిచేయకపోతే వెంటనే తెలిసిపోతుంది. అరగంటలో రిపేర్ చేస్తాం. విమానాశ్రయంలో నెల రోజుల ఫుటేజీ కూడా ఉంటుంది. జగన్‌పై దాడి జరిగిన రోజు(అక్టోబరు 25) కూడా సీసీ కెమెరాలు పనిచేశాయి. ఆ ఫుటేజీతోపాటు అంతకుముందు నెల రోజులు ఫుటేజీని పోలీసులకు అందజేశాం. మొత్తం 16 హార్డ్‌డిస్కుల సమాచారాన్ని పోలీసులు తీసుకెళ్లారు. ఎవరో కావాలనే సీసీ కెమెరాలు పనిచేయడం లేదని తప్పుగా ప్రచారం చేస్తున్నారు' అని ప్రకాశ్‌రెడ్డి పేర్కొన్నారు. ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) నిర్వహించే విమానాశ్రయాల్లో ప్రముఖులు విశ్రాంతి తీసుకునే ప్రాంతాన్ని 'వీఐపీ లాంజ్'గా పేర్కొంటారు. ఏఏఐ పరిభాషలో దానిని 'రిజర్వుడ్ లాంజ్'గా వ్యవహరిస్తారు. ఆ ప్రాంతంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయకూడదని బ్యూరో ఆఫ్ సివిల్ ఏవియేషన్ సెక్యూరిటీ (బీసీఏఎస్) నిబంధనలు స్పష్టం చేస్తున్నాయి. అయితే ఆ లాంజ్‌లోకి వెళ్లే మార్గం, వచ్చే మార్గం సీసీ కెమెరాల పరిధిలో ఉంటాయి. కానీ లోపల ఏమి జరుగుతున్నదీ రికార్డు చేయడానికి ఎటువంటి కెమెరాలు ఉండవు. జగన్‌పై ఇదే లాంజ్‌లో దాడి జరిగింది. అక్కడ సీసీ కెమెరాలు లేకపోవడంతో ఆ ఘటన రికార్డు కాలేదన్నారు.

అంతర్రాష్ట్ర బదిలీల గడువు 6 నెలలు పెంపు

అమరావతి, జనవరి 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విభజన నేపథ్యంలో స్థానికత ప్రాతిపదికన పరస్పర అంగీకార బదిలీలు, భార్యాభర్తలు ఒకే ప్రాంతంలో ఉండాలన్న నిబంధన మేరకు ఏపీ, తెలంగాణ మధ్య ఉద్యోగుల బదిలీకి అవకాశం కల్పించారు. ఈ గడువు 2018 డిసెంబరు 31తో ముగిసింది. దీనిని 2019 జూన్ 30 వరకు పెంచుతూ స్టేట్ రీఆర్గనైజేషన్ ఎక్స్ అఫీషియో ముఖ్యకార్యదర్శి ప్రేమ్‌చంద్రారెడ్డి మెమో జారీ చేశారు.

హైకోర్టుకు మూడు ధర్మాసనాల ఏర్పాటు

అమరావతి, జనవరి 17(ఆంధ్రజ్యోతి): పాలనాపరమైన సౌలభ్యం కోసం ఏపీ హైకోర్టుకు మూడు ధర్మాసనాలు ఏర్పాటు చేస్తున్నట్లు హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రవీణ్ కుమార్ గురువారం ఆదేశాలు జారీ చేశారు. ఈనెల 21నుంచి ఇవి అమలులోకి వస్తాయి. తాత్కాలిక సీజే, జస్టిస్ ఎం.సత్యనారాయణమూర్తితో ప్రథమ ధర్మాసనం ఏర్పాటైంది. ఇది పిల్, క్రిమినల్ కేసులు, హెబియస్ కార్పస్ వ్యవహారాలు, సుమోటో కేసులు, అన్ని రిట్ పిటిషన్లు తదితరాలను విచారిస్తుంది. అలాగే జస్టిస్ ఎస్‌వీ భట్, జస్టిస్ ఎన్.గంగారావుతో ఏర్పాటైన ద్వితీయ ధర్మాసనం... ఐటీ ట్రైబ్యునల్ అప్పీళ్లు, సెంట్రల్ ఎక్సైజ్, ఇన్‌కం ట్యాక్స్ కేసులు తదితరాలను విచారిస్తుంది. ఇక భూఆక్రమణలు, కుటుంబ వ్యవహారాలను జస్టిస్ ఏవీ శేషసాయి, జస్టిస్ జె.ఉమాదేవితో కూడిన ధర్మాసనం విచారించనుంది. మిగిలిన ఏడుగురు న్యాయమూర్తులు వేర్వేరుగా(సింగిల్ జడ్జిలు)గా కేసుల విచారణ జరుపనున్నారు.

యూసీలు పంపండి.. నిధులు రాబట్టండి: సీఎస్

అమరావతి, జనవరి 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం వివిధ పథకాల కింద అందించే నిధులను పూర్తిస్థాయిలో వినియోగించడంతో పాటు, యూసీలు సకాలంలో పంపి మరిన్ని నిధులు రాబట్టేందుకు కృషి చేయాలని సీఎస్ అనిల్‌చంద్ర పునేఠ ఆదేశించారు. గురువారం అమరావతి సచివాలయంలో ఆయన వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. కేంద్ర పథకాలకు శాఖల వారీగా మంజూరైన నిధులు, వాటికి సంబంధించి కేంద్రానికి యూసీలు పంపిన వివరాలను ఆర్థికశాఖ కార్యదర్శి పీయూష్ కుమార్ వివరించారు.

ఆంధ్రజ్యోతి
13
స్పోర్ట్స్
విజయవాడ ● శుక్రవారం 18 జనవరి 2019




ఆ ఇద్దరిదీ తప్పే...కానీ

ముంబై: జీవితంలో అందరూ తప్పులు చేస్తారని, వాటిని గుర్తించి మెరుగైన వ్యక్తిత్వం రూపొందించుకున్నవారే ఇతరుల ప్రశంసలందుకుంటారని భారత మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ అన్నాడు. పాండ్యా-రాహుల్ అనుచిత వ్యాఖ్యలపై స్పందిస్తూ వారిరువురూ తమ చర్యకు చింతిస్తూ ఉంటారని, త్వరలోనే తమ తప్పును దిద్దుకుంటారన్న ఆశాభావాన్ని వ్యక్తంచేశాడు. మనమంతా మానవమాత్రులమని, తప్పులను దిద్దుకుంటూ ఉన్నత వ్యక్తిత్వాన్ని అలవరచుకోవడమే జీవిత పరమార్థమన్నాడు. వారు పాల్గొన్న టీవీ షోను తాను చూడలేదని, ఇప్పటికైనా వారు తమ తప్పు తెలుసుకుని మున్ముందు ఇటువంటి పొరపాట్లకు తావీయరని భావిస్తున్నానన్నాడు.

జాఫర్@19 వేలు

నాగపూర్: విదర్భకు చెందిన వెటరన్ బ్యాట్స్‌మన్ వసీం జాఫర్ ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో మరో అరుదైన ఘనత సాధించాడు. 19 వేల పరుగుల మైలురాయిని చేరుకొన్న ఐదో ఆటగాడిగా జాఫర్ నిలిచాడు. రంజీ ట్రోఫీ క్వార్టర్ ఫైనల్‌లో విదర్భ-ఉత్తరాఖండ్ మధ్య జరుగుతున్న మ్యాచ్‌లో జాఫర్ ఈ క్లబ్‌లో చేరాడు. సునీల్ గవాస్కర్ (25,834), సచిన్ టెండూల్కర్ (25,396), రాహుల్ ద్రావిడ్ (23,794), వీవీఎస్ లక్ష్మణ్ (19,730) ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో అత్యధిక పరుగులు జాబితాలో జాఫర్ కంటే ముందున్నారు.

న్యూజిలాండ్ జట్టులో లాథమ్, గ్రాండ్‌హోమ్


లాథమ్

వెల్లింగ్టన్: భారత్‌తో వన్డే సిరీస్‌కు న్యూజిలాండ్ జట్టులో టామ్ లాథమ్, గ్రాండ్‌హోమ్‌కు చోటు కల్పించారు. ఐదు వన్డేల ఈ సిరీస్‌లో తొలి మ్యాచ్ ఈనెల 23న నేపియర్‌లో జరగనుంది. అయితే తొలి మూడు వన్డేలకే 14 మంది సభ్యుల కివీస్ జట్టును గురువారం ప్రకటించారు. శ్రీలంకతో మూడు వన్డేలకు లాథమ్, గ్రాండ్‌హోమ్‌లకు విశ్రాంతి ఇచ్చారు. అంతేకాదు శ్రీలంకతో ఏకైక టీ20కి దూరంగా ఉన్న కెప్టెన్ కేన్ విలియమ్సన్, పేసర్ ట్రెంట్ బౌల్ట్‌కూడా పునరాగమనం చేశారు. వరల్డ్ నెంబర్ 2 భారత్‌తో సిరీస్‌కు పటిష్ఠమైన జట్టును ఎంపిక చేసినట్టు న్యూజిలాండ్ కోచ్ గ్యారీ స్టెడ్ చెప్పాడు.

న్యూజిలాండ్ జట్టు: కేన్ విలియమ్సన్ (కెప్టెన్), ట్రెంట్ బౌల్ట్, డౌ బ్రేస్‌వెల్, గ్రాండ్‌హోమ్, లాకీ ఫెర్గ్యూసన్, గప్తిల్, మ్యాట్ హెన్రీ, టామ్ లాథమ్, కొలిన్ మన్రో, హెన్రీ నికోలస్, మిచెల్ శాంట్నర్, ఇష్ సోధి, టిమ్ సౌథీ, రాస్ టేలర్.



కోహ్లీ
ఫించ్

భారత్ గెలిస్తే చరిత్రే

మూడు టీ20ల సిరీస్‌ను 1-1తో సమం చేసుకున్నారు.. ఏడు దశాబ్దాలుగా అందకుండా ఊరించిన టెస్టు సిరీస్ 2-1తో మన ఖాతాలో పడింది.. ఇక టీమిండియా తాజాగా మరో ఘనతపై కన్నేసింది. ఆసీస్ గడ్డపై ఇప్పటిదాకా భారత జట్టు ద్వైపాక్షిక వన్డే సిరీస్ ను సాధించలేదు. ఇప్పుడు కోహ్లీ సేన ముందున్న లక్ష్యం.. ఎలాగైనా చివరి మ్యాచ్‌లో నెగ్గడమే. అదే జరిగితే ఇక్కడ అరుదైన 'డబుల్' సిరీస్‌ను సాధించినట్టవుతుంది. అంతే కాకుండా దాదాపు రెండు నెలలుగా సాగుతున్న ఆస్ట్రేలియా పర్యటనకు దిగ్విజయంగా వీడ్కోలు పలకవచ్చు...

ఆసీస్ సారథి ఫించ్ సొంతగడ్డపై ఆడిన గత 15 ఇన్నింగ్స్‌ల్లో ఒకే హాఫ్ సెంచరీతో కేవలం 228 పరుగులు చేశాడు. సగటు 15.20. ఈ 15 ఇన్నింగ్స్‌ల్లో ఎనిమిది సార్లు సింగిల్ డిజిట్ స్కోర్లు, రెండు డకౌట్లు ఉన్నాయి.

సందిగ్ధంలో పాండ్యా-రాహుల్ భవితవ్యం

న్యూఢిల్లీ: బీసీసీఐకి సంబంధించిన వ్యాజ్యాలను సుప్రీంకోర్టు వారంపాటు వాయిదా వేయడంతో సస్పెన్షన్ ఎదుర్కొంటున్న హార్దిక్ పాండ్యా, కేఎల్ రాహుల్ భవితవ్యం డోలాయమానంలో పడింది. ఒక టీవీ టాక్‌షోలో మహిళలపై పాండ్యా, రాహుల్ అనుచిత వ్యాఖ్యలు చేయడంతో వారిపై విచారణ పూర్తయ్యేదాకా నిరవధిక సస్పెన్షన్ విధిస్తూ చర్యలు తీసుకుంది. వారిద్దరూ క్షమాపణ చెప్పినా బోర్డు వేటు వేసింది. దీంతో వారి వ్యవహారం కోర్టు దాకా చేరింది. అయితే గురువారం సుప్రీంకోర్టు బీసీసీఐకి సంబంధించిన వ్యాజ్యాల విచారణను వారంపాటు వాయిదా వేసింది. కాగా ఆసీస్, కివీస్ వన్డే సిరీస్‌లకు దూరమైన రాహుల్, పాండ్యా ఇప్పటికే భారత్‌కు చేరుకున్న సంగతి తెలిసిందే.

ఆఖరాట..

అటూ.. ఇటూ!

● చివరి వన్డే బరిలోకి కోహ్లీ సేన ● గెలిస్తే తొలి ద్వైపాక్షిక సిరీస్ ● ఒత్తిడిలో ఆసీస్

ఉ.7.50 నుంచి సోనీ సిక్స్, సోనీ టెన్-3లో..

మెల్‌బోర్న్: గెలిచి తీరాల్సిన మ్యాచ్‌లో ఉత్కంఠభరిత విజయాన్నందుకున్న టీమిండియా ఆఖరి మ్యాచ్ కోసం సిద్ధమవుతోంది. నేడు (శుక్రవారం) ఆస్ట్రేలియాతో ఎంసీజీ మైదానంలో మూడో వన్డే జరగనుంది. 2016లో ధోనీ నేతృత్వంలో భారత్ ఐదు వన్డేల సిరీస్‌లో 1-4తో చిత్తయింది. తాజాగా జరిగేది ఆసీస్ గడ్డపై రెండో ద్వైపాక్షిక సిరీస్. మూడు వన్డేల ఈ సిరీస్ ప్రస్తుతం 1-1తో సమంగా ఉంది. తొలి వన్డేలో 34 పరుగులతో ఓడిన భారత జట్టు రెండో వన్డేలో కెప్టెన్ విరాట్ కోహ్లీ శతకం, ఎంఎస్ ధోనీ అర్ధ సెంచరీ కారణంగా సిరీస్‌లో నిలవగలిగింది. కంగారూ నేలపై 1985లో జరిగిన ప్రపంచ చాంపియన్‌షిప్‌లో.. 2008 సీబీ సిరీస్‌లోనూ భారత్ విజేతగా నిలిచింది. అయితే దాంట్లో భారత్, ఆసీస్ సహా ఇతర జట్లు కూడా పాల్గొన్నాయి. మరోవైపు అన్ని విభాగాల్లో పటిష్ఠంగా కనిపిస్తున్న భారత్ మూడు వన్డేల సిరీస్‌ను 2-1తో గెలిస్తే ఈ టూర్‌ను 'ఓటమి' లేకుండా ముగించినట్టవుతుంది. 2016లో చివరిసారి ఎంసీజీలో జరిగిన వన్డేలో భారత్ 295/6 స్కోరు సాధించినా ఆసీస్ మూడు వికెట్ల తేడాతో గెలిచింది.

ఐదో బౌలర్ సమస్య..: తొలి మ్యాచ్‌లో ఎదురైన పరాభవానికి ప్రతీకారం తీర్చుకున్న భారత్ ఆత్మవిశ్వాసంతో కనిపిస్తోంది. ముఖ్యంగా రెండో వన్డేలో ఛేదన కోసం బరిలోకి దిగిన జట్టు ఎలాంటి ఒత్తిడీ లేకుండా లక్ష్యాన్ని అధిగమించగలిగింది. దీనికి ఆరంభంలో కోహ్లీ గట్టి పునాది వేస్తే ధోనీ తనదైన శైలిలో ఫినిషింగ్ టచ్ ఇచ్చి విమర్శకులకు సమాధానమిచ్చాడు. రోహిత్ శర్మ ఆసీస్ నేలపై ఎప్పటిలాగే మెరుగైన రీతిలో ఆడుతున్నాడు. ధవన్ కూడా టచ్‌లోకి రావడం జట్టుకు సానుకూలాంశం. ఇక బౌలింగ్‌లో జట్టును ఐదో బౌలర్ సమస్య వేధిస్తోంది. భువనేశ్వర్, షమి ఇప్పటిదాకా ప్రత్యర్థిని ఇబ్బందిపెట్టగలిగారు. మధ్య ఓవర్లలో స్పిన్నర్లు కుల్దీప్ యాదవ్, జడేజా పరుగులను నియంత్రించగలుగుతున్నారు. అయితే పాండ్యా లేకపోవడంతో రెండు వన్డేల్లోనూ ఐదో బౌలర్‌గా ఫుల్ టైమ్ సీమర్‌ను ఆడించాల్సి వచ్చింది. కానీ ఖలీల్ (0/55), సిరాజ్ (0/76) ఏమాత్రం ప్రభావం చూపలేదు. ఈనేపథ్యంలో ఆల్‌రౌండర్ విజయ్ శంకర్, మరో స్పిన్నర్ చాహల్ పరిశీలనలో ఉన్నారు. ఈ ఇద్దరూ గురువారం ఎంసీజీలో కఠోరంగా ప్రాక్టీస్ చేశారు. ఒకవేళ విజయ్‌శంకర్‌తో అరంగేట్రం చేయిస్తే అతడు పది ఓవర్ల కోటా పూర్తిచేయగలడా? అనే సందేహం టీమ్ మేనేజ్‌మెంట్‌కు ఉంది. రాయుడును తప్పించి జాదవ్‌కు అవకాశమిస్తే ఆల్‌రౌండర్‌గానూ ఉపయోగపడగలడని భావిస్తున్నారు. దీంతో తుది జట్టు ఎంపిక కోహ్లీకి సవాల్ కానుంది.

ఆసీస్ జట్టులో రెండు మార్పులు..: రెండో వన్డేలో ఎదురైన పరాజయం ఆస్ట్రేలియాను నిరాశకు గురిచేసింది. ఆఖరి వరకు ఆధిక్యంలో ఉన్నా ధోనీ ఆటతో వారికి షాక్ తగిలింది. ఈసారి తమ లోపాలను సరిచేసుకుని విజేతగా నిలవాలనుకుంటోంది. బ్యాటింగ్‌లో షాన్ మార్ష్ వరుసగా 54, 131తో ఫామ్ కొనసాగిస్తున్నాడు. హ్యాండ్స్‌కోంబ్, మ్యాక్స్‌వెల్, స్టొయినిస్ కూడా జట్టుకు ఉపయోగపడుతున్నా కెప్టెన్ ఫించ్, కేరీల నుంచి శుభారంభం దక్కడం లేదు. ఈ మ్యాచ్ కోసం ఆసీస్ రెండు మార్పులు చేసింది. సిరీస్‌లో ఒక్క వికెట్ తీయలేకపోయిన ఆఫ్ స్పిన్నర్ లియాన్ స్థానంలో లెగ్ స్పిన్నర్ ఆడమ్ జంపాను తీసుకోగా గాయంతో బాధపడుతున్న బెహ్రెన్‌డార్ఫ్ స్థానంలో బిల్లీ స్టాన్‌లేక్ తుది జట్టులోకి వచ్చాడు.

జట్లు (అంచనా)

భారత్: రోహిత్, ధవన్, కోహ్లీ (కెప్టెన్), రాయుడు/కేదార్ జాదవ్, ధోనీ, దినేశ్ కార్తీక్, జడేజా, భువనేశ్వర్, కుల్దీప్ యాదవ్, ఖలీల్/విజయ్ శంకర్, షమి.

ఆసీస్ (తుది జట్టు): ఫించ్ (కెప్టెన్), అలెక్స్ కేరీ, ఖవాజా, షాన్ మార్ష్, హ్యాండ్స్‌కోంబ్, స్టొయినిస్, మ్యాక్స్‌వెల్, సిడిల్, రిచర్డ్‌సన్, ఆడమ్ జంపా, స్టాన్‌లేక్.

పిచ్-వాతావరణం

అడిలైడ్‌లో ఎదురైన తీవ్ర ఎండ నుంచి ఆటగాళ్లకు ఇక్కడ ఉపశమనం లభించనుంది. అత్యధికంగా 27 డిగ్రీలు నమోదు కావచ్చు. డ్రాప్ ఇన్ పిచ్ కావడంతో పేసర్లకు అనుకూలించవచ్చు. అయితే ఎంసీజీలాంటి భారీ మైదానంలో పరుగుల కోసం బ్యాట్స్‌మెన్ కష్టపడాల్సిందే..

5 మెల్‌బోర్న్‌లో ఆస్ట్రేలియాతో జరిగిన 14 వన్డేల్లో భారత జట్టు 5 సార్లు గెలిచింది.


అవినీతి కేసులో సాయ్ డైరెక్టర్ అరెస్టు



న్యూఢిల్లీ: కేంద్ర క్రీడాప్రాధికార సంస్థ (సాయ్)లో అవినీతి కలకలం.. పెండింగ్ బిల్లులను క్లియర్ చేసేందుకు లంచం అడిగారనే ఆరోపణలపై డైరెక్టర్ ఎస్కే శర్మతో పాటు మరో ముగ్గురు అధికారులను సీబీఐ అరెస్టు చేసింది. ఈ సందర్భంగా స్థానిక జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలోని సాయ్ ప్రధాన కార్యాలయాన్ని సీజ్ చేశారు. సాయ్ కార్యాలయాల స్టేషనరీ, విద్యుత్ పరికరాలు, ఫర్నిచర్లకు సంబంధించిన రూ.19 లక్షల విలువైన బిల్లులను పాస్ చేసేందుకు అధికారులు 3 శాతం లంచం అడిగారని సీబీఐకి ఫిర్యాదు అందింది. ఈ నేపథ్యంలో దాడులకు దిగిన కేంద్ర దర్యాప్తు సంస్థ.. ఎస్కే శర్మతో పాటు జూనియర్ అకౌంట్స్ అధికారి హరీందర్ ప్రసాద్, సూపర్‌వైజర్ లలిత్ జాలీ, యూడీసీ వీకే శర్మలను అదుపులోకి తీసుకున్నారు. అలాగే ప్రైవేట్ కాంట్రాక్టర్ మన్‌దీప్ అహూజా, అతడి సహాయకుడిని కూడా అరెస్ట్ చేశారు. అయితే ఆరు నెలల క్రితమే సాయ్ డైరెక్టర్ జనరల్ ఈ వ్యవహారాన్ని క్రీడా మంత్రి దృష్టికి తెచ్చారని, ఆయన సూచనతో సీబీఐకి లేఖ రాశారని సాయ్ వర్గాలు తెలిపాయి. తమ ప్రభుత్వం అవినీతిని ఏమాత్రం సహించదని క్రీడా మంత్రి రాజ్యవర్ధన్ సింగ్ రాథోడ్ ఓ వీడియో సందేశం ద్వారా తెలిపాడు.

క్వార్టర్స్‌లో శ్రీకాంత్, సైనా

● అశ్విని-సిక్కిరెడ్డి జోడీ ఇంటిదారి ● మలేసియా ఓపెన్


శ్రీకాంత్

కౌలాలంపూర్: భారత స్టార్ షట్లర్లు సైనా నెహ్వాల్, కిడాంబి శ్రీకాంత్ మలేసియా ఓపెన్‌లో క్వార్టర్ ఫైనల్లోకి అడుగుపెట్టారు. గురువారం జరిగిన మహిళల సింగిల్స్ రెండో రౌండ్లో సైనా 21-14, 21-16తో పుయి ఇన్ ఇప్ (హాంకాంగ్)ను చిత్తు చేసింది. పురుషుల సింగిల్స్ రెండో రౌండ్లో వాంగ్ వింగ్ (హాంకాంగ్)పై శ్రీకాంత్ పోరాడి నెగ్గాడు. హోరాహోరీగా సాగిన తొలి సెట్‌ను 23-21తో శ్రీకాంత్ దక్కించుకున్నాడు. రెండో సెట్‌లో పుంజుకున్న వాంగ్ 21-8తో శ్రీకాంత్‌ను చిత్తు చేసి గెలుపు అవకాశాలను సజీవంగా ఉంచుకున్నాడు. నిర్ణయాత్మక ఆఖరి సెట్‌లో అద్భుతంగా పోరాడిన శ్రీకాంత్ 21-18తో ప్రత్యర్థిని చిత్తు చేసి మ్యాచ్‌ను గెలుచుకున్నాడు. మరో తెలుగు షట్లర్ పారుపల్లి కశ్యప్ 17-21, 23-25తో అంథోని సినిసుక చేతిలో ఓటమి పాలయ్యాడు. మహిళల డబుల్స్‌లో మహాదేవి-రిజికి ద్వయం 21-18, 21-17తో అశ్విని పొన్నప్ప-సిక్కిరెడ్డి జోడీపై విజయం సాధించింది.

క్వార్టర్స్ ఫైట్: మహిళల సింగిల్స్ క్వార్టర్స్ ఫైనల్‌లో మాజీ ప్రపంచ చాంపియన్ నొజోమి ఒకుహరా (జపాన్)తో సైనా తలపడనుంది. ఇప్పటివరకు వీరిరువురు 12 సార్లు తలపడ్డారు. సైనా 8 సార్లు నెగ్గగా, 4 సార్లు ఒకుహరా విజయం సాధించింది. గత ఏడాది జరిగిన డెన్మార్క్, ఫ్రెంచ్ ఓపెన్‌లో కూడా వరల్డ్ నెంబర్ 2 ఒకుహరాను సైనా ఓడించింది. ఇక, పురుషుల క్వార్టర్స్‌లో సన్ వాన్ హో (కొరియా)తో శ్రీకాంత్ తలపడనున్నాడు.

తోమర్ మెరుపుల్!

ఎంపీ యోధ విజయం

ఢిల్లీ సుల్తాన్స్-యూపీ దంగల్
రాత్రి 7 నుంచి సోనీ-ఈఎస్‌పీఎన్‌లో

పంచకుల: చావో రేవో పోరులో సందీప్ తోమర్ సత్తా చాటడంతో ప్రొ.రెజ్లింగ్ లీగ్‌లో గురువారంనాటి పోరులో ఎంపీ యోధ 4-3తో ముంబై మహారథిపై విజయం సాధించింది. 3-3తో పోరు సమమైన నేపథ్యంలో కీలకమైన ఆఖరి 57 కిలోల విభాగంలో తోమర్ 10-7తో ఇబ్రగీమ్‌ను చిత్తు చేయడంతో ఎంపీ జేయకేతనం ఎగరేసింది. పురుషుల 65 కి. విభాగంలో 1-0తో ఎంపీ శుభారంభం అందుకుంది. కానీ 125 కిలోల సూపర్ వెయిట్ కేటగిరీలో ముంబై నెగ్గి 1-1తో సమం చేసింది. 53 కిలోల విభాగంలో ముంబై రెజ్లర్ వినేష్ ఫొగట్ 15-0తో రితూ ఫొగట్‌ను చిత్తు చేసి జట్టును 2-1 ఆధిక్యంలో నిలిపింది. అయితే 57 కేజీల కేటగిరిలో పూజా 7-4తో బెట్జబెత్‌పై నెగ్గడంతో ఎంపీ 2-2తో సమం చేసింది. 86 కి. విభాగంలో దీపక్ పూనియా-దీపక్‌పై గెలవడంతో మహారథి 3-2 ఆధిక్యం ప్రదర్శించింది. 62 కిలోల బౌట్‌లో మొనలోవా 4-0తో శిల్పీ యాదవ్‌ను ఓడించడంతో యోధ 3-3తో స్కోరు సమం చేసింది.

ఎదురులేని సెరెనా


జొకోవిచ్

● మూడో రౌండ్‌లో జొకోవిచ్
● హలెప్, వీనస్ ముందంజ
● ఆస్ట్రేలియన్ ఓపెన్

మెల్‌బోర్న్: ఆస్ట్రేలియా దిగ్గజం మార్గరెట్ కోర్ట్ (24) రికార్డు టైటిల్స్‌పై కన్నేసిన అమెరికా వెటరన్ సెరెనా విలియమ్స్ ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో మూడో రౌండ్‌లోకి దూసుకెళ్లింది. ప్రపంచ నెంబర్ వన్ నొవాక్ జొకోవిచ్ (సెర్బియా)తో పాటు టాప్‌సీడ్ సిమోనా హలెప్, వీనస్ విలియమ్స్ టోర్నీలో ముందంజ వేశారు. గురువారం జరిగిన మహిళల సింగిల్స్ రెండో రౌండ్‌లో 16వ సీడ్ సెరెనా 6-2, 6-2తో వరుస సెట్లలో బౌచర్డ్ (కెనడా)పై అలవోక విజయం సాధించింది. 70 నిమిషాల పోరులో రెండు ఏస్‌లు సంధించిన విలియమ్స్.. మొత్తం 63 పాయింట్లు దక్కించుకుంది. 2017లో ఇక్కడ విజేతగా నిలిచిన సెరెనా ఓపెన్ ఎరాలో స్టెఫీ గ్రాఫ్ (22) అత్యధిక టైటిళ్ల రికార్డును బ్రేక్ చేసిన సంగతి తెలిసిందే. కాగా, మరో మ్యాచ్‌లో ప్రపంచ నెం:1 హలెప్ (రొమేనియా) 6-3, 6-7 (5/7), 6-4తో సోఫియా కెనిన్ (అమెరికా)పై గెలిచింది. వీనస్ విలియమ్స్ (అమెరికా) 6-3, 4-6, 6-0తో కోర్నెట్ (ఫ్రాన్స్)పై నెగ్గింది. నాలుగో సీడ్ నవోమీ ఒసాకా (జపాన్) 6-2, 6-4తో జిదన్‌సెక్ (స్లొవేనియా)పై, ఎలినా స్వితోలినా (ఉక్రెయిన్) 6-4, 6-1తో విక్టోరియా కుజ్‌మోవా (స్లొవేకియా)పై, మాడిసన్ కీస్ (అమెరికా) 6-3, 6-4తో అనస్తసియా పొటపోవా (రష్యా)పై గెలిచారు. 13వ సీడ్ సెవత్సోవా (లాత్వియా) 6-3, 3-6, 6-2తో క్వాలిఫయర్ ఆండ్రెస్క్యూ (కెనడా)ను ఓడించింది.

జొకోవిచ్ సులువుగా: పురుషుల సింగిల్స్ రెండో రౌండ్‌లో టాప్‌సీడ్ జొకోవిచ్ 6-3, 7-5, 6-4తో వరుస సెట్లలో జో విల్‌ఫ్రెడ్ సోంగా (ఫ్రాన్స్)పై సులువైన విజయం సాధించాడు. 12 ఏస్‌లతో ప్రత్యర్థిని హడలెత్తించిన జకో మొత్తం 100 పాయింట్లు గెలిచాడు. ఎనిమిదో సీడ్ కీ నిషికోరి (జపాన్) 6-3, 7-6 (8/6), 5-7, 5-7, 7-6 (10/7)తో ఇవో కార్లోవిచ్ (క్రొయేషియా)పై కష్టపడి నెగ్గాడు. ఇక నాలుగు గంటల హోరాహోరీ పోరులో 17వ ర్యాంకర్ మిలోస్ రౌనిక్ (కెనడా) 6-7 (4/7), 7-6 (8/6), 7-6 (13/11), 7-6 (7/5)తో స్టాన్ వావ్రింకా (స్విట్జర్లాండ్)పై చెమటోడ్చి గెలిచాడు.



68 ఏళ్లలో తొలిసారి..

● రంజీ సెమీస్‌లో కేరళ

వయనాడ్: రంజీ సెమీస్‌లోకి ప్రవేశించి కేరళ చరిత్ర సృష్టించింది. గుజరాత్‌తో క్వార్టర్స్‌లో కేరళ 113 పరుగులతో రికార్డు విజయం సాధించింది. 1950లో రంజీ అరంగేట్రం చేసిన కేరళ సెమీస్‌కు చేరడం ఇదే తొలిసారి. మూడో రోజైన గురువారం.. 195 పరుగుల లక్ష్య ఛేదనలో బాసిల్ థంపీ (5/27), సందీప్ వారియర్ (4/30) దెబ్బకు.. గుజరాత్ 31.3 ఓవర్లలో 81 పరుగులకే కుప్పకూలింది. అంతకుముందు తొలి ఇన్నింగ్స్‌లో కేరళ 185, గుజరాత్ 162 రన్స్ చేశాయి. రెండో ఇన్నింగ్స్‌లో కేరళ 171 స్కోరు సాధించింది. ఇక ఉత్తరాఖండ్‌తో క్వార్టర్స్‌లో వసీం జాఫర్ (206) డబుల్ సెంచరీతో రాణించడంతో.. విదర్భ 3వ రోజు చివరకు తొలి ఇన్నింగ్స్‌లో 6 వికెట్ల నష్టానికి 559 పరుగులు చేసింది. యూపీతో క్వార్టర్స్‌లో సౌరాష్ట్ర తొలి ఇన్నింగ్స్‌లో 208 పరుగులకు ఆలౌటైంది. రెండో ఇన్నింగ్స్‌లో యూపీ 172/8 స్కోరు చేసింది. రాజస్థాన్‌తో జరుగుతున్న మరో క్వార్టర్స్‌లో 184 రన్స్ లక్ష్య ఛేదనలో కర్ణాటక 3 వికెట్లకు 45 రన్స్‌తో కష్టాల్లో పడింది.

అమ్మకానికి రాజస్థాన్ రాయల్స్!

న్యూఢిల్లీ: ఐపీఎల్ ఫ్రాంచైజీ రాజస్థాన్ రాయల్స్ అమ్మకానికి వచ్చింది. దాని యజమాని మనోజ్ బదాలే రాయల్స్‌లో తన సింహభాగం వాటాను అమ్మేందుకు సిద్ధమయ్యారు. ఈమేరకు ఆయన బీసీసీఐని సంప్రదించారు. అందుకు బోర్డు కూడా ఓకే చెప్పింది. 12వ సీజన్ ప్రారంభానికి ముందే ఆర్థిక కష్టాల నుంచి జట్టును బయటపడేసేందుకు మనోజ్ ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది.

భారత్‌లో ఇంగ్లండ్ మహిళల టూర్

న్యూఢిల్లీ: ఐసీసీ మహిళల చాంపియన్ షిప్‌లో భాగంగా ఇంగ్లండ్ క్రికెట్ జట్టు వచ్చే నెలలో భారత్‌కు రానుంది. ఈ పర్యటనలో ఇంగ్లిష్ జట్టు భారత్‌తో మూడు వన్డేలు, మూడు టీ20లు ఆడనుంది. వచ్చే నెల 22న తొలి వన్డే, 25న రెండో వన్డే, 28న మూడో వన్డే మ్యాచ్ జరగనుంది. వన్డేలన్నీ కూడా ముంబైలోని వాంఖడే స్టేడియంలో నిర్వహిస్తున్నారు. టీ20 సిరీస్ మార్చి 4న ప్రారంభం కానుండగా మ్యాచ్‌లన్నీ గువాహటిలోనే జరుగుతాయి. 7న రెండో టీ20, 9న మూడో టీ20 జరగనుంది.


సెరెనా



వాట్సాప్ ద్వారా విడాకులు

- భారత్‌లో భర్త.. అమెరికాలో భార్య
- నాగ్‌పూర్ ఫ్యామిలీ కోర్టులో డైవోర్స్

నాగ్‌పూర్, జనవరి 17: వాట్సాప్ మనుషులను దగ్గర చేయడమే కాదు.. ఈ మెసెంజర్ యాప్ ద్వారా విడాకులు కూడా తీసుకోవచ్చు! నమ్మశక్యంగా లేకపోయినా ఇదే నిజం! నాగ్‌పూర్ ఫ్యామిలీ కోర్టు వేదికగా భారత్‌లో ఉన్న భర్త(37).. అమెరికాలో ఉన్న భార్య(35) వాట్సాప్ వీడియో కాల్ ద్వారా విడాకులు తీసుకున్నారు. విచారణకు హాజరుకాలేనని భార్య చెప్పడంతో ఆమె విజ్ఞప్తి మేరకు వాట్సాప్ వీడియో కాల్‌కు న్యాయస్థానం ఓకే చెప్పి తీర్పు ఇచ్చింది. వారి పెళ్లి 2013 ఆగస్టు 11న సికింద్రాబాద్‌లో పెద్దల సమక్షంలోనే జరిగింది. అనంతరం ఇద్దరూ అమెరికాకు చెందిన ఆటోమొబైల్ కంపెనీలో ఉద్యోగంలో చేరారు. వీసా గడువు ముగియడంతో ఆమె కొన్నాళ్లు నాగ్‌పూర్‌లోని అత్తవారింట్లో ఉంది. ఆ సమయంలో మనస్పర్థలు వచ్చాయి. ఆ తర్వాత స్టూడెంట్ వీసాపై ఆమె మిషిగన్ వెళ్లింది. అమెరికాలో భార్యభర్తల మధ్య దూరం ఇంకా పెరిగింది. భర్త నాగ్‌పూర్ వచ్చి ఫ్యామిలీ కోర్టులో విడాకులకు పిటిషన్ వేశాడు. ఇద్దరికీ కౌన్సెలింగ్ చేయాలని చూసినా భార్యాభర్తలిద్దరూ విదేశాల్లో ఉండటంతో సాధ్యపడలేదు. ఆమె తరఫు న్యాయవాది కోర్టు బయట వివాదం పరిష్కారానికి చొరవ తీసుకున్నారు. ఈ భేటీకి భర్త అతని తరఫు న్యాయవాది హాజరు కాగా.. ఆమె రాలేదు. ఆమె తరఫున సోదరుడు రాగా.. తను వాట్సాప్ వీడియో కాల్‌లో మాట్లాడింది. లాంగ్ లీవ్ దొరకలేదని, వాట్సాప్ వీడియో కాల్ ద్వారా తన వాంగ్మూలాన్ని నమోదు చేసుకోవాలన్న ఆమె విజ్ఞప్తిని కోర్టు పరిగణనలోకి తీసుకుంది. ఇద్దరికీ విడాకులు మంజూరు చేసింది. అయితే భరణం కింద వన్ టైమ్ సెటిల్మెంట్‌గా రూ.10 లక్షలు భార్యకు చెల్లించాలని భర్తను ఆదేశిస్తూ న్యాయమూర్తి స్వాతి చౌహాన్ తీర్పు చెప్పారు.



రైలులో యువతికి నెలసరి

- సాయం చేయాలని స్నేహితుడి ట్వీట్

న్యూఢిల్లీ, జనవరి 17: సాంకేతికత సాయంతో ప్రయాణికుల సమస్యలను పరిష్కరిస్తున్న రైల్వే శాఖ.. మరోసారి ఉదారతను చాటుకుంది. నెలసరి సమస్యతో బాధపడుతున్న ఓ యువతికి ట్యాబ్లెట్లు, ప్యాడ్లు అందించి ప్రయాణికుల మన్ననలు అందుకుంది. బెంగళూరు నుంచి బళ్లారికి ప్రయాణిస్తున్న యువతికి రైలులో నెలసరి వచ్చింది. ఆమె తన బాధను మరో ట్రైన్‌లో ప్రయాణిస్తున్న స్నేహితుడికి చెప్పింది. అతడు వెంటనే 'ఇండియన్ రైల్వేస్ సేవ' యాప్‌ను ఆశ్రయించాడు. రైల్వే మంత్రికే రాత్రి 11 గంటలకు ట్వీట్ చేశాడు. ఆరు నిమిషాల్లోనే అధికారులు యువతి ఉన్న బోగీ వద్దకు చేరుకుని వివరాలు ధ్రువీకరించుకున్నారు. తర్వాతి స్టేషన్ అయిన అరసికేరు అధికారులకు సమాచారమివ్వగా.. వారు ఆమెకు కావాల్సిన సామగ్రిని సిద్ధం చేశారు. ట్రైన్ రాగానే వాటిని అందించారు.

అస్థానాకూ ఉద్వాసన

- మరో ముగ్గురు సీబీఐ అధికారులపైనా వేటు

న్యూఢిల్లీ, జనవరి 17: సీబీఐ ఉన్నతాధికారుల కీచులాటలో మరో ప్రధాన పాత్రధారి అయిన ప్రత్యేక డైరెక్టర్ రాకేశ్ అస్థానాను కూడా కేంద్రం బదిలీ చేసింది. డైరెక్టర్ అలోక్ వర్మకు ఉద్వాసన పలికిన వారంలోపే ఆయనతో ఘర్షణ పడి వ్యవహారాన్ని రచ్చకీడ్చిన అస్థానాను సాగనంపింది. ఆయనతో పాటు మరో ముగ్గురు సీనియర్ ఉన్నతాధికారులు- జాయింట్ డైరెక్టర్ అరుణ్ కుమార్ శర్మ, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ మనీశ్ కుమార్ సిన్హా, ఎస్పీ జయంత్ నాయక్‌నవాడేలపై కూడా బదిలీ వేటు వేసింది. సీబీఐలో వారి ఉద్యోగ కాలపరిమితిని కుదించేసి వారిని వివిధ విభాగాలకు బదిలీ చేస్తూ కేంద్రం గురువారం రాత్రి ఉత్తర్వులు వెలువరించింది. ఇందులో ఏకే శర్మ, మనీశ్ సిన్హాలిద్దరూ అలోక్ వర్మ టీమ్‌లోని వారు. ఈ నెల 24న సీబీఐ కొత్త డైరెక్టర్ ఎంపికకు ముగ్గురు సభ్యుల ఉన్నత స్థాయి కమిటీ సమావేశం కానుంది. ఆలోగానే సంస్థను ప్రక్షాళించి కొత్త రక్తం ఎక్కించాలన్నది ప్రభుత్వ ప్రయత్నంగా కనబడుతోంది. రాకేశ్ అస్థానాను పౌర విమానయాన శాఖ భద్రతా విభాగానికి బదిలీ చేయగా- ఏకే శర్మను సీఆర్‌పీఎఫ్ అదనపు డైరెక్టర్ జనరల్‌గా నియమించారు. మనీశ్ సిన్హాను పోలీస్ శిక్షణ-అధ్యయన విభాగానికి ట్రాన్స్‌ఫర్ చేశారు. అస్థానా గుజరాత్‌కు చెందిన సీనియర్ ఐపీఎస్ అధికారి. నరేంద్ర మోదీ అండదండలతో ఆయన సీబీఐ ప్రత్యేక డైరెక్టర్‌గా నియమితులయ్యారని, ఆయన మోదీకి ఇష్టుడనీ, కావల్సిన వ్యక్తి అనీ రాహుల్‌గాంధీ ఆరోపించడం కూడా సంచలనం రేపింది.

ఐదుగురు పాక్ సైనికులు హతం

న్యూఢిల్లీ, జనవరి 17: కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తున్న పాకిస్థాన్ సైన్యానికి భారత్ గట్టి బదులిచ్చింది. గురువారం పూంఛ్ జిల్లాలో ఎల్‌వోసీ వెంబడి మళ్లీ కాల్పులకు తెగబడిన పాక్ సైనికులను మన భద్రతా దళాలు తిప్పికొట్టాయి. అయిదుగురు పాక్ సైనికులను మట్టుబెట్టడంతో పాటు ఏడు బంకర్లను ధ్వంసం చేశాయి. ఈ నెల 11న నౌషేరా, సుందర్‌బనీ సెక్టార్లలో ఎల్‌వోసీ వద్ద సంభవించిన పేలుడులో భారత ఆర్మీ అధికారి, సైనికుడు అమరులయ్యారు. రాజౌరీ, పూంఛ్ జిల్లాల్లో ఈ నెల మొదట్నుంచీ పాక్ కాల్పులకు తెగబడుతోంది. కాగా, పాక్‌కు తగిన బదులివ్వడానికి భారత సైన్యం ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందని లెఫ్టినెంట్ జనరల్ రణ్‌బీర్ సింగ్ స్పష్టం చేశారు.



హాల్ హెలికాప్టర్లు అదరహో

గాలిలో నుంచే లక్ష్య ఛేదన.. పరీక్షలు విజయవంతం

బెంగళూరు, జనవరి 17: శత్రుదేశాలు ప్రయోగించే క్షిపణులను గాలిలోనే తుత్తునియలు చేయగల తేలికపాటి యుద్ధ హెలికాప్టర్లను హిందూస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్(హాల్) తయారు చేసింది. సొంతంగా డిజైన్ చేసి, అభివృద్ధి చేసిన ఈ హెలికాప్టర్ల ద్వారా.. గాలిలో దూసుకొచ్చే శత్రు క్షిపణులను కచ్చితత్వంతో పేల్చేయవచ్చు. ఆయుధ సమన్వయ పరీక్షలన్నీ పూర్తి చేసుకొని వాయుసేనలో అడుగుపెట్టేందుకు సిద్ధంగా ఉన్నాయి. గురువారం ఒడిసాలోని చందీపూర్ ఇంటిగ్రేటెడ్ టెస్ట్ రేంజ్‌లో జరిగిన పరీక్షల్లో ఈ హెలికాప్టర్లు లక్ష్యాన్ని కచ్చితత్వంతో ఛేదించాయి. సముద్రమట్టానికి ఎక్కువ ఎత్తులో ఉండే సియాచిన్ లాంటి ప్రాంతాల్లోనూ పని చేయగల సామర్థ్యం వీటికి ఉందని హాల్ తెలిపింది. హెల్మెట్ మౌంటెడ్ సైట్, ఫార్వర్డ్ లుకింగ్ ఇన్‌ఫ్రారెడ్ సైటింగ్ సిస్టంను కలిగి ఉండటం వీటి ప్రత్యేకతలు.


ఫీజెవరు కట్టాలి?

- రీయింబర్స్ ఇస్తారా?.. మాఫీ చేస్తారా?
- 'ఈడబ్ల్యూఎస్'పై విద్యా సంస్థల ఆందోళన
- స్పష్టత ఇవ్వని కేంద్రం
- వారంలోగా విధివిధానాలు
- బడ్జెట్ సమావేశాల్లో బిల్లు

న్యూఢిల్లీ, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ఆర్థికంగా బలహీనవర్గాలకు (ఈడబ్ల్యూఎస్) 10 శాతం రిజర్వేషన్ల కల్పన వ్యవహారం కేంద్రానికే గాక వేలాది విద్యాసంస్థలకు ఓ ఆర్థిక సవాల్‌గా మారుతోంది. ముఖ్యంగా ప్రైవేటు రంగంలోని విశ్వవిద్యాలయాలు, సాంకేతిక, ఇతర విద్యాసంస్థలు, కాలేజీల్లో సైతం వచ్చే విద్యాసంవత్సరం నుంచి దీన్ని అమలు చేస్తామని కేంద్ర మానవవనరుల అభివృద్ధిశాఖ మంత్రి ప్రకాష్ జావడేకర్ ప్రకటించడం అనేక సంస్థల యాజమాన్యాల్లో ఆందోళన నింపింది. ఇప్పటి వరకూ ఎస్సీ ఎస్టీ, ఓబీసీ రిజర్వేషన్లను కూడా ఈసంస్థలు అమలుచేయని పరిస్థితి ఉంది. కేవలం ప్రభుత్వ ఆధ్వర్యంలోని వర్సిటీలు, కాలేజీలు, సంస్థలకే ఇది పరిమితమవుతూ వచ్చింది. ఇక మీదట కేవలం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లే కాక అన్ని కుల-ఆధారిత రిజర్వేషన్లను కూడా ప్రైవేటు విద్యాసంస్థలు అమలు చేసి తీరాలని జావడేకర్ తేల్చిచెప్పారు.

ఎవరు భరిస్తారు?

అసలు విద్య అనేది రాష్ట్ర జాబితాలో ఉన్న అంశం. కేంద్రం రిజర్వేషన్ల చట్టం తెచ్చినా దాన్ని రాష్ట్ర ప్రభుత్వాల ఆమోదం కోసం పంపాలి. రాష్ట్ర అసెంబ్లీలు కూడా తమ పరిధి వరకూ అన్ని అంశాలతో చట్టం చేయాలి. 10 శాతం రిజర్వేషన్లు కల్పిస్తున్నట్లు రాజ్యాంగ సవరణ చేసినా భరించే బాధ్యత ప్రధానంగా రాష్ట్రాల మీదే ఉంటుంది. కేంద్రం దీన్ని సొంతంగా భరించే పరిస్థితి ఉండదని నిపుణులు అంటున్నారు. మరి ఆర్థికంగా వెనుకబడ్డ వర్గాలకు చెందిన విద్యార్థుల ఫీజులెవరు కడతారు? అన్న ప్రశ్న ఉత్పన్నమవుతోంది. ఫీజు రీయింబర్స్‌మెంటును రాష్ట్రాలు ఇస్తాయా? ఇవ్వడం తలకు మించిన భారమవుతుందంటున్నారు. ఒకవేళ ఇచ్చినా అది సకాలంలో అందదు. ఒక ఏడాది ఇవ్వాల్సిన మొత్తం మూడు నాలుగు విడతల్లో రెండేళ్ల తరువాత చెల్లిస్తున్న సందర్భాలు చాలా రాష్ట్రాల్లో ఉన్నాయి. లేక ఈడబ్ల్యూఎస్ వర్గాలకు ఫీజులను మాఫీ చేస్తారా? అసలు మాఫీ లేకుండా రిజర్వేషన్లు తేవడమే కరెక్టు కాదని నిపుణులు చెబుతున్నారు. ప్రైవేటు విద్యాసంస్థలు ఫీజు మాఫీ చేసే ప్రశ్నే ఉండదు. నిజానికి అనేక ప్రైవేటు సంస్థలు ఫీజుల మీదే నడుస్తుంటాయి. వాటి ఆధారంగానే విస్తరణ కార్యక్రమాలు చేపడతాయి. "నేను రూ 100 కోట్లు రుణం తీసుకున్నాను. ఏటా 2000 మందిని తీసుకుని ఆ డబ్బు చెల్లించేయవచ్చనుకున్నాను. కానీ నా అంచనాలు ఇపుడు తలకిందులవుతున్నాయి. కేంద్రం చెప్పినదాని ప్రకారం ఏడో వేతన సంఘం సిఫారసులను అమలు చేసి లెక్చరర్లకు జీతాలివ్వాలి. దానికే బోల్డంత అవుతుంది. ఇపుడు తాజాగా ఇది" అని మహారాష్ట్రలోని ఓ ప్రైవేటు విద్యాసంస్థ యజమాని అసహనం వ్యక్తం చేశారు. మరి దీనికి ప్రత్యామ్నాయాలేంటి? ఒకటి... ఫీజు రీఇంబర్స్‌మెంటు. రెండు... ఇతర విద్యార్థుల ఫీజుల పెంపుకు అనుమతి ఇవ్వడమేనని ఓ ప్రైవేటు వర్సిటీ ఉపకులపతి అన్నారు.



రాష్ట్రాలకు స్వేచ్ఛ

రిజర్వేషన్ల కల్పనకు ఉన్న షరతుల్లో ఒకటైన వార్షిక ఆదాయ పరిమితిని పెంచుకునే వెసులుబాటును రాష్ట్ర ప్రభుత్వాలకు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. జాతీయ స్థాయిలో వార్షిక ఆదాయం రూ.8లక్షల లోపు ఉన్న కుటుంబాలకే రిజర్వేషన్లు వర్తిస్తాయని సూత్రప్రాయంగా ప్రకటించిన ప్రభుత్వం... ఆయా రాష్ట్రాల్లో 10 శాతం రిజర్వేషన్ అమలుకు సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాలే ఆదాయ పరిమితిని నిర్ణయించే అధికారం ఇచ్చేందుకు యోచిస్తోంది. పార్లమెంటు రాజ్యాంగ సవరణ పూర్తిచేయడంతో- విధివిధానాలను రూపొందించడానికి కేంద్ర సామాజిక న్యాయ, సాధికారత శాఖ అధికారులు చర్చలు చేపడుతున్నారు. కేవలం ఆదాయ పరిమితి మాత్రమే కాకుండా ఇతర షరతులను కూడా సడలించే అధికారం రాష్ట్రాలకు ఇస్తే ఎలా ఉంటుందన్న కోణంలో అధికారులు ఆలోచిస్తున్నట్లు తెలిసింది. స్థానిక అవసరాలకు అనుగుణంగా షరతులను సడలింపు ఇవ్వడం సమంజసమేనని అధికార వర్గాలు వాదిస్తున్నాయి. ఈ వెసులుబాటును రాష్ట్రాలకు ఇస్తే వచ్చే న్యాయపరమైన చిక్కుల గురించి న్యాయశాఖ అధికారులతో సామాజిక న్యాయశాఖ అధికారులు చర్చిస్తున్నారు. మరోవారం రోజుల్లో ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లకు సంబంధించిన విధివిధానాలతో కూడిన ఆఫీస్ మెమోరాండం వస్తుందని అధికార వర్గాలు వెల్లడించాయి.

వ్యతిరేకిస్తున్న దళిత సంఘాలు

ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లలో విధించిన వార్షిక ఆదాయ పరిమితిపై దళిత సంఘాలు వ్యతిరేకిస్తున్నాయి. దళిత హక్కుల సంఘాల ఐక్య కూటమి అయిన నేషనల్ క్యాంపెయిన్ ఆన్ దళిత్ హ్యూమన్ రైట్స్ (ఎన్‌సీడీహెచ్‌ఆర్) సంస్థ నేత రమేశ్ నాథన్ మాట్లాడుతూ... ఎస్సీ, ఎస్టీలు స్కాలర్‌షిప్ పొందడానికి ఇటీవలి కాలం వరకు రూ. 2.5 లక్షల వార్షిక ఆదాయం ఉండేదని, ఈ మధ్యకాలంలోనే దాన్ని రూ. 6 లక్షలకు పెంచారని తెలిపారు. ఈ క్రమంలో ఎస్సీ, ఎస్టీలు ప్రయోజనాలు పొందడానికి విధించిన వార్షిక ఆదాయ పరిమితి కంటే అగ్రవర్ణాలు రిజర్వేషన్లు పొందేందుకు విధించిన పరిమితి ఎక్కువగా ఉండడం దారుణమని వ్యాఖ్యానించారు.

రెండు బిల్లులు!

రిజర్వేషన్లను ప్రైవేటు సంస్థల్లోనూ అమలు చేసేట్లు ఓ బిల్లును వచ్చే బడ్జెట్ సమావేశాల్లో కేంద్రం ప్రవేశపెట్టే అవకాశం ఉంది. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ వర్గాలకు ప్రైవేటు సంస్థల్లోనూ రిజర్వేషన్లు ఇవ్వాలన్న ఏకైక పాయింటు మీద ఆ బిల్లుకు రూపకల్పన చేస్తున్నారు. "కేంద్రం రెండు బిల్లులను ప్రవేశపెట్టాల్సి ఉంటుంది. ఎందుకంటే రాజ్యాంగానికి 93వ సవరణ చేసి ఆర్టికల్ 15 (5) పేరిట ఓ నిబంధనను చేర్చారు. ఉన్నతస్థాయి ప్రైవేటు సంస్థల్లో ఎస్సీ ఎస్టీ ఓబీసీలకు రిజర్వేషన్లు ఇవ్వాలని, ఇందుకు ప్రత్యేకంగా ఓ చట్టం చేయాలని అందులో పేర్కొన్నారు. కానీ ఇన్నేళ్లూ ప్రత్యేక చట్టమంటూ ఏమీ చెయ్యలేదు. తాజాగా 103వ సవరణ ద్వారా ఈడబ్ల్యూఎస్‌లకు 10% రిజర్వేషన్లకు సంబంధించి మరో చట్టం చేయాలి" అని సామాజిక న్యాయసాధికారిత నిపుణుడు పీఎస్ కృష్ణన్ సూచించారు.

9/11 దాడిలో తప్పించుకున్నాడు నైరోబీ ఉగ్రదాడిలో బలయ్యాడు



న్యూయార్క్, జనవరి 17: అమెరికాలో 9/11 ఉగ్రదాడిలో తప్పించుకున్న జాసన్ స్పిండ్లర్ మంగళవారం కెన్యాలోని నైరోబీలో ఉగ్రవాదుల చేతిలోనే ప్రాణాలు కోల్పోయాడు. సోమాలీకి చెందిన అల్ షబాబ్ అనే ఉగ్రవాద సంస్థకు చెందిన మిలిటెంట్లు నైరోబీలోని ఓ లగ్జరీ హోటల్‌పై మంగళవారం దాడి చేసి 21 మందిని పొట్టనబెట్టుకున్నారు. మృతుల్లో దేవ్ ఇంటర్నేషనల్ కంపెనీ వ్యవస్థాపకుడు జాసన్ కూడా ఉన్నాడని అతడి సోదరుడు ఫేస్‌బుక్ ద్వారా తెలిపాడు.

డేరా చీఫ్‌కు మళ్లీ జైలు శిక్ష

- జర్నలిస్టు హత్యలో యావజ్జీవం



పంచకుల(హరియాణ), జనవరి 17: డేరా సచ్చా సౌదా చీఫ్ గుర్మీత్ రామ్ రహీమ్ సింగ్‌కు మరో కేసులో యావజ్జీవ కారాగార శిక్ష పడింది. గతంలో అత్యాచారం కేసులో 20 ఏళ్ల జైలు శిక్ష అనుభవిస్తున్న గుర్మీత్‌కు... ఒక జర్నలిస్టును హత్య చేసిన కేసులో సీబీఐ ప్రత్యేక కోర్టు గురువారం యావజ్జీవ జైలు శిక్ష విధించింది. అతనితోపాటు ఇతర దోషులు నిర్మల్ సింగ్, కుల్‌దీప్ సింగ్, కృష్ణలాల్‌కు కూడా జైలు శిక్ష పడింది. సిర్సాలో 2002 అక్టోబరులో రాంచందర్ ఛత్రపతి అనే జర్నలిస్టు హత్యకు గురయ్యారు. గుర్మీత్ ఆశ్రమంలో లైంగిక దోపిడీపై ఓ అజ్ఞాత వ్యక్తి రాసిన లేఖను ప్రచురించిన ఈ జర్నలిస్టును గుర్మీత్ మనుషులు హత్య చేశారు.

135 కార్యక్రమాలతో గ్రామాభివృద్ధి ప్రణాళికలు

- కేంద్రం కొత్త మార్గదర్శకాలు

అమరావతి, జనవరి 17(ఆంధ్రజ్యోతి): 135 కార్యక్రమాలతో గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలు(జీపీడీపీ) రూపొందించేందుకు కేంద్ర ప్రభుత్వం మార్గదర్శకాలను రూపొందించింది. ఇప్పటికే ఉన్న మార్గదర్శకాలను సవరించి కొత్త మార్గదర్శకాలకు రూపకల్పన చేశారు. అందుబాటులో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకోవడంతో పాటు వనరుల వినియోగంలో సామాజిక న్యాయం ఉండేలా తాజా ప్రణాళికలు ఉండాలని మార్గదర్శకాల్లో పేర్కొన్నారు. స్థానికుల భాగస్వామ్యం ఎక్కువగా ఉండాలని, ఈ ప్రణాళికల రూపకల్పనలో ఉపాధి హామీ పథకం, 14వ ఆర్థికసంఘం నిధుల లభ్యత బట్టి ఆయా రాష్ట్రాలు వేర్వేరుగా ప్రణాళికలు సిద్ధం చేసుకునేలా స్వేచ్ఛ కల్పించారు. స్థానికుల భాగస్వామ్యంతో పాటు గ్రామసభ నిర్వహణ, మౌలిక వసతుల కల్పనకు, పెట్టుబడులకు ప్రాధాన్యమివ్వడం, ప్రజలకు విస్తృతమైన సేవలు, ఆదాయ వనరుల కల్పనపై దృష్టి, పాలక వర్గాలను మరింత భాగస్వామ్యం వహించేలా చేయడం, ఐటీ సేవలు, ఇతర పథకాలతో అనుసంధానం చేయడం తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుంటారు.

అమిత్ షాకు 'పంది జ్వరం'!

- కర్ణాటక శాపం తగిలింది.. ఇక్కడి రాజకీయాల్లో జోక్యం చేసుకుంటే అంతే!
- కాంగ్రెస్ ఎంపీ హరిప్రసాద్ తీవ్ర విమర్శలు .. విరుచుకుపడ్డ బీజేపీ

బెంగళూరు, జనవరి 17: బీజేపీ, కాంగ్రెస్ మధ్య అగ్గి రాజేస్తున్న 'కర్నాటకం'.. వ్యక్తిగత దూషణలతో గురువారం మరో మలుపు తీసుకుంది. 'స్వైన్ ఫ్లూ'తో బాధపడుతున్న బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షాను ఉద్దేశించి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, రాజ్యసభ సభ్యుడు బీకే హరిప్రసాద్ తీవ్ర విమర్శలు చేశారు. షాకు 'పంది జ్వరం' వచ్చిందని ట్వీట్ చేశారు. అంతేకాదు.. 'కర్ణాటక రాజకీయాల్లో జోక్యం చేసుకున్నందుకు శాపం తగిలింది' అని ఆయన పేర్కొన్నారు. కర్ణాటక రాజకీయాల్లో ఇంకా జోక్యం చేసుకుంటే 'రోగం.. పంది జ్వరంతో ఆగదు. డయేరియా, వాంతులు వస్తాయి' అని విమర్శించారు. ఈ సందర్భంగా కర్ణాటక రాజకీయాలను ప్రస్తావించారు. 'కర్ణాటకను షేక్ చేయలేరని మోదీ, అమిత్ షాలకు బాగా తెలుసు. రాఫెల్ వ్యవహారంలో రూ.30వేల కోట్లు దోచుకున్నారు. ఆ సొమ్ములతో కర్ణాటక ప్రభుత్వాన్ని అస్థిరపర్చాలని అనుకుంటున్నారు. అమిత్ షా ఒక డూప్లికేట్, బోగస్ చాణక్యుడని ఈ విషయంలో తేలిపోయింది. ఈ సంక్షోభానికి షా, అతని పార్టీయే కారణం. ఆరుగురు ఎమ్మెల్యేలను కిడ్నాప్ చేసి ముంబై హోటల్‌లో పెట్టారు. వారిని బందీలుగా చేసి బయట బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు కాపలా కాస్తున్నారు. కొందరు ఎమ్మెల్యేలు తిరిగి రావడంతో ఆందోళన చెందిన అమిత్‌షా.. దిగులుతో అనారోగ్యం పాలయ్యారు' అని ట్వీట్ చేశారు.

పిచ్చాస్పత్రిలో చేర్చండి!

హరిప్రసాద్ విమర్శలపై కర్ణాటక బీజేపీ ట్విటర్‌లో విరుచుకుపడింది. 'బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా ఆరోగ్య పరిస్థితిని హేళన చేస్తున్న కాంగ్రెస్ ఎంపీ బీకే హరిప్రసాద్ మానసిక స్థితికి అద్దం పడుతుంది. ఈ రోగ్‌కు మానవ విలువలు నేర్పాల్సిన అవసరం ఉంది. నాగరిక సమాజంలో ఉండటానికి అతను అనర్హుడు. వెంటనే పిచ్చాస్పత్రి(ఎన్‌ఐఎంహెచ్‌ఏఎన్‌ఎస్)లో చేర్చాలని రాహుల్‌గాంధీని కోరుతున్నాం' అని పేర్కొంది. బీకేను కాంగ్రెస్ నుంచి బహిష్కరించి, అమిత్ షాకు బహిరంగ క్షమాపణ చెప్పాలని బీజేపీ అధికార ప్రతినిధి జీవీఎల్ నరసింహారావు డిమాండ్ చేశారు. కాంగ్రెస్ మాత్రం ఈ వివాదానికి దూరంగా ఉంటోంది. ప్రత్యర్థి పార్టీల నేతలు ఆరోగ్యంగా ఉండాలని, ఎన్నికల్లో పోటీ చేయాలని అధికార ప్రతినిధి ప్రియాంకా చతుర్వేది అన్నారు.

డ్యాన్స్ బార్లు బార్లా!

మహారాష్ట్ర నిషేధాన్ని ఎత్తేసిన సుప్రీంకోర్టు.. 2016 నియంత్రణ చట్ట నిబంధనలు కొట్టివేత

న్యూఢిల్లీ, జనవరి 17: మహారాష్ట్రలో డ్యాన్స్ బార్లు తెరుచుకోవడానికి సుప్రీంకోర్టు అనుమతించింది. డ్యాన్స్ బార్లపై ప్రభుత్వం నిబంధనలు పెట్టొచ్చు కానీ పూర్తిగా నిషేధించడం కుదరదని స్పష్టం చేసింది. డ్యాన్స్ బార్ల లైసెన్సులు, నిర్వహణపై నియంత్రణలు తీసుకొస్తూ 2016లో మహారాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన చట్టంలోని కొన్ని నిబంధనలను సర్వోన్నత న్యాయస్థానం కొట్టేసింది. 2016 చట్టంలో పేర్కొన్న విధంగా ప్రార్థనా మందిరాలకు, విద్యా సంస్థలకు కిలోమీటర్ లోపల దూరంలో డ్యాన్స్ బార్లు పెట్టరాదనడం ఒక విధంగా నిషేధం లాంటిదేనని స్పష్టం చేసింది. ఇది రాజ్యాంగ విరుద్ధమని చెప్పింది. అంతకుముందు ఉన్న నిబంధనల ప్రకారమే డ్యాన్స్ బార్లను నియంత్రించాలని, వాటికి లోబడి డ్యాన్స్ బార్ల దరఖాస్తులను పరిష్కరించాలని జస్టిస్ సిక్రీ నేతృత్వంలోని ధర్మాసనం రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. బార్ డ్యాన్సర్లకు టిప్‌లు ఇవ్వవచ్చని చెప్పింది. అదే సమయంలో వారిమీద నోట్ల వర్షం కురిపించడాన్ని అనుమతించరాదని స్పష్టం చేసింది. డ్యాన్స్ బార్లలో సీసీటీవీ కెమెరాలు అమర్చాలన్న నిబంధననూ సుప్రీంకోర్టు తప్పుబట్టింది. దీని వల్ల వ్యక్తి గోప్యతకు భంగం కలుగుతుందని వ్యాఖ్యానించింది. బారు, డ్యాన్స్ ఫ్లోర్ మధ్య పార్టిషన్ ఉండాలన్న నిబంధననూ సుప్రీంకోర్టు కొట్టేసింది. తీర్పును గౌరవిస్తామని మహారాష్ట్ర ప్రకటించింది.



సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో గురువారం మిఠాయిలు పంచుకుంటున్న బార్ డ్యాన్సర్లు

విశాఖ నుంచి సింగపూర్‌కు విమానం

- అక్టోబరు 27న ప్రారంభం
- నిర్ధారించిన స్కూట్ సంస్థ

అమరావతి, జనవరి 17(ఆంధ్రజ్యోతి): విశాఖ నుంచి సింగపూర్‌కు నేరుగా విమాన సర్వీసును నడపనున్నట్లు స్కూట్ విమానయాన సంస్థ ప్రకటించింది. గురువారం ఆ సంస్థ ఓ ప్రకటన విడుదల చేసింది. సింగపూర్ ఎయిర్‌లైన్స్ గ్రూప్‌కు చెందిన స్కూట్... తక్కువ ధరలకు విమాన ప్రయాణాన్ని అందించే సంస్థగా ప్రపంచంలోనే పేరుగాంచింది. ఇప్పటి వరకూ సింగపూర్ ఎయిర్‌లైన్స్ గ్రూప్‌కే చెందిన సిల్క్ ఎయిర్‌లైన్స్ విశాఖ నుంచి సింగపూర్‌కు విమానాలు నడుపుతూ వచ్చింది. సాంకేతిక కారణాలతో ఆ సంస్థ తన సర్వీసులను నిలిపివేస్తూ ఆ రూట్లను తన సహ సంస్థ స్కూట్‌కు బదిలీ చేసింది. దీనితో కోయంబత్తూరు, త్రివేండ్రం, విశాఖపట్టణంకు స్కూట్ తన సర్వీసులను నడపబోతుంది. త్రివేండ్రం నుంచి సింగపూర్‌కు మే 7 నుంచి, విశాఖ నుంచి అక్టోబరు 27 నుంచి సర్వీసులు ప్రారంభిస్తామని స్కూట్ తెలిపింది. ఇప్పటికే ఈ సంస్థ దేశంలో అమృత్‌సర్, బెంగళూరు, చెన్నై, హైదరాబాద్, కొచి, లక్నో, తిరుచిరాపల్లి నుంచి సర్వీసులను నడుపుతోంది. కొత్త సర్వీసులు ఆరంభమవుతున్న సందర్భాన్ని పురస్కరించుకొని పరిమిత కాలం ఆఫర్‌ని ప్రకటించింది. సింగపూర్ మీదుగా ఆస్ట్రేలియా, ఇండోనేసియా, థాయిలాండ్, మలేసియా, ఫిలిప్పైన్స్, వియత్నాంలలోని 27 నగరాలకు అన్ని పన్నులతో కలిపి ఆరంభ ధర రూ.4500గా ప్రకటించింది. జనవరి 14 నుంచి 28 వరకే టికెట్ల అమ్మకాలు ఉంటాయని సంస్థ తెలిపింది.



తెలంగాణ స్పీకర్‌గా పోచారం!

హైదరాబాద్, జనవరి 17(ఆంధ్రజ్యోతి): ఉత్కంఠకు తెరపడింది. అసెంబ్లీ స్పీకర్‌గా పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఏకగ్రీవ ఎన్నిక ఖరారైంది. స్పీకర్ పదవికి గురువారం ఆయన ఒక్కరే నామినేషన్ దాఖలు చేశారు. దీంతో, అసెంబ్లీ స్పీకర్‌గా పోచారం ఎన్నికైనట్లు శుక్రవారం సభలో ప్రొటెం స్పీకర్ ముంతాజ్ అహ్మద్‌ఖాన్ లాంఛనంగా ప్రకటన చేయనున్నారు. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో టీఆర్ఎస్ 88 స్థానాల్లో విజయం సాధించిన నేపథ్యంలో, స్పీకర్ పదవి ఆ పార్టీకే దక్కడం ముందే ఖాయమైంది. అయినా, ఏకగ్రీవ ఎన్నిక కోసం సీఎం కేసీఆర్ బుధవారం రాత్రి టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, మజ్లిస్ అధినేత అసదుద్దీన్ ఒవైసీ, బీజేపీ అధ్యక్షుడు లక్ష్మణ్‌ను సంప్రదించారు. ఇందుకు అసద్, లక్ష్మణ్ వెంటనే తమ అంగీకారాన్ని తెలపగా, ఉత్తమ్ మాత్రం పార్టీలో చర్చించి తమ నిర్ణయాన్ని ప్రకటిస్తామని చెప్పారు. గురువారం ఉదయం సీఎల్పీ భేటీ తర్వాత స్పీకర్ ఏకగ్రీవ ఎన్నికకు సహకరిస్తామని టీపీసీసీ ప్రకటించింది. కాగా, తమ పార్టీ తరఫున స్పీకర్ అభ్యర్థి ఎవరో గురువారం ఉదయం వరకూ ప్రకటించకుండా సీఎం కేసీఆర్ గోప్యత పాటించారు. అసెంబ్లీ ప్రారంభానికి ముందు తన అధికారిక నివాసం నుంచి ఆయన బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డిని వెంటబెట్టుకొని గన్‌పార్క్ వద్దకు వచ్చారు. ఎలాంటి ప్రకటన చేయకుండా పోచారంతో నామినేషన్ వేయించారు.

కేంద్రంలో వచ్చేది అస్థిర ప్రభుత్వమే

- కేంద్రమంత్రి జయంత్ సిన్హా

ముంబై, జనవరి 17: సార్వత్రిక ఎన్నికల తర్వాత కేంద్రంలో ఏర్పడేది అస్థిర ప్రభుత్వమేనని కేంద్ర మంత్రి జయంత్ సిన్హా అభిప్రాయపడ్డారు. బీజేపీ ప్రభుత్వమే మళ్లీ అధికారంలోకి వస్తుందని ఆ పార్టీ నేతలు గట్టిగా చెబుతున్న సమయంలో.. స్వయంగా కేంద్రమంత్రే ఇటువంటి వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఒక టీవీ చానల్ గురువారం నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవంలో ఆయన మాట్లాడారు. 'లోక్‌సభ ఎన్నికల తర్వాత దేశంలో సుస్థిర ప్రభుత్వం ఏర్పడే దాఖలాలు లేవు. ఇది దేశ ప్రగతికి అంత మంచిది కాదు' అన్నారు.

ఆంధ్రా పెత్తనానికి చెక్ పెడితేనే ఇళ్ల స్థలాలు

- మా ప్యానెల్‌నే గెలిపించండి: టీఎన్జీవో

హైదరాబాద్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఎన్జీవోస్(గచ్చిబౌలి) మ్యూచువల్లీ ఎయిడెడ్ కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ ఎన్నికల్లోనూ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు పునరావృతం కావాలని పలు ఉద్యోగ సంఘాల నేతలు పిలుపునిచ్చారు. ఈ నెల 19న జరిగే ఎన్నికల్లో భాగ్యనగర్ టీఎన్జీవోస్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.సత్యనారాయణ గౌడ్ ప్యానెల్‌ను భారీ మెజారిటీతో గెలిపించి, ఆంధ్రా పెత్తనానికి చెక్ పెట్టాలని కోరారు. గచ్చిబౌలి హౌసింగ్ సొసైటీ భూములను కబ్జా చేసేందుకు కుట్ర జరుగుతోందని వారు ఆరోపించారు. భాగ్యనగర్ టీఎన్జీవోస్ ప్యానెల్ విజయం సాధిస్తేనే ఉద్యోగులందరికీ ఇళ్ల స్థలాలు వస్తాయని తెలిపారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107
Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.